ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 24.06.2025 | సంపుటి :11 సంచిక : 336 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## గ్రామపంచాయతీ ఎన్నికలపై తీర్పు రిజర్వు

- హైకోర్టును నెల గడువు కోరిన ప్రభుత్వం
- నిర్వహణకు 60రోజుల సమయం కావాలన్న ఈసీ

హైదరాబాద్(జనంసాక్షి):ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ హైకో ర్టును కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం విచారణ చేసింది. ఆరు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున న్యాయవాదులు తమ వాదనలను కోర్టుకు వివరించారు. ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలని హైకోర్టు పిటీషనర్లను ప్రశ్నించింది.

మిగతా 2లో..



## 'కంచగచ్చిబౌలి'పై తీర్పు మూడు వారాలకు వాయిదా

దీనిపై సుప్రీంలో విచారణ ఉండటంతో 3 వారాలకు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్(జనంసాక్షి):కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణను సీజే ధర్మాసనం 3 వారాలకు వాయిదా వేసింది.కంచ గచ్చిబౌలి భూములను గతంలో టీజీఐఐసీకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. భూమిని అభివృద్ధి చేసి ఐటీ కంపెనీలకు కేటాయించేలా టీజీఐఐసీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈక్రమంలో భూములను జేసీబీలతో చదును చేసింది. దీన్ని అడ్డుకోవాలంటూ హైకోర్టులో వేర్వేరుగా 4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి.వాదనల

మిగతా 2లో..



## పలు జిల్లాల్లో నేడు వర్షాలు

హైదరాబాద్ పలు ప్రాంతాల్లో వాన

వాతావరణ విభాగం హెచ్చరిక


హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మహానగరంలో పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గత కొద్దిరోజుల నుంచి వాతావరణం చల్ల బడింది. కొంత సేపు ఎండలు పెట్టినా.. మిగితా సమయం మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది నేడు మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో

మిగతా 2లో..

# కేబినెట్ కీలక నిర్ణయాలు

## 201 కి.మీ.ల ఆర్‌ఆర్‌ఆర్‌కు పచ్చజెండా

### చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు నిర్మాణం



- బనకచర్ల ప్రాజెక్టుపై చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తాం
- గోదావరి జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోం
- ఈ విషయమై జులై మొదటి వారంలో కేంద్రం వద్ద వాదనలు వినిపిస్తాం
- కాళేశ్వరంపై ఈనెల 30లోపు కమిషన్‌కు పూర్తి వివరాలు అందిస్తాం
- నేటితో రైతులందరికీ రైతుభరోసా పూర్తవుతుంది
- మంత్రివర్గ సమావేశ వివరాలు మీడియాకు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ మేర ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం సుదీర్ఘంగా భేటీ అయిన కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. రేపటితో రైతులందరికీ రైతు భరోసా పూర్తవుతుందని, 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల మొత్తాన్ని రైతులకు అందజేశామని తెలిపారు. రైతుభరోసా కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రైతుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేబినెట్ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మిగతా 2లో..




# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

## కాంగ్రెస్ శ్రేణులకు మీనాక్షి నటరాజన్ పిలుపు

- 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా
- రాష్ట్ర చరిత్రలోనే ఇదే తొలిసారి
- ఇది ప్రజాప్రభుత్వం సాధించిన ఘనత
- రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు చేపట్టాలి
- నిధుల విడుదలతో రైతుల్లో ఆనందం
- హామీ మేరకు ఎకరాకు రూ.12వేలు విడుదల చేశాం : డిప్యూటి సిఎం భట్టి



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని గాంధీ భవన్ లో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేన్నట్లుగా కేవలం 9 రోజుల్లోనే.. 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసాను ప్రజా ప్రభుత్వం రైతులకు అందించింది అని చెప్పారు. అందులో మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రైతులకు ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ సిలండర్, పేదలకు సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తోందని చెప్పారు.వీటితో పాటుగా ఎవరూ ఊహించనంత పెద్ద స్థాయిలో రైతు భరోసాను ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అమలు చేస్తోందని చెప్పారు. అందులో భాగంగా ఈ సీజన్ మొదలు కాగానే ఎకరాకు గతంలో రూ. 10 వేలుంటే.. మనం రెండువేలు జోడించి.. రూ. 12 వేలు ఇవ్వడం జరిగింది. కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా ఇవ్వడం జరుగుతోంది. గతంలో 5.. 10 ఎకరాలకు మాత్రమే అని పరిమితులు ఉండేదన్నారు. మన ప్రభుత్వంలో అవేమీ లేకుండా వ్యవసాయం యోగ్యమైన

మిగతా 2లో..



## ఉపపోరులో ఆప్ హవా..

గుజరాత్, పంజాబ్‌లో సీట్లు నిలబెట్టుకున్న ఆమ్‌ఆద్మీ పార్టీ

### కేరళలో ఎల్డీఎఫ్‌కు షాక్..కాంగ్రెస్ వశమైన నిలంబర్

### రాజ్యసభకు వెళ్లడం లేదన్న ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):గుజరాత్, పంజాబ్ ఉప ఎన్నికల్లో ఆప్ సత్తా చాటింది. గుజరాత్‌లో బిజెపికి ఓటమి తప్పలేదు. దేశ వ్యాప్తంగా జూన్ 19న ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా.. సోమవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో ఆప్ ఒక స్థానాన్ని కైవసం చేసుకొని సత్తా చాటింది. విశావదర్ సీటు నుంచి భాజపా అభ్యర్థి కిరీట్ పటేల్‌పై ఆప్ నేత గోపాల్ ఇటాలియా 17వేల పైచిలుకు ఓట్లతేడాతో విజయం సాధించారు.

మిగతా 2లో..

# చేతివృత్తులకు చేయూత

## బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్ద ప్రదర్శన: మంత్రి పొన్నం



హైదరాబాద్(జనంసాక్షి):బోనాల ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'చేతివృత్తులకు చేయూత' పేరిట రాష్ట్ర స్థాయి ప్రదర్శన జరగనుంది. ఈ నెల 25 నుంచి 29 వరకు ఐదు రోజులపాటు బీసీ చేతివృత్తుల కళాకారులు తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, అమ్మకం నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో గల ప్రదేశంలో ప్రతిష్ఠాత్మకంగా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారు చేసిన మట్టి పాత్రలు, గౌడన్నల నీరా స్టాల్, మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసల వారి సామగ్రి, పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు, ఇతర బీసీ వర్గాలు తయారు చేసిన కళాకృతులు, అనేక రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఇవే కాకుండా నోరూరించే

మిగతా 2లో..




## పేదల ఇళ్లపై, పోడు భూములపైకి బుల్డోజర్లా?

### చివరికి ఆదివాసీలనూ వదలరా?: కేటీఆర్

### వారి భూములపైనా దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పేదల ఇళ్లపై, పోడు భూములపై బుల్డోజర్ల దాడులు కొనసాగు తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. హైదరాబాద్‌లోని పేదల ఇండ్లు కూల్చడం తర్వాత, ఇప్పుడు ఆదివాసీల పోడు భూములపైనా దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ట్విటర్ వేదికగా స్పందించిన కేటీఆర్, 'పేదలపైనా, అడవులపైనా ఇప్పుడు బుల్డోజర్లు దాడి చేస్తున్నాయి. పోడు భూముల్లో వ్యవసాయం చేసి జీవిస్తున్న ఆదివాసీలపై పోలీసులు దాడి చేయడం అమానుషం' అని పేర్కొన్నారు. ప్రభుత్వానికి పేదల పట్ల మానవత్వం లేదు, ఆడబిడ్డల పట్ల కనికరం లేదు అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేకపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు

మిగతా 2లో..



## 'ఆపరేషన్ సిందూర్'తో ఉగ్రవాదులకు వణుకుపుట్టించాం

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉగ్రవాదులకు వణుకు పుట్టించడంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పహల్గాం ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్‌నాథ్.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన రెండో ఏడాది పదవీ కాలం (ఆగస్టు 2023- జులై 2024)లో చేసిన 51 ప్రసంగాల కలెక్షన్‌తో

మిగతా 2లో..

## నేడు రైతు భరోసా విజయోత్సవ సభ

సచివాలయం రాజీవ్ విగ్రహం వద్ద నిర్వహణ:మంత్రి తుమ్మల



2లో


# ప్రతీకార దాడులు

## ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణుల వర్షం

### దోహాలో వినిపించిన పేలుళ్ల శబ్దాలు .. దాడులు చేసిననట్లు ప్రకటించి టెహ్రాన్

దోహ(జనంసాక్షి):అణు స్థావరాలపై దాడులకు ప్రతీకారంగా అమెరికాకు సర్వశక్తులతో బదులిస్తామని ఇరాన్ హెచ్చరించిన విషయం తెలిసిందే. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను టెహ్రాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశాలు ఉన్నాయంటూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే ఖతార్ రాజధాని దోహాలో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఖతార్ తన గగన తలాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు ప్రకటించిన కొద్దిసేపటికే ఈ పేలుడు శబ్దాలు వినిపించడం గమనార్హం. ఖతార్‌లోని అమెరికాకు చెందిన అల్ ఉదీద్ ఎయిర్ బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ స్థావరం పశ్చిమాసియాలోనే అతిపెద్దది. ఇక్కడ దాదాపు 10 వేలమంది అమెరికన్ సైనికులు ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ సోమవారం సైతం హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభించింది అగ్రరాజ్యమే అయినప్పటికీ.. ముగింపు పలికేది మాత్రం తామేనని పేర్కొంది. ఈ క్రమంలోనే త్వరలోనే పశ్చిమాసియాలోని తమ బలగాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టే అవకాశం ఉందని అమెరికా వర్గాలు అంచనా వేశాయి. అయితే.. దౌత్యపరమైన పరిష్కారానికే తాము మొగ్గుచూపుతున్నట్లు చెప్పాయి. టెహ్రాన్ ప్రతీకార దాడులు చేస్తే.. మరింత విరుచుకుపడతామని

మిగతా 2లో..



ఖతార్ రాజధాని దోహాలోని అమెరికా సైనిక స్థావరాలపైకి దూసుకొస్తున్న ఇరాన్ క్షిపణులు



## మా లక్ష్యానికి చేరువయ్యాం

ఇరాన్‌తో సుదీర్ఘ యుద్ధం ఉండదు.. నెతన్యాహు కీలక ప్రకటన

ఫోర్డో అణుకేంద్రంపై మరోసారి ఇజ్రాయెల్ దాడులు

వార్త 2లో

## మీ దాడులతో మమ్మల్నీ ఏమీ చేయలేరు

అమెరికాపై మరింత శక్తివంతమైన చర్యలకు పాల్పడతాం

ఇజ్రాయెల్ ఘోర తప్పిదం చేసింది: ఖమేనీ

## ఉక్రెయిన్‌పై దాడులు ఆపని రష్యా

### రాజధాని కీవ్‌పై 350కి పైగా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డ పుతిన్ సేనలు

కీవ్(జనంసాక్షి): కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా మాస్కో..కీవ్‌పై 350కి పైగా డ్రోన్లు, 11 క్షిపణులతో విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు.ఈ దాడిలో 10మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా.. అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసం అయినట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నారని..వారిని బయటకు తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికత్స అందిస్తున్నామని.. మరణాల సంఖ్య మరింత

మిగతా 9లో..



## మేడిగడ్డపైనే విచారణలా..!


# సుంకిశాలపై ఎందుకు లేవు?

### ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ ముందంజలో ఉంది: హరీశ్



హైదరాబాద్(జనంసాక్షి):మేడిగడ్డకు ఒక నీతి.. సుంకిశాలకు ఇంకో నీతా అని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేడగడ్డకు చిన్న మరమ్మతులు చేసి గోదావరి నీళ్లను లిఫ్ట్ చేసే అవకాశమున్నా చేయట్లేదన్నారు. భారాసను బద్నాం చేయాలనే సింగిల్ పాయింట్ అజెండాతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సుంకిశాల విషయంలో మాత్రం కాంగ్రెస్ లోపాలు ఎక్కడ బయటపడతాయోనని గుట్టు చప్పుడు కాకుండా మరమ్మతులు మొదలుపెట్టిందని తెలిపారు. "సుంకిశాల మీద నిపుణుల కమిటీ, విజిలెన్స్ కమిషన్, జ్యుడీషియల్ కమిషన్ విచారణ, ఎన్డీఎస్ఏ నివేదికలు ఉండవు. ఇవేవీ లేకుండానే మరమ్మతులు చేయిస్తున్నారు. అదే మేడిగడ్డలో రెండు పియర్స్ కుంగితే అన్ని కమిషన్ల విచారణలు ఉంటాయి. ఎన్డీఎస్ఏ, నిపుణుల కమిటీ, విశ్రాంత ఇంజినీర్లు, ఇంకా వివిధ సంస్థలు ఆ పియర్స్‌కు మరమ్మతులు చేయమని ప్రభుత్వాన్ని అభ్యర్థించినా.. నిర్మాణ

మిగతా 2లో..



## ప్రతీకార దాడులు..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. ఈ పరిణామాల నడుమే ప్రతీకార దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. 'కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్' ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి పశ్చిమాసియాలో దాదాపు 40 వేలమంది సైనికులను అమెరికా మోహరించింది. ఈజిప్టు, ఇరాక్, జోర్డాన్, ఖతర్, సిరియా, సౌదీ అరేబియా తదితర దేశాల్లోని దాదాపు 19 ప్రాంతాల్లో వాషింగ్టన్ సైనిక స్థావరాలు ఉన్నట్లు సమాచారం. వీటిలో ఖతర్‌లోని అల్ ఉదీద్ ఎయిర్ బేస్ అతిపెద్దది. ఇక్కడ దాదాపు 10 వేలమంది సైనికులు ఉన్నారు. ఈ స్థావరంలో గత రెండు వారాల నుంచి దాదాపు 40 మిలిటరీ విమానాలు అదృశ్యమైన శాటిలైట్ చిత్రాలు ఇటీవల బయటకు వచ్చాయి. ఇరాన్ దాడుల నుంచి తమ ఆస్తులను రక్షించుకోవడం కోసమే అమెరికా వాటిని తరలించి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు

## లక్ష్యానికి చేరువయ్యాం

టెల్‌అవీవ్(జనంసాక్షి):ఇజ్రాయెల్‌–ఇరాన్ యుద్ధం, అమెరికా రణరంగంలోకి దిగడంతో పశ్చిమాసియా రగులుతోంది. ఈ ఉద్రిక్తతల వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక ప్రకటన చేశారు. టెహ్రాన్‌తో సుదీర్ఘ యుద్ధం ఉండబోదని అన్నారు. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో తాము చేపట్టిన దాడుల్లో లక్ష్యానికి చేరువైనట్లు వెల్లడించారు. ఇరాన్‌పై అమెరికా బాంబు దాడులు చేసిన అనంతరం నెతన్యాహు మీడియాతో మాట్లాడారు. "టెహ్రాన్‌లోని ఫోర్డో అణుకేంద్రాన్ని అమెరికా తీవ్రంగా ధ్వంసం చేసింది. అణ్వాయుధ కార్యక్రమంలో ఇరాన్‌ను వెనక్కి నెట్టాం. ముప్పును తొలగించుకున్నాం. లక్ష్యాలను సాధించడానికి అవసరానికి మించి మా చర్యలను కొనసాగించబోం. మా టార్గెట్‌ను చేరుకుంటే ఆపరేషన్ పూర్తయినట్లే. అప్పుడు యుద్ధం కూడా ఆగుతుంది. ప్రస్తుత ఇరాన్ పాలకులు మమ్మల్ని తుడిచిపెట్టాలని చూశారు. అందుకే ఈ ఆపరేషన్ చేపట్టాల్సి వచ్చింది. ఇందులో ప్రధానంగా మా అస్థిత్వానికి పొంచి ఉన్న రెండు ముప్పులను తొలగించాలనుకున్నాం. ఒకటి అణ్వాయుధాలు.. రెండు బాలిస్టిక్ క్షిపణులు. ఈ లక్ష్యాలను సాధించే దిశగా మేం ఒక్కో అడుగు వేస్తూ ముందుకుసాగుతున్నాం. వాటికి మేం చేరువయ్యాం. టెహ్రాన్‌తో సుదీర్ఘకాలం యుద్ధం కొనసాగించబోం" అని ఇజ్రాయెల్ ప్రధాని వెల్లడించారు. అయితే, అనుకున్న ఫలితం రాకముందే పోరాటం నుంచి నిష్క్రమించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

దౌత్యాన్ని నాశనం చేయాలని అమెరికా కంకణం..

మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. అందులో ఐరాసలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవానీ మాట్లాడుతూ.. "అమెరికా విదేశాంగ విధానాన్ని హైజాక్ చేసి.. నెతన్యాహు అగ్రరాజ్యాన్ని ఈ యుద్ధంలోకి లాగారు. అమెరికా చరిత్రలో ఇది మాయని మచ్చగా మిగిలిపోనుంది. దౌత్యాన్ని నాశనం చేయడానికి అగ్రరాజ్యం కంకణం కట్టుకుంది. దీనికి సరైన సమయంలో దీటుగా బదులిస్తాం" అని హెచ్చరించారు.

## మీ దాడులతో మమ్మల్నీ ఏమీ చేయలేరు

టెహ్రాన్(జనంసాక్షి):ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌లోని అణుస్థావరాలపై అమెరికా చేసిన దాడులను ఇరాన్ మిలిటరీ సెంట్రల్ కమాండ్ ఖండించింది. అమెరికాపై మరింత శక్తివంతమైన చర్యలకు పాల్పడతామని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌ను హెచ్చరించింది. యుద్ధం ప్రారంభించింది అగ్రరాజ్యమే అయినప్పటికీ.. ముగింపు పలికేది మాత్రం తామేనని పేర్కొంది. తమ దేశంలోని అణుకేంద్రాలపై చేసిన దురాక్రమణలకు ట్రంప్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది. ఇజ్రాయెల్‌–ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలోకి అమెరికా ప్రవేశించి.. తమ దళాలకు చట్టబద్ధమైన లక్ష్యాల పరిధిని అధికారికంగా విస్తరించిందని ఇరాన్ మిలిటరీ కమాండ్ పేర్కొంది. తమ దళాలు ఇజ్రాయెల్ సహా అమెరికా స్థావరాలపై మరిన్ని విస్తృత దాడులకు సిద్ధమవుతున్నాయని తెలిపింది. ఇరాన్ గగనతల నిబంధనలను ఉల్లంఘించి.. అమెరికా అతిపెద్ద నేరం చేసిందని.. దాని ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించింది. తమపై దాడులు కొనసాగుతున్నప్పటికీ యురేనియం అభివృద్ధిని కొనసాగిస్తామని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి మాజిద్ తఖ్త్‌–రావంచి ప్రకటించారు. ఇజ్రాయెల్, అమెరికా తమపై చేస్తున్న దాడులతో నిరుత్సాహపడకుండా యురేనియం సుసంపన్న కార్యక్రమాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తామని పేర్కొన్నారు. తాము ఏం చేయాలో, చేయకూడదో అనే విషయాలను ఎవరూ చెప్పక్కరలేదని స్పష్టం చేశారు.

ఈ దాడులతో ఇరాన్‌ను ఏమీ చేయలేరు

ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ సైతం అమెరికా దాడులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దాడులకు తగిన ఫలితాన్ని అగ్రరాజ్యం అనుభవిస్తుందని హెచ్చరించారు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, పౌరులే లక్ష్యంగా టెహ్రాన్ దాడులకు సిద్ధమవుతోందని ఇరాన్ మీడియా వెల్లడించింది. కాగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ.. ఇరాన్‌లోని అణు స్థావరాలపై చేపట్టిన దాడులు తమ లక్ష్యానికి చేరువవడంతో టెహ్రాన్‌పై సుదీర్ఘకాల యుద్ధం కొనసాగించమని పేర్కొన్నారు. మరోవైపు ఇజ్రాయెల్‌–ఇరాన్ పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. సోమవారం ఉదయం ఇజ్రాయెల్ వాయుసేన టెహ్రాన్‌లోని కెర్మాన్‌షా ప్రాంతంలోని ఇరానియన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ స్థావరాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఇరాన్ సైతం టెల్ అవీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడుతోంది.

ఇజ్రాయెల్ ఘోర తప్పిదం చేసింది: ఖమేనీ

ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా అమెరికా క్షిపణులు, బాంబర్లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్రంగా స్పందించారు. "యూదు శత్రువులు ఘోర తప్పిదం చేశారు. తీవ్ర నేరానికి పాల్పడ్డారు. దీనికి శిక్ష తప్పదు. తక్షణమే శిక్షించాల్సిన అవసరం ఉంది" అని పోస్ట్ చేశారు. అయితే, ఇందులో అమెరికా ప్రస్తావనను ఆయన తీసుకురాకపోవడం గమనార్హం.

మూల్యం చెల్లించుకోవాల్సిందే: ఇరాన్

అమెరికా దాడులను ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తీవ్రంగా ఖండించారు. దీనికి అగ్రరాజ్యం మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు. దాడుల అనంతరం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. అమెరికాకు దీటుగా బదులిస్తామని పెజెష్కియాన్ తెలిపారు.

# కేబినెట్ కీలక నిర్ణయాలు

"వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ నీటి వాటాను ఏపీకి అప్పగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. బనకచర్ల బంకను మా ప్రభుత్వానికి రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తాం. గోదావరి జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోవద్దని నిర్ణయం తీసుకున్నాం. గోదావరి జలాల విషయంలో జులై మొదటి వారంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినిపిస్తాం. కాళేశ్వరంపై ఈనెల 30లోపు కమిషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం. కాళేశ్వరానికి గత ప్రభుత్వ మంత్రివర్గ ఆమోదం ఉందా? లేదా? వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం" అని పొంగులేటి వివరించారు. నూతన క్రీడా పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్రీడా కోటాలో రిజర్వేషన్లు పెంచాలని, క్రీడాకారులను ప్రోత్సహించేలా పారితోషికాలు ఇవ్వాలని నిర్ణయించింది.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



అన్ని భూములకు రైతు భరోసా ఇవ్వడం జరుగుతోంది. రైతు భరోసా వేయడం మొదలు పెట్టి కేవలం 9 రోజుల్లోనే పూర్తి చేయడం జరిగింది. ఇంత తక్కువ కాలంలో రైతు భరోసాను పూర్తిగా వేయడం రాష్ట్ర చరిత్రలోనే ఇద తొలిసారని అన్నారు. ఈ నెల 16న మొదలు పెట్టి 24 తారుఖున పూర్తి చేయడం జరుగుతోంది. అదే రోజున రాష్ట్రంలోని రైతు వేదికల వద్ద రైతులను సమావేశ పరుస్తాం. ప్రభుత్వం తరఫున సచివాలం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రితో సహా రాష్ట్ర మంత్రులంతా వారిని ఉద్దేశించి సందేశాన్న ఇస్తారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనను అనుసరించి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేసింది కావున.. అన్ని మండల కేంద్రాల్లో మండల కమిటీల ఆధ్వర్యంలో కేవలం 9 రోజుల్లో కోటిన్నర ఎకరాలకు సుమారు 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను అందించిన విషయాన్ని వివరిచాలి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని కోరుతున్నా అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**రైతుభరోసా సంబరాలు చేపట్టాలి**

ఎకరాకు రూ.12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించినట్లు తెలిపారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో భట్టి పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా కింద నిధులను రైతుల ఖాతాల్లో ఈ నెల 16 నుంచి జమ చేస్తున్నామని.. ఇది జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 'రాజ్యాంగ పరిరక్షణకు జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉంది. సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు.

### నేడు రైతు భరోసా విజయోత్సవ సభ

హైదరాబాద్(**జనంసాక్షి**):రైతు భరోసా విజయోత్సవ సభ ను మంగళవారం నాడు సచివాలయం ఎదురుగా గల రాజీవ్ గాంధీ విగ్రహ ఆవరణలో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ, సహకార,మార్కెటింగ్ జోళి శాఖ మంత్రి తుమ్మల అన్నారు. రైతు భరోసా విజయోత్సవం సభ నేపథ్యంలో చేపట్టబోయే ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు సహ చర మంత్రులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.



## 'కంచగచ్చిబౌలి'పై తీర్పు 3 వారాలకు వాయిదా

సందర్భంగా.. టీజీఐఐసీకి భూమిని అప్పగిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. సుప్రీంకోర్టులో దీనిపై విచారణ ఉండటంతో.. హైకోర్టు 3 వారాలకు వాయిదా వేసింది.

## గ్రామపంచాయతీ ఎన్నికలపై తీర్పు రిజర్వు

గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని న్యాయస్థానం నిలదీసింది. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తి అవ్వలేదని కొంత సమయం కావాలని కోర్టుని ప్రభుత్వం కోరింది. ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ అడిగింది. ఎన్నికలైనా పెట్టాలని లేదా పాత సర్పంచ్‌లనే కొనసాగించాలని పిటీషనర్లు వాదనలు వినిపించారు. ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలని నిబంధన ఉందని.. కానీ ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించలేదని పిటీషనర్లు వాదనలు వినిపించారు. కాగా 2024 ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పిటిషనర్లు, ప్రభుత్వం, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం ఈ తీర్పు ఇచ్చింది. ఎన్నికలు నిర్వహణకు సమయం కావాలని ప్రభుత్వం కోరడంతో తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది.

## పేదల ఇళ్లపై, పోడు భూములపైకి బుల్డోజర్లా?

వాటిని మరిపించేందుకు బలవంతపు చర్యలకు దిగుతోందని కేటీఆర్ ఆరోపించారు. 'హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చడం మొదలై.. పరిశ్రమల పేరుతో లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారగొండ, సిరసనగండ్లలో రైతుల భూములపైనా దాడులు జరుగుతున్నాయి' అని చెప్పారు. పట్నం, పల్లె తేడా లేకుండా బుల్డోజర్లను పంపి ప్రజలను బెదిరించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా మారిందని కేటీఆర్ ఆగ్రహించారు. 'ఇది కేవలం భూసేకరణ కాదు.. ప్రజల జీవనాధారాలపై కక్షసాధింపు చర్యలు. పేదల మీద కూల్చే, కాల్చే విధానాలే కాంగ్రెస్ పాలనకు గుర్తుగా మారుతున్నాయని విమర్శించారు.

## పలు జిల్లాల్లో నేడు వర్షాలు

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు మెరుపులతో పాటు ఈదురుగాలుల ప్రభావం ఉంటుందని పేర్కొంది. నిజామాబాద్ జిల్లాలో కూడా గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఇవి కశ్మీర్, సిమ్లా మీదుగా హిమాలయాల వరకు విస్తరిస్తుండగా, మరో రెండు మూడు రోజుల్లో దేశమంతటా వ్యాపించనున్నాయని భారత వాతావరణశాఖ, విశాఖపట్నం తెలిపింది. ఈ సారి రుతుపవనాల వ్యాప్తి మాములు కంటే సుమారు 15 రోజులు ముందుగానే వచ్చాయని తెలిపింది. ఈ నేపథ్యంలో నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో, 5.8 నుండి 7.6 కిలోమీటర్ల పైన ఆవరించడంతో.. దీనివల్ల రాబోయే రెండు రోజులు వర్షాల సూచన ఉండనుంది. ఉత్తర కోస్తాంధ్రలో ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలున్న నేపథ్యంలో, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికార అధికారులు హెచ్చరించారు. రుతుపవనాల ఈ చురుకైన ప్రవాహంతో వ్యవసాయానికి అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

## 'ఆపరేషన్ సిందూర్'తో ఉగ్రవాదులకు వణుకుపుట్టించాం


రూపొందించిన పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్యం చేపట్టిన ఆపరేషన్ అన్ని లక్ష్యాలనూ సాధించిందన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండవ సంవత్సరం పదవీ కాలంలో చేసిన 51 ప్రసంగాలతో కూడిన కలెక్షన్‌ను రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ఆవిష్కరించారు. ఇది వికసిత్ భారత్ దార్శనికతకు ఓ కర్మగ్రంథంగా మారుతుందని పేర్కొన్నారు. వింగ్స్ టు అవర్ హోప్స్ వాల్యూమ్- 2 అనే ఈ గ్రంథం 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించాలనే లక్ష్యాన్ని సాధించేందుకు ఓ మార్గనిర్దేశకత్వాన్ని అందిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, ఎల్.మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

# 2018 ఎన్నికల నుంచే ఫోన్ ట్యాపింగ్

హైదరాబాద్(**జనంసాక్షి**): తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2018 ఎన్నికల వేళ ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులకు తాజాగా ఆధారాలు లభించాయి. ప్రణీత్‌రావు నుంచి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావుకు ట్యాపింగ్ సమాచారం చేరేది. ప్రభాకర్ రావు ఆదేశాలతోనే టాస్క్‌ఫోర్స్ టీమ్ రంగంలోకి దిగింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారానే ప్యారడైజ్ వద్ద భవ్య ఆనంద్‌ప్రసాద్‌కు చెందిన రూ. 70లక్షల డబ్బును టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఎన్నికల్లో పోటీ చేసిన రఘునందన్‌రావు బంధువులకు చెందిన రూ. కోటి కూడా ఫోన్ ట్యాపింగ్‌తో వచ్చిన సమాచారం మేరకే సీజ్ చేశారని తెలుస్తోంది. బేగంపేట పరిధిలో రాధాకిషన్‌రావు, ఆయన బృందం రూ. కోటి సీజ్ చేసింది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సమాచారం. నల్గొండ కాంగ్రెస్ నేతల అనుచరుల నుంచి రూ.3.50 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.

**మాజీ సీఎస్ శాంతి కుమారి తదితరుల విచారణ**

ఫోన్ ట్యాపింగ్ వివాదంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా ఈ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) రఘునందన్ రావులను విచారణకు పిలిచి వారి స్టేట్‌మెంట్లను నమోదు చేసింది. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ 1885, సెక్షన్ 5(2) ప్రకారం, ఫోన్ ట్యాపింగ్ చేయాలంటే రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి లేదా డీజీపీ అనుమతితో పాటు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ అనుమతీ తప్పనిసరి. ట్యాపింగ్ చేయాల్సిన నెంబర్ల జాబితాను రివ్యూ కమిటీ పరిశీలించి, అనుమతిని కేంద్రానికి పంపిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం సుమారు 618 ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ కోసం రివ్యూ కమిటీకి



సమర్పించింది. అప్పట్లో సీఎస్‌గా ఉన్న శాంతి కుమారి ఆ లిస్ట్ పంపి టెలికం అనుమతులు తీసుకున్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఇప్పటికే అదే కేసులో అప్పటి హోంశాఖ కార్యదర్శి, ప్రస్తుత డీజీపీ జితేందర్,ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్‌లకు ప్రశ్నలతో కూడిన నోటీసులు జారీ చేయగా, తాజాగా శాంతి కుమారి, రఘునందన్ రావులను స్వయంగా విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కేసు మరింత లోతుగా సాగుతున్న దశలో, ఈ రెండు స్టేట్‌మెంట్లు కీలకంగా మారనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సాధారణ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో రేవంత్ రెడ్డి పోటీలో ఉన్న సమయంలో ట్యాపింగ్ జరిగినట్లు సిట్ బృందం గుర్తించింది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆయన తమ్ముడు కొండల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి ఫోన్స్ ట్యాప్ అయినట్లు దర్యాప్తు బృందం గుర్తించింది. వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేత బిళ్ళ సుధీర్ రెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి వాంగ్మూలం నమోదు చేసింది. గత బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు సహా జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ప్రధానంగా ప్రతిపక్ష నేతలు, సొంత పార్టీలోని అనుమానిత ఎమ్మెల్యేలు, వ్యాపార ప్రముఖులపై నిఘా పెట్టారు. స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు అందించే ఫోన్ నెంబర్స్‌ను మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఆధ్వర్యంలోని ఎస్ఐబీ టీమ్ ట్యాపింగ్ చేసేది. సంబంధింత వ్యక్తుల వ్యక్తిగత, కుటుంబ, అనుచరుల వివరాలు, వ్యాపార లావాదేవీలను సేకరించేది. ఇలా ప్రభుత్వ పెద్దలు సూచించిన పొలిటికల్ లీడర్ల ఫోన్ నెంబర్స్‌తో పాటు వందల సంఖ్యలో ప్రైవేట్ వ్యక్తుల ఫోన్లను ట్యాపింగ్ చేశారు. ఇందులో ప్రణీత్‌రావుతో కలిసి పని చేసిన కానిస్టేబుల్ నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి వరకు అక్రమాలకు పాల్పడినట్టు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. ట్యాపింగ్ ద్వారా రికార్డ్ చేసిన ఆడియోలతో పలువురిని బ్లాక్‌మెయిల్ చేసినట్టు సిట్ ఆధారాలు సేకరించింది.

**వరుసగా ఆరోసారి సిట్ విచారణకు ప్రభాకర్ రావు**

తెలంగాణను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సోమవారం ఆరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే ఐదుసార్లు విచారణకు లోనైన ఆయన, ఈసారి కూడా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు ప్రస్తుత ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలతో నిర్ధారించింది. ఈ వ్యవహారంపై అధికారులు ప్రశ్నిస్తే ప్రభాకర్ రావు పూర్తిగా సహకరించట్లేదని సమాచారం. ఆయన నుంచి వచ్చే సమాచారంపై రాజకీయ పార్టీల నేతల ప్రమేయంపై స్పష్టత రావచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఐదు విచారణల్లో ప్రభాకర్ రావు సూటిగా సమాధానాలు ఇవ్వకుండానే తప్పించుకుంటున్నారని తెలుస్తోంది. మావోయిస్టులతో సంబంధాల పేరుతో వందల మంది రాజకీయ నాయకులు, పాత్రికేయుల ఫోన్‌లు ఒకేసారి ట్యాప్ చేయడం వెనుక ఉన్న కారణాలను ప్రశ్నించినప్పటికీ, ఆయన క్లారిటీ ఇవ్వలేదని సమాచారం. అందుకే ఈ వ్యవహారాన్ని సిట్ బృందం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లే అవకాశముంది. ఈ కేసులో ప్రస్తుతం మరికొంతమంది రాజకీయ నాయకుల స్టేట్‌మెంట్లను సిట్ అధికారులు ఇవాళ రికార్డ్ చేయనున్నారు. మొత్తంగా చూస్తే, తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు ఇంకా అనేక మలుపులతో ముందుకు సాగుతోంది.

## ఉపపోరు ఆప్ హవా..

గుజరాత్‌లో భాజపాకు పూర్తి ఆధిపత్యం ఉన్నప్పటికీ.. 2007 నుంచి విశావదర్ స్థానాన్ని గెలుచుకోలేకపోతోంది. అయితే, గత ఎన్నికల్లో ఈ సీటులో ఆప్ కైవసం చేసుకున్న ప్పటికీ.. ఎమ్మెల్యే భూపేంద్ర భయానీ రాజీనామా చేసి భాజపాలో చేరారు. దీంతో ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో మళ్లీ ఆప్ విజయం సాధించింది. అలాగే, గుజరాత్‌లో కాడి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థి రాజేంద్ర చావ్డా విజయం సాధించారు. కాగ్రెస్ అభ్యర్థి రమేశ్ చావ్డాపై జయకేతనం ఎగురవేశారు. పంజాబ్‌లోని లుథియానా వెస్ట్ సీటుకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార ఆప్ విజయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ ఆషుపై ఆప్ అభ్యర్థి, రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోడా 10,637 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ ఆప్ అభ్యర్థి అరోడాకు 35,179 రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి ఆషుకు 24,542 ఓట్లు, భాజపా అభ్యర్థి జివాన్ గుప్తాకు 20,323 ఓట్లు; అకాలీదళ్ అభ్యర్థికి కేవలం 8,203 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇక్కడ ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ బస్సీ గోగి మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. పంజాబ్‌లోని లుథియానా పశ్చిమ స్థానంలోనూ ఆప్‌ను గెలిపించడం ద్వారా పంజాబ్ ప్రజలు తమ ప్రభుత్వ పనితీరుకు ఆమోదం తెలిపారన్నారు. గుజరాత్‌లో భాజపా, ఆప్ మధ్యే ప్రత్యక్ష పోటీ ఉందన్న ఆయన.. భాజపాకు కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిపోయిందని ఆరోపించారు. ఈ క్రమంలో రాజ్యసభకు ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ జరుగుతోన్న ప్రచారంపై ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ స్పందించారు. తాను రాజ్యసభకు వెళ్లడంలేదని స్పష్టం చేశారు.

## మేడిగడ్డపైనే విచారణలా.. సుంకిశాలపై ఎందుకు లేవు?

కంపెనీ సిద్ధమని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. కేవలం రాజకీయ స్వార్థంతో తెలంగాణ ప్రయోజనాలను కూడా పక్కకు పెట్టడం కాంగ్రెస్ మార్కు 'ప్రజా వ్యతిరేక-ప్రతిపక్ష వేధింపు'పాలనకు నిదర్శనం"అని హరీశ్‌రావు అన్నారు.

గొల్ల కుర్మలను కూడా మోసానికి గురి చేస్తే ఎలా?

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ హామీలను తుంగలో తొక్కిందని కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలలో ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రజా ప్రయోజన పథకాలను నిలిపి వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బంద్, గ్యాస్ బండకు రాయితీ బంద్, రాజీవ్ యువ వికాసం అమలుకు కాకముందే బంద్, గొర్రెల పంపిణీ మొత్తానికే బంద్.. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాలు బందయినట్టే అని హరీష్ పేర్కొన్నారు. ఆత్మశుద్ధిలేని యాచార మదియేల, భాండశుద్ధి లేని పాకమేల? అనే సామెతను కోట్ చేస్తూ కాంగ్రెస్ నైతికతను ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రారంభించిన పథకాలను అటకెక్కించి, మేనిఫెస్టోలో ఊదరగొట్టిన హామీల అమలును గాలికి వదిలేశారు అంటూ ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటి పరుగులు తీసినా, చేతల పరంగా మాత్రం ప్రజలు ఇంకా నిరీక్షణలోనే ఉన్నారని హరీష్ వ్యాఖ్యానించారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం లేదని, పాలన అంటే ప్రతిపక్షాలపై కక్ష సాధించడమేనా? అంటూ ఆయన ప్రశ్నించారు. యాదవ, కురుమ వర్గాలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో కాంగ్రెస్ వైఫల్యాన్ని ఆయన ప్రస్తావించారు. వంద రోజులలో గొర్రెల పంపిణీ చేస్తామని చెప్పిన వాడివి, కానీ ఇప్పటి దాకా డిడి డిపాజిట్ చేసిన వారి సొమ్ము కూడా తిరిగి ఇవ్వలేని దుస్థితి మీది. మాటలు విని విసిగిపోయిన యాదవ, కురుమ సోదరులు గాంధీ భవన్ ముందు గొర్రెలతో నిరసన అని వ్యాఖ్యానించారు. మీ మోసాన్ని ప్రజలు గుర్తుంచుకుంటారు.. ఇంకా జాగ్రత్త పడకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదు అని హెచ్చరించారు.

## చేతివృత్తులకు చేయూత

తెలంగాణ వంటకాలు, బెస్త సోదరులు వండిన సంప్రదాయ చేపల వంటకాలు, సేంద్రీయ ఉత్పత్తులు, ఇతర భోజన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. సందర్శకులకు ప్రవేశం ఉచిత మన్న ఆయన.. ఈ ప్రదర్శనకు జంట నగరవాసులు పెద్ద సం ఖ్యలో హాజరుకావాలని మంత్రి కోరారు.

# విత్తనోత్పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించండి

- రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి
- రైతు కమిషన్ కార్యాలయంలో సీడ్ కంపెనీలతో రైతు కమిషన్ సమావేశం
- ఆర్గనైజర్ల వ్యవస్థ బాగాలేదని స్పష్టం చేసిన కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- సీడ్ కంపెనీలు.. విత్తనోత్పత్తి చేసే రైతుల కోణంలో ఆలోచన చేసి నష్టపరిహారం ఇవ్వండి
- నష్టపరిహారం చెల్లించడానికి ముందుకొచ్చిన సీడ్ కంపెనీలు
- ఒకటిరెండు రోజుల్లో నష్టపరిహారం చెల్లింపుపై స్పష్టత



హైదరాబాద్ (జనంసాక్షి) : జోగులాంబ గద్వాల్ జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి చేసే రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీడ్ కంపెనీలకు సూచించారు రైతు కమిషన్ చైర్మన్ కొదండ రెడ్డి. ఈ మధ్య కాలంలో గద్వాల్ జిల్లాలో విత్తనోత్పత్తి చేసే రైతులకు జీవోటీ పేరుతో సీడ్ కంపెనీలు మోసం చేస్తున్నాయని కమిషన్ దృష్టికి వచ్చిన విషయం తెలిసిందే. రైతుల ఫిర్యాదులతో ఈనెల జూన్ 13న గద్వాల్ జిల్లాలో పర్యటించి అక్కడి రైతుల నుండి అభిప్రాయాలను సేకరించింది. అంతేకాదు జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన సమీక్ష సమయంలోనే ఆర్గనైజర్ల వ్యవహారం పై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక ఈ రోజు మరోసారి గద్వాల్ ఘటనపై బీఆర్కే భవన్ లోని రైతు కమిషన్ కార్యాలయంలో సీడ్ కంపెనీల ప్రతినిధులతో రైతు కమిషన్ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి మాట్లాడుతూ.. సీడ్ కంపెనీలు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహారించకుండా రైతుల కోణంలో కూడా ఆలోచన చేయాలన్నారు. తెలంగాణ విత్తనోత్పత్తికి అనువైన ప్రాంతమని, సీడ్ కంపెనీలు రైతులతో విత్తనోత్పత్తి చేయించుకోవడమే కాకుండా వారు నష్టపోయిన సమయంలో ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని గుర్తుచేశారు. ఒకట్రెండు రోజుల్లో గద్వాల్ జిల్లాలో పత్తి విత్తనోత్పత్తి చేసి నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో సీడ్ కంపెనీలు నిర్ణయం తీసుకోవాలన్నారు. సీడ్ కంపెనీలు ఏర్పాటుచేసుకున్న ఆర్గనైజర్ల తీరుపై కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డిలు వ్యతిరేకించారు. ఆర్గనైజర్ల వ్యవహారంతోనే సీడ్ కంపెనీలు బద్నామ్ అవుతున్న విషయాన్ని ఈ సందర్భంగా సభ్యులు వివరించారు. రైతులతో ఆర్గనైజర్లు వడ్డీ వ్యాపారం చేయడం నేరమని హెచ్చరించారు. విత్తనోత్పత్తి కోసం సీడ్ కంపెనీలు రైతులకు ఇచ్చిన విత్తనమే.. జివోటి పరీక్షలో ఎట్లా ఫెయిల్ అవుతుందని కమిషన్ సభ్యులు ప్రశ్నించారు. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సీడ్ కంపెనీలు రైతులకు నష్టపరిహారం ఇవ్వడానికి సుముఖత తెలిపాయి. ఈ సమావేశానికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సైతం హాజరై.. తనకు ఉన్న అనుభవాన్ని, అక్కడి రైతుల సమస్యలు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ రోజు రైతు కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కొదండ రెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రాములు నాయక్, భవానీ రెడ్డి తోపాటు కమిషన్ సలహాదారులు దొంతినర్సింహరెడ్డి, రామనుజేయులు, శ్రీనివాస్ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోవిందు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్, గద్వాల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

## కేబినేట్‌లో కుర్మలకు స్థానం కల్పించాలి

- గాంధీభవన్ ముందు గొర్రెకాపరుల నిరసన

హైదరాబాద్, జూన్ 23 (జనంసాక్షి) : తెలంగాణ క్యాబినెట్, పీసీసీ కార్యవర్గంలో కుర్మ, యాదవ సామాజిక వర్గాలకు స్థానం కల్పించాలని కోరుతూ గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం వినూత్న నిరసన చేపట్టింది. హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్, పీసీసీ కార్యవర్గంలో కుర్మ, యాదవ సామాజిక వర్గాలకు స్థానం కల్పించాలని కోరుతూ గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం వినూత్న నిరసన చేపట్టింది. గొర్రెల కాపరులు లారీలో గొర్రెలు, మేకలతో గాంధీభవన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. సంక్షేమ సంఘం నేత శ్రీహరి యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసే వరకు తమ నిరసన కొనసాగుతుందని నేతలు తెలిపారు. పోలీసులు ఉన్నా గాంధీభవన్‌లోకి లారీ రావడంపై పలువురు కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘ విద్రోహశక్తులు వస్తే పరిస్థితి ఏంటని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## గాంధీ భవన్‌లో జై బాపు, జై భీమ్ కో ఆర్డినేటర్ల సమావేశం



హైదరాబాద్ (జనంసాక్షి) : గాంధీ భవన్‌లో జై బాపు, జై భీమ్ కో ఆర్డినెటర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా పాల్గొన్న ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఏఐసిసి రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీ చంద్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు

- టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్
- దాడికి గురైన డ్రైవర్‌కు పరామర్శ



హైదరాబాద్ (జనంసాక్షి) : తమ సిబ్బందిపై దాడులకు పాల్పడితే ఎంతటి వారికైనా చట్టపరమైన చర్యలు తప్పవని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. పోలీస్ శాఖ సహకారంతో బాధ్యులపై రౌడీ షీట్స్ తెరుస్తామని ఆయన స్పష్టం చేశారు. దుండగుల చేతిలో దాడికి గురై తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బండ్లగూడ డిపో డ్రైవర్ విద్యా సాగర్ ను వీసీ సజ్జనర్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితితో పాటు దాడి జరిగిన తీరును ఆయనను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ డ్రైవర్ కు టీజీఎస్ఆర్టీసీ పూర్తిగా అండగా ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు.

మెహదీపట్నం నుంచి ఎల్బీ నగర్ వెళ్తున్న రూట్ నంబర్ 300 ఆర్డినరీ బస్సు కింద బైక్ పడి ఒక గర్భిణి మృతి చెందారు. రోడ్డు పక్కన ఆగి ఉన్న కారు డోర్ ఒక్కసారిగా తెరవడంతో బైక్ అదుపు తప్పి బస్సు వెనుక టైర్ల కింద పడింది. అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 198 వద్ద ఈ నెల 19న జరిగిందీ ప్రమాదం.

ఈ రోడ్డు ప్రమాదంలో ఎలాంటి తప్పు లేకున్నా డ్రైవర్ విద్యా సాగర్ పై కొందరు విచక్షణరహితంగా దాడి చేశారు. అసభ్యపదజాలంతో దూషిస్తూ తీవ్రంగా కొట్టారు. విధులు ముగించుకుని ఇండ్లకు వెళ్తున్న ఆర్టీసీ కానిస్టేబుళ్లు భాస్కర్, ముఫకర్ అలీ లు డ్రైవర్ ను తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. అప్పటికే తీవ్ర గాయలవడంతో అక్కడి నుంచి తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి డ్రైవర్ ను తరలించారు.

ఈ ప్రమాదంలో తమ డ్రైవర్‌ది ఎలాంటి తప్పులేదని, ప్రజల మధ్య విధులు నిర్వర్తించే టీజీఎస్ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేయడం బాధాకరమని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ అధికారుల పిర్యాదు మేరకు దుండగులపై సైబరాబాద్ కమిషనరేట్ అత్తాపూర్ పోలీసులు బీఎన్ఎస్‌లోని 121(1), 126(2), 115(2) 352, 351(2) ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు.

తమ సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే, మనోవేదనకు గురిచేసే ఇలాంటి దాడులను యాజమాన్యం ఏమాత్రం సహించబోదని, నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

## ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పౌరులు ఉద్యమించాలి




- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాజ్ భవన్ ముట్టడి
- అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదని, ఈ నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తా నుండి రాజ్ భవన్ కు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలను అడ్డుకుని,పోలీసులు అక్రమ అరెస్టు చేశారు.తోపులాటలో పలువురు నేతలకు గాయాలు అయ్యాయి. అరెస్ట్ చేసిన నేతలను పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ దండకారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నదని, మావోయిస్టులతో పాటు గిరిజనుల నెత్తురు ఏరులై పారుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు నెలలుగా ఏకధాటిగా కొనసాగుతున్న కూంబింగ్ ఆదివాసీ గూడాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నదని, చిన్న అలికిడి జరిగినా, బూట్లచప్పుడు వినిపించినా భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితి నెలకొందని. 'మావోయిస్టు రహిత భారత్' కోసమంటూ చేపట్టిన 'ఆపరేషన్ కగార్' నిజంగా నక్సల్స్ను నిర్మూలించడం కోసమేనా? అదే నిజమైతే ఆదివాసులను అడవుల నుంచి తరిమేయడం దేనికి? యథేచ్ఛగా మానవ హక్కుల్ని ఉల్లంఘిస్తూ చేస్తున్న ఈ మారణ హోమం వెనుక ఉన్న ఉద్దేశమేంటి? ప్రజల్లో ఉద్భవిస్తున్న ఇలాంటి ప్రశ్నలకు కేంద్ర సర్కార్ సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21 జీవించే హక్కును కాలరాస్తున్న నరేంద్రమోదీ విధానాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్,చేపూరి కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్. బాలక్రిష్ణ, చిలుక రాజ్ శ్రీను, సల్మాన్ బేగ్, శివ కుమార్, మహమూద్, మాజీద్, కొండూరి వెంకటేష్, అశోక్, బిచ్చల శ్రీనివాస్, హేమంత్, నయీమ్, అశోక్,వెంకటేష్, సురేష్, మధు, మధుకర్,శోభన్, వీరన్న, వెంకట్, రజనీకాంత్, నాగేశ్వరరావు, సంజయ్,వర్మ, గణేష్ లతో పాటు 30మంది పాల్గొన్నారు.

## ఏసీబీకి పట్టుబడిన గోల్నాకా అసిస్టెంట్ ఇంజనీర్



హైదరాబాద్ (జనంసాక్షి) : రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. జిహెచ్ఎంసి గోల్నాకా అసిస్టెంట్ ఇంజనీర్ మనీషా లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

గోల్నాకా అసిస్టెంట్ ఇంజనీర్ మనీషా రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. బిల్లు ప్రాసెస్ చేసి పైకి పంపించడానికి రూ. 20 వేలు లంచం డిమాండ్ చేసింది. గోల్నాకా అసిస్టెంట్ ఇంజనీర్ మనీషా. రూ. 5 వేలు అడ్వాన్స్ ఇచ్చి.. మిగతా రూ. 15 ఇచ్చే ముందు ఏసీబీ కి పట్టించారు బాధితులు. లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ ఇంజనీర్ మనీషా ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు.

## కాళేశ్వరం విచారణలో విఫలం

- సిబిఐ విచారణకు కాంగ్రెస్ వెనకడుగు
- బిజెపి నేత ఎన్‌విఎస్ ప్రభాకర్ విమర్శలు



హైదరాబాద్, జూన్23 (జనంసాక్షి) : కాళేశ్వరం అవినీతి నుంచి బయటపడేందుకు భారాస నేతలు అపసోపాలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. దీనిపై విచారణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. సిబిఐ విచారణకు మాత్రం ఎందుకు అంగీకరించడం లేదన్నారు. అందుకే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారాస అవినీతిపై ఆయన మీడియాతో మాట్లాడారు. భారాస నేతలారా.. కాళేశ్వరం ఎంత డొల్ల ప్రాజెక్టో ఎన్డీఎస్ఏ నివేదిక చదివి తెలుసుకోవాలన్నారు. ఐఐటీలో చదువుకున్న అత్యుతన్న వేధావులు, నిపుణుల బృందం కాళేశ్వరం సందర్శించి లోపాలను ఎత్తిచూపిందన్నారు. 'కాళేశ్వరంలో జరిగిన అక్రమాలు, నాణ్యతా లోపాలు, మొరాయించిన మోటార్లు, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎన్డీఎస్ఏ స్పష్టంగా వెల్లడించింది. అయినా ఎన్డీఎస్ఏ నివేదికను భారాస నేతలు తప్పుపట్టడాన్ని ఖండిస్తున్నా. పీసీ ఘోష్ కమిషన్ విచారణ సందర్భంగా భారాస నేతలు కారుకూతలు కూశారు. భారాస నేతల అవినీతిని భాజపా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరగాలని రాహుల్ గాంధీ చెప్పిన మాటలు మర్చిపోయారా? అసెంబ్లీ లోపల, బయట కూడా సీఎం, మంత్రులు కాళేశ్వరం అవినీతిపై మాట్లాడారు కదా? పీసీ ఘోష్ కమిషన్ విచారణను నీరుగార్చేందుకు కుట్ర జరుగుతోంది. భారాస చేసిన తప్పులకు శిక్షణ అనుభవించక తప్పదు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా'అని ఎన్వీఎస్-ఎస్ ప్రభాకర్ అన్నారు.

## వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఈ నామ్ పద్ధతిని రద్దు చేయాలి

- జెడిఎంకి వినతి పత్రం ఇచ్చిన రైతు సంఘాల నాయకులు



వరంగల్ ఎంజీఎం, జూన్ 23(జనంసాక్షి): వరంగల్ వ్యవసాయ మార్కెట్లో అమలవుతున్న ఈ నామ్ పద్ధతిని రద్దు చేయాలని కోరుతూ ఈరోజు మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ రైతు సంఘాల నాయకులు కలిసి వినతి పత్రం ఇచ్చారు.వ్యవసాయ మార్కెట్ లో ని పసుపు యార్డులో గత కొంతకాలంగా అమలవుతున్న ఈ నామ్ విధానం ద్వారా రైతులు నష్టపోతున్నారని కావున దీనిని రద్దు చేయాలని జేడీఎం వారు కోరారు. ఒకసారి బిడ్డింగ్ అయిన తర్వాత రైతు తెచ్చిన సరుకులు వ్యాపారి కొనకపోతే మరోసారి బిడ్డింగ్ చేసే అవకాశం లేనందువల్ల రైతు మరుసటి రోజు వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల రైతుకు నష్టం జరుగుతోందని వారు తెలిపారు. ఒకవేళ రైతుకు అనుకున్నంత ధర రాకపోవడంతో చేసేదేమీ లేక మళ్లీ మరుసటి రోజు ఉండడం ఎందుకని తక్కువ ధరకే అమ్ముకొని పోతున్నారని, ఈ విధానం వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉందని వారు అన్నారు. రైతు ఉత్పత్తులకు ఎంత ధర పలికిందనేది వ్యాపారులు చెప్పేంతవరకు వారికి తెలియడం లేదన్నారు.రైతు ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేయకుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇదే కాక మార్కెట్లో రెండోసారి బిడ్డింగ్ ఏర్పాటు చేయాలని లేదా ఈ నామ్ పద్ధతిని రద్దుచేసి గత పాత పద్ధతిని అమలు చేయాలని సంఘాల నాయకులు కోరారు.జేడీఎంను కలిసిన వారిలో తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్ అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు అఖిల భారత కిసాన్ సంఘటన్ సుధ మల్ల భాస్కర్ అఖిలభారతం కిసాన్ సంయుక్త సభ జిల్లా కన్వీనర్ వల్లందాస్ కుమార్ లు ఉన్నారు.

## నవోదయలో సీటు సాధించిన ప్రగతి విద్యార్థి రిషి



పాలకుర్తి, జూన్ 23 (జనంసాక్షి) : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రగతి విద్యా నిలయం 2024- 25 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి చదువుతున్న ఈరవెన్ను గ్రామానికి చెందిన అనుముల రిషి తండ్రి కుమార్ నవోదయలో సెలెక్ట్ అయ్యాడని పాఠశాల ప్రిన్సిపల్ వీరమనేని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. సోమవారం మామునూరు నవోదయ పాఠశాలలో నిర్వహించిన స్పాట్ లోఅడ్మిషన్ పొందాడని తెలియజేశారు. నవోదయ సీటు పొందడం పట్ల ప్రిన్సిపాల్ వీరమనేని వెంకటేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులు ,వారి తల్లిదండ్రులు, విద్యార్థి రిషి ని అభినందించారు.

## డీటీ రాజేష్ ఖన్నాకు అండగా ఉద్యోగుల జేఏసీ

- ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి
- బిల్లులను మాఫీ చేయించి డిశ్చార్జికి ఏర్పాటు చేసిన నేతలు




హైదరాబాద్ (జనంసాక్షి) : అనారోగ్యంతో ఆస్పత్రి పాలై బిల్లులు చెల్లించలేక తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్న డిప్యూటీ తహశీల్దార్ రాజేష్ ఖన్నాకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అండగా నిలిచారు. వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాకతో కలిసి సోమవారం ఆస్పత్రికి వెళ్లి రాజేష్ ఖన్నాను పరామర్శించారు. అప్పటికప్పుడే ఆస్పత్రి బిల్లు సమస్యను కూడా పరిష్కరించి రాజేష్ ఖన్నా డిశ్చార్జికి ఏర్పాట్లు చేశారు. వరంగల్ జిల్లా, నల్లబెల్లి డిప్యూటీ తహశీల్దార్ రాజేష్‌ఖన్నా తీవ్రమైన అనారోగ్యానికి గురయి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. 25 రోజులకు రూ.20 లక్షలకు పైగా ఆస్పత్రిలో బిల్లు అయింది. అప్పటికే రూ.13 లక్షల వరకు కుటుంబ సభ్యులు వివిధ రూపాలలో డబ్బులు తెచ్చి బిల్లులను చెల్లించారు. మిగిలిన రూ.7 లక్షలు చెల్లించే పరిస్థితి ఆ కుటుంబానికి లేదు. మిగతా రూ. 7 లక్షలు చెల్లిస్తేనే డిశ్చార్జి చేస్తామని ఆస్పత్రి వారు తెగించి చెప్పారు. రాజేష్ ఖన్నా, అతడి కుటుంబం యొక్క దయనీయ పరిస్థితి తెలుసుకున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాకతో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. రాజేష్‌ఖన్నాకు, అతడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అన్ని రకాలుగా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అప్పటికప్పుడే ఆస్పత్రిలో బిల్లుల విషయమై నిర్వాహకులతో మాట్లాడారు. మిగతా చెల్లించాల్సిన రూ.7 లక్షలు చెల్లించకుండానే సెటిల్(మాఫీ) చేసి రాజేష్ ఖన్నాను డిశ్చార్జి చేసేలా ఏర్పాటు చేశారు.



## ఎమ్మెల్యే పల్లాకు జనగామ బిఆర్ఎస్ నేతల పరామర్శ

జనగామ ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి): ఇటీవల ప్రమాదానికి గురై, శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్ లోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి ని జనగామ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా ని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వాళ్ళు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ యాదగిరి రెడ్డి మామిడాల రాజు ఉల్లెంగుల సందీప్ దామెర రాజు చెన్నూరి నవీన్ లు పాల్గొన్నారు.

# భారత స్వరం ఇంకెప్పుడు వినిపిస్తారు?



*అంతర్జాతీయ విషయాల్లో ప్రతి దేశానికి ఒక స్పష్టమైన విధానము ఉంటుంది.అది తన స్వీయ జాతీయ జెండాను, ప్రయోజనా లను స్థిరంగా కలిగి ఉంటుంది.ప్రస్తుతం ఇజ్రాయెల్, ఇరాన్ ను స్వాధీనం చేసుకొనే లక్ష్యంగా చేసుకొని చట్టవిరుద్ధంగా సైనిక దాడికి పాల్పడిన తీరును ప్రపంచం మరోసారి చూసింది. ఈ రకమైన ఏకపక్ష మిలిటరిజం ఎంత ప్రమాదకరమో మరోసారి ప్రపంచానికి రుజువైంది.*

ఇరాన్ భూమిపై బాంబు దాడులు చేస్తూ,మానవ హత్యలను లక్ష్యంగా చేసుకొని వ్యవహరించడాన్ని భారత జాతీయ కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఇవి ప్రాంతీయంగా, ప్రపంచ స్థాయిలో తీవ్ర పరిణామాలకు దారితీయగల ప్రమాదకరమైన ఉద్వేగాలకు చిహ్నంగా భావించింది.. గాజాలోని దారుణమైన, అసమానంగా ఉన్న సైనిక దాడుల్లాగే, ఈ చర్యలు కూడా పౌరుల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా, ప్రాంతీయ స్థిరత పట్ల అనాదరణతో వ్యవహరించబడ్డాయి. ఇవి మిగిలిన ప్రాంతంలో అస్థిరతను మరింతగా పెంచి, మరిన్ని ఘర్షణలకు బీజం వేస్తాయి.

ఈ దాడి జరిగింది తాము ఊహించని సమయంలో ... ఇరాన్ అలాగే అమెరికా మధ్య దౌత్య చర్చలు కొంత ఆశాజనకంగా మారుతున్న సమయంలో - ఐదు విడతల చర్చలు ఇప్పటికే జరిగి పోయినాయి. ఆరో విడత జూన్‌లో జరగాల్సి ఉంది. అంతేకాదు, 2025 మార్చిలో అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తుల్సీ గబ్బార్డ్ స్పష్టంగా కాంగ్రెస్‌లో చెప్పిన ప్రకారం, ఇరాన్ అణు ఆయుధాల కార్యక్రమాన్ని కొనసాగించడం లేదు. 2003లో ఆ కార్యక్రమాన్ని ఆపిన తరువాత మళ్ళీ ప్రారంభించేందుకు అధిపతి అయతుల్లా అలీ ఖమేనే అనుమతించలేదని ఆమె తెలిపారు.

ప్రస్తుత ఇజ్రాయెల్ నాయకత్వం అంటే బెంజమిన్ నేతన్యాహు ప్రభుత్వం. ఈ ప్రభుత్వం శాంతిని అడ్డుకోవడం, తీవ్రవాదాన్ని పెంపొందించడంలో అపఖ్యాతి పొందింది. అక్రమ నివాసాల విస్తరణ, అతివాద వర్గాలతో భాగస్వామ్యం, రెండు-రాష్ట్రాల పరిష్కారానికి అడ్డుపడటంతో పాలస్తీనీయుల బాధలను పెంచినప్పటితో కాకుండా, ప్రాంతాన్నే శాశ్వత ఘర్షణల దిశగా నెట్టింది.

ఇంతే కాదు, 1995లో ప్రధానమంత్రి ఇజాక్ రబిన్ హత్యకు దారితీసిన ద్వేష వాతావరణానికి నేతన్యాహువే కారణమన్న చారిత్రక గుర్తింపును మర్చిపోకూడదు. ఆ హత్యతో ఇజ్రాయెల్-పాలస్తీనా శాంతి యత్నాలు నిలిచిపోయ్యాయి.

ఈ నేపథ్యంలో, నేతన్యాహు ఉద్రిక్తతే ఎంచుకుంటాడన్నది ఆశ్చర్యం కాదు. కానీ, దుఃఖకరం అనిపించేదేమిటంటే ... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వాస్తవాలను ఆధారంగా చేసుకుని నేతృత్వం వహించాల్సిన సమయంలో, మిలిటరీ, ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ పట్ల తనకున్న విమర్శలు మరిచి ఈ విధ్వంస మార్గాన్నే అనుసరించాలి అనుకుంటున్నట్లు కనిపించడం. ఇరాక్ వద్ద అణు ఆయుధాలున్నాయన్న అబద్దాలతో జరిగిన యుద్ధాన్ని విమర్శించిన అదే వ్యక్తి, ఇప్పుడు తన ఇంటెలిజెన్స్ చీఫ్ మాటల్ని నిర్లక్ష్యం చేసి, జూన్ 17న "ఇరాన్ అణు ఆయుధాలకు దగ్గరగా ఉంది" అన్న మాటలు అనడం నిరాశ కలిగించే అంశం.

ఇక్కడ రెండవ ప్రమేయం ఉన్నది, ద్వంద్వ ప్రమాణాలకు ఎటువంటి స్థానం ఉండకూడదు. ఇరాన్ అణు ఆయుధాలు నిజంగా కలిగి ఉంటే అది ఇజ్రాయెల్‌కి ప్రమాదకరమే కావచ్చు. కానీ, ఇజ్రాయెల్‌నే అణుశక్తి కలిగిన దేశం. అదే సమయంలో తన పొరుగు దేశాలపై నిరంతర దాడులకు పాల్పడిన చరిత్ర కూడా దాచలేనిది. మరోవైపు, ఇరాన్ మాత్రం అణు నిర్సరణ ఒప్పందమైన అణు ఆయుధ నిషేధ ఒప్పందానికి (ఎన్.పీ.టీ.) కట్టుబడి ఉండి, 2015లో జాయింట్ కంప్రెహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం యూరేనియం శుద్ధిపై కఠిన నియంత్రణలను అంగీకరించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఐదు శాశ్వత సభ్య దేశాలు, జర్మనీ అలాగే యూరోపియన్ యూనియన్ మద్దతుతో ఆ ఒప్పందం జరుగగా, అమెరికా 2018లో దాన్ని ఏకపక్షంగా తుడిచేసింది. దీనివల్ల ప్రాంతీయ స్థిరతను తీసుకొచ్చే అనేక ఏళ్ల కృషి కాస్తా వృథా అయింది.

భారత్ కూడా ఆ నిర్ణయం వల్ల నష్టపోయింది. అమెరికా తిరిగి విధించిన ఆంక్షల వల్ల ఇరాన్‌తో ఉన్న వ్యూహాత్మక, ఆర్థిక ప్రాజెక్టులు...ఉదాహరణకు చబహార్ పోర్ట్ అభివృద్ధి, ఇంటర్నేషనల్ నార్త్-సౌత్ ట్రాన్స్పోర్ట్ కారిడార్ లాంటి వాటిని కొనసాగించడంలో తీవ్ర అడ్డంకులు వచ్చాయి. ఇవి మధ్య ఆసియా దేశాలతో అనుసంధానాన్ని పెంచేందుకు, ఆఫ్ఘనిస్తాన్‌ను నేరుగా చేరేందుకు కీలకమైనవి.

ఇరాన్ ఇండియాకు పాతకాలం నుండి స్నేహపూరిత దేశం. నాగరికతపరమైన అనుబంధాలు, రాజకీయ మద్దతు ముఖ్యంగా 1994లో జమ్మూ కాశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు వ్యతిరేకంగా రానున్న తీర్మానాన్ని అడ్డుకున్న సందర్భం మనకు గుర్తుంది. ఇది ఇస్లామిక్ రిపబ్లిక్‌గా ఉన్న తర్వాతి ఇరాన్. ఇందుకు విరుద్ధంగా 1965, 1971 యుద్ధాల్లో పాకిస్తాన్‌కు మద్దతు తెలిపింది మునుపటి ఇరాన్ సామ్రాజ్య పాలన.

ఇక పోతే ఇజ్రాయెల్‌తో కూడా ఇటీవల భారత్‌కు వ్యూహాత్మక సంబంధాలు మెరుగు పడ్డాయి. ఈ రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాలు భారత్‌కు కీలకమైన రాజకీయ బాధ్యతను, రాజనీతి గతమైన నైతికస్థాయిని ఇస్తాయి. లక్షలాది భారతీయులు పశ్చిమ ఆసియా దేశాల్లో పనిచేస్తున్నారు. కనుక ఆ ప్రాంతంలో శాంతి నెలకొనడం మన జాతీయ ప్రయోజనాల్లో అతి ముఖ్యమైన అంశాల్లో ఒకటి.

ఇజ్రాయెల్ తాజా దాడులు, ముఖ్యంగా ఇరాన్‌పై చేసినవి, ఒక రకమైన దండయాత్ర మాదిరిగానే ఉన్నాయి. పాశ్చాత్య శక్తుల నిర్బంధ రహిత మద్దతుతో, చట్టాన్ని నిర్లక్ష్యం చేసిన ఈ దాడులు నైతికంగా ఖండించదగినవే. 2023 అక్టోబర్ 7న హమాస్ చేసిన దారుణ దాడులను కాంగ్రెస్ ఖండించిన మాట నిజమే. కానీ, దానికి ప్రతిగా ఇజ్రాయెల్ చేస్తున్న ఘోరమైన ప్రతిదాడులపై మౌనం పాటించడం సమర్థనీయము కాదు. ఇప్పటివరకు 55,000 కంటే ఎక్కువ పాలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కుటుంబాలు, వసతిగృహాలు, ఆసుపత్రులన్నీ నాశనమయ్యాయి. గాజా ఆకలితో విలవిల్లాడుతూ, దుర్భరమైన మానవీయ పరిస్థితుల్ని ఎదుర్కొంటోంది.

ఇలాంటి సమయంలో, భారత్ మౌనం షాకింగ్. నరేంద్ర మోదీ ప్రభుత్వం గతంలో ప్రకటించిన రెండు-రాష్ట్రాల శాంతి పరిష్కారానికి అంకితంగా ఉన్న నీతిని విడనాడినట్లు కనిపిస్తోంది. గాజా నాశనం, ఇరాన్‌పై చేసిన ఘోరమైన చర్యలపై మౌనం వహించడం అనేది భారత్ యొక్క నైతికమైన, దౌత్యపరమైన సంప్రదాయాలకు విరుద్ధం. ఇది బాహ్య వాతావరణానికి మన స్వరం వినిపించకుండా పోయినట్లుగా కాక, మన విలువలను కోల్పోవడం దానితో సమానమైనది.

ఇప్పటికీ, ఇంకా ఆలస్యం కాలేదు. భారత్ స్పష్టంగా తన అభిప్రాయాన్ని చెప్పగలగాలి, మోదీకి ట్రంప్ అంటే అంత భయం ఎందుకో అర్థం కాదు. ఇంత పెద్ద భారత దేశం బాధ్యతాయుతంగా వ్యవహరించ లేకపోవడం శోచనీయం. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలను తగ్గించి, దౌత్య మార్గాల ద్వారా చర్చల బాటలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను వెంటనే భారత్ ప్రారంభించాలి. లేక పోతే అంతర్జాతీయ సంబంధాల చరిత్రలో ఒక దారుణమైన పొరపాటు ఉద్దేశపూర్వకంగా చేసినట్లు అవుతుంది.ఒకప్పుడు అమెరికా నాయకత్వంలో నిలిచిన నాటో దేశాలను... అలాగే సోవియట్ రష్యా నాయకత్వంలో నిలిచిన వార్సా ప్యాక్ట్ ను ధీటుగా ఎదుర్కొని అలీన దేశాలకు నాయకత్వం వహించి అనేక దౌత్య పరమైన వత్తిళ్ళను సహాసంగా ఎదుర్కొని నిలిచింది.అంతటి ఖ్యాతిని మోదీ ప్రభుత్వం కనీసంగా నైనా నిలబెట్టే చర్యలను చేపట్టకుండా మోనంగా చేష్టలుడిగి నిస్తేజంగా ఉండటం మనదేశ దౌత్య శక్తికి, యుక్తికి తీవ్ర కళంకంగా చరిత్రలో నిలిచిపోతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



# సమస్యలమయం - వ్యవసాయం

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం ఒక వెన్నెముక వంటిది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మన జనాభాలో సగానికి పైగా ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. 58 శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు ఇది జీవనాధారం. దేశ స్థూల జాతీయోత్పత్తిలో సుమారు 18 శాతం వ్యవసాయ రంగం నుంచే వస్తుంది. శ్రామికశక్తిలో 58 శాతం మంది ఈ రంగంలోనే ఉన్నారు అనగానే, దీని ప్రాధాన్యత మనకు అర్థమవుతుంది.

**భారతీయ వ్యవసాయం: సవాళ్లు, పరిష్కారాలు**

అయినప్పటికీ, భారతీయ వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. అవి పర్యావరణ, ఆర్థిక, సంస్థాగత, సాంకేతిక సమస్యల రూపంలో ఉన్నాయి. మన దేశంలో దాదాపు 65 శాతం వ్యవసాయం రుతుపవనాలపై ఆధారపడి ఉంది. వర్షపాతంలో హెచ్చుతగ్గులు కరువులు లేదా వరదలకు దారితీసి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. హరిత విప్లవం ఆకలిని తగ్గించినప్పటికీ, నేల క్షీణతకు దారితీసింది. ఒకే పంటను పదే పదే సాగు చేయడం వల్ల నేల పోషకాలను కోల్పోయి నిస్సారంగా మారింది. అస్తవ్యస్త నీటిపారుదల పద్ధతులు భూమి క్షీణతకు కారణమవుతున్నాయి. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్ వంటి ప్రాంతాలలో భూగర్భ జలాల అధిక వినియోగం వల్ల నీటి స్థాయిలు ప్రమాదకరంగా పడిపోయాయి.

**భూమి కమతాల విభజన:** దేశంలో అధిక సంఖ్యలో చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. తరతరాలుగా కుటుంబ సభ్యుల మధ్య భూమి విభజన జరగడం, జనాభా ఒత్తిడి కారణంగా భూమి కమతాలు చిన్నవిగా, ఛిన్నాభిన్నంగా మారాయి. ఇది సరైన నీటిపారుదల, యాంత్రీకరణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడానికి ఆటంకం కలిగిస్తుంది. తద్వారా పంటల ఉత్పాదకత తగ్గుతుంది.

**ఆర్థిక భారాలు:** ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరలతో పాటు కూలీల ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. అధిక ఖర్చుల కారణంగా సగానికి పైగా వ్యవసాయ కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. చాలా మంది అనధికారిక వనరుల నుండి అధిక వడ్డీకి రుణాలు పొందుతున్నారు. వాణిజ్య పంటలు సాగు చేసే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. కరువులు, పంట నష్టాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఒక్కోసారి రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. నాణ్యమైన ఎరువులు ఉపయోగించకపోవడం వల్ల నిస్సారమైన నేల పంట ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**మార్కెటింగ్ సమస్యలు:** అసమర్థమైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలు ధరల అస్థిరతకు దారితీస్తాయి. సరైన నిల్వ, రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల పంట అనంతర నష్టాలు పెరుగుతాయి. ముఖ్యంగా పాడైపోయే పంటలపై ఇది ఎక్కువ ప్రభావం చూపుతుంది. రైతులు తమ ఉత్పత్తులను వెంటనే తక్కువ ధరకు విక్రయించవలసి వస్తుంది.

**సాంకేతికత, వైవిధ్యం లేమి:** వినూత్న వ్యవసాయ పద్ధతులను అవలంబించడానికి రైతులు ఇష్టపడకపోవడం వల్ల ప్రపంచ వాణిజ్యంలో అధిక దిగుబడి, పోటీతత్వాన్ని పరిమితం చేస్తుంది. ప్రస్తుతం ఉన్న పంటల విధానం కొన్ని ప్రధాన పంటల వైపు వక్రీకరించబడింది. పంటల వైవిధ్యం లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం తెగుళ్లు, వ్యాధులు, మార్కెట్ ఒడిదుడుకుల బారిన పడుతుంది. ఆధునిక సాంకేతికతలను ఎక్కువగా ఉపయోగించడం లేదు.

**పరిష్కార మార్గాలు:**

భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి బహుముఖ విధానం అవసరం. వ్యవసాయ పనితీరును మెరుగుపరచడం, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధికి భరోసా ఇవ్వడానికి ఈ సవాళ్లను పరిష్కరించడం అత్యవసరం.

**నేల, నీటి సంరక్షణ:** నేల క్షీణతను అరికట్టడానికి పర్యావరణ అనుకూల పద్ధతులను పాటించాలి. సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులు, వర్షపు నీటి సంరక్షణను అమలు చేయాలి. రసాయన ఎరువుల స్థానంలో సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించాలి.

**వాతావరణ మార్పులకు అనుగుణంగా:** మారుతున్న వాతావరణ విధానాలకు అనుగుణంగా పంట రకాలు, పద్ధతులను అనుసరించాలి. తీవ్రమైన వాతావరణ సంఘటనల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి.

**సాంకేతిక వినియోగం:** వ్యవసాయ యంత్రాలను, అధునాతన వ్యవసాయ సాంకేతికతలు, డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ అందించాలి.

**మార్కెటింగ్ సంస్కరణలు:** పారదర్శక, సరసమైన ధరల విధానాలను ఏర్పాటు చేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే ఏర్పాట్లు చేయాలి.

**ఆర్థిక చేయూత:** రైతులకు ఆర్థిక సహాయం మరింతగా అందించాలి. రుణాల విషయంలో ప్రభుత్వ జోక్యం, సులభ వాయిదాలలో రుణాలు, వడ్డీ రాయితీలు వంటివి అవసరం.

**పంటల వైవిధ్యం:** రైతులను పంటల వైవిధ్యం వైపు ప్రోత్సహించాలి. కేవలం కొన్ని ప్రధాన పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్ డిమాండ్ ఉన్న ఇతర పంటలను సాగు చేయడానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

ఈ పరిష్కారాలు సమిష్టిగా అమలు చేయబడినప్పుడు, భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, సుస్థిరతను ప్రోత్సహించడానికి, ఉత్పాదకతను పెంచడానికి మరియు దేశవ్యాప్తంగా రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వ్యవసాయ రంగంలో స్థిరమైన వృద్ధి సాధించడం ద్వారానే మన దేశం నిజమైన అభివృద్ధిని సాధించగలదు. ప్రభుత్వాలు, రైతులు, శాస్త్రవేత్తలు కలిసి పనిచేసినప్పుడు మాత్రమే వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయగలం. ఈ సహకారంతోనే మన రైతులు సుసంపన్నమైన భవిష్యత్తును సాధించగలరు.

డి జె మోహన రావు, 8247045230

# ఇరాన్‌పై అమెరికా దాడులు

## బీకర్ దాడి మధ్యప్రాచ్య ఉద్రిక్తతలను మరింత పెంచేనా?

జూన్ 21, 2025న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విధంగా, ఇరాన్‌లోని మూడు ప్రధాన అణు కేంద్రాలుఫోర్డో, నటాంజ్, మరియు ఇస్ఫహాన్‌పై అమెరికా సైన్యం "ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్"లో భాగంగా దాడులు చేసింది. ఈ దాడులు ఇజ్రాయెల్-ఇరాన్ సంఘర్షణలో అమెరికా నేరుగా చేరడాన్ని సూచిస్తాయి, ఇది మధ్యప్రాచ్యంలో ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంది. ఈ దాడుల నేపథ్యంలో, ఇరాన్ ప్రతీకార దాడులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది, ఇది ప్రపంచ శాంతి మరియు ఆర్థిక స్థిరత్వానికి ముప్పు వాటిల్లేలా చేస్తోంది.

అమెరికా దాడులు ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య జూన్ 13 నుంచి కొనసాగుతున్న సైనిక సంఘర్షణల సమయంలో జరిగాయి. ఇరాన్ అణు కార్యక్రమం "ప్రపంచ శాంతికి ముప్పు" అని ట్రంప్ పేర్కొన్నారు, అయితే ఇరాన్ తమ అణు కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమేనని నొక్కి చెబుతోంది. అమెరికా డీ-2 స్పిరిట్ బాంబర్లు మరియు 30,000 పౌండ్ల బంకర్-బస్టర్ బాంబులను ఉపయోగించి ఈ దాడులను నిర్వహించింది, ఇవి భూగర్భ అణు సౌకర్యాలను ధ్వంసం చేయడానికి రూపొందించబడ్డాయి. ట్రంప్ ఈ దాడులను "పూర్తిగా విజయవంతం" అని ప్రకటించినప్పటికీ, ఇరాన్ అధికారులు ఫోర్డోలోని యురేనియం స్టాక్‌ను దాడికి ముందే సురక్షిత స్థానానికి తరలించామని, నష్టం తక్కువగా ఉందని పేర్కొన్నారు.

ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఈ దాడులను ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌కు "తీవ్రమైన ఉల్లంఘన"గా ఖండించారు, "శాశ్వత పరిణామాలు" ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ సైన్యం సోమవారం (జూన్ 23, 2025) కతార్‌లోని అల్-ఉదీద్ ఎయిర్ బేస్‌పై క్షిపణి దాడులు చేసింది, ఇది అమెరికా సెంట్రల్ కమాండ్‌కు ప్రధాన కేంద్రం. ఈ దాడిని ఇరాన్ రాష్ట్ర టెలివిజన్‌లో "అమెరికా దురాక్రమణకు గట్టి ప్రతిస్పందన"గా ప్రచారం చేసింది. అదనంగా, ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు హొస్సేన్ షరియత్మదారి, బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ నౌకలపై క్షిపణి దాడులు మరియు హొర్ముజ్ జలసంధిని మూసివేయాలని పిలుపునిచ్చారు, ఇది ప్రపంచ నూనె రవాణాకు కీలకమైన మార్గం.

ఈ దాడులు అంతర్జాతీయ సమాజంలో భిన్నమైన స్పందనలను రేకెత్తించాయి. ఇజ్రాయెల్ ఈ దాడులను సమర్థిస్తూ, ఇరాన్ అణు కార్యక్రమం "ప్రపంచ స్వేచ్ఛకు ముప్పు" అని పేర్కొంది. అయితే, ఐక్యరాజ్యసమితి డీ-ఎస్కలేషన్‌కు పిలుపునిచ్చింది. సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ దాడులపై "ఆందోళన" వ్యక్తం చేశాయి, అయితే చైనా వీటిని "మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను పెంచే చర్య"గా ఖండించింది. హెజ్బొల్లా మరియు యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు ఈ దాడులను "అమెరికా-ఇజ్రాయెల్ కుట్ర"గా పేర్కొంటూ, ప్రతీకార దాడులకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. అమెరికాలోని కౌన్సిల్ ఆన్ అమెరికన్-ఇస్లామిక్ రిలేషన్స్ (%జూ×=%) ఈ దాడులను "చట్టవిరుద్ధమైన యుద్ధ చర్య"గా వర్ణించింది.

**ఆర్థిక మరియు వ్యూహాత్మక పరిణామాలు**

హొర్ముజ్ జలసంధి మూసివేత గురించిన ఊహాగానాలు ప్రపంచ నూనె మార్కెట్‌లో ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి, ఎందుకంటే ప్రపంచ నూనె సరఫరాలో 20% ఈ మార్గం గుండా రవాణా అవుతుంది. ఇరాన్ ఆయిల్ ఎగుమతులు, ప్రధానంగా చైనాకు, దాని ఆర్థిక వ్యవస్థకు కీలకమైనవి, మరియు ఈ దాడులు ఆ ఆదాయాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. అదనంగా, ఇరాన్ అమెరికా సైనిక స్థావరాలపై దాడులు లేదా సైబర్ దాడుల ద్వారా ప్రతీకారం తీర్చుకోవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు, ఇది మధ్యప్రాచ్యంలో విస్తృత యుద్ధానికి దారితీయవచ్చు.

**నైతిక మరియు చట్టపరమైన ప్రశ్నలు**

అమెరికా దాడులు అంతర్జాతీయ చట్టం మరియు ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌ను ఉల్లంఘించాయని ఇరాన్ ఆరోపించింది. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా ఈ దాడులు జరగడం "రాజ్యాంగ విరుద్ధం" అని అమెరికా శాసనసభ్యులు ఖండించారు. మార్చి 2025లో అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బర్డ్, ఇరాన్ అణు ఆయుధాలను తయారు చేయడం లేదని పేర్కొన్నారు, ఇది ఈ దాడులకు ఆధారం లేనిదని సూచిస్తుంది. ఈ చర్యలు నిజంగా శాంతిని కాపాడేందుకా, లేక రాజకీయ మరియు వ్యూహాత్మక ప్రయోజనాల కోసమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# భారత-అమెరికా సంబంధాలు



భారతదేశం - యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (అమెరికా) మధ్య సంబంధాలు గత ఏడు దశాబ్దాలుగా గణనీయమైన పరిణామం సాధించాయి. స్వాతంత్ర్యానంతర భారతదేశం సోవియట్ యూనియన్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేది, అమెరికా కోల్డ్ వార్ యుద్ధ కాలంలో పాకిస్తాన్‌తో సన్నిహితంగా ఉండేది. అయితే, 21వ శతాబ్దంలో ఈ సంబంధం వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారింది. సామాజిక, రాజకీయ, సాంకేతిక, వాణిజ్య, రక్షణ, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలలో ఈ సంబంధం బలపడినప్పటికీ, టెర్రరిజం పై విభేదాలు, భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని కీలక రంగాల్లో భారత్ - అమెరికా సంబంధాలు, విభేదాలు స్తూలంగా పరిశీలన చేద్దాం.

భారతీయ వలసదారులు అమెరికా సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తు న్నారు. 2023 నాటికి అమెరికాలో సుమారు 4.8 మిలియన్ల భారతీయ సంతతి వారు నివసిస్తున్నారు, ఇది మొత్తం జనాభాలో 1.5 శాతం ఉంది. వీరిలో 70 శాతం మంది ఉన్నత విద్యావంతులు, మరియు వారి సగటు ఆదాయం $120,000, ఇది అమెరికా జాతీయ సగటు ($74,000) కంటే గణనీయంగా ఎక్కువ. సిలికాన్ వ్యాలీలో టెక్ కంపెనీల సీఈఓ లలో గూగుల్ (సుందర్ పిచాయ్), మైక్రోసాఫ్ట్ (సత్య నాదెళ్ల) వంటి భారతీయ సంతతి వారు ప్రముఖంగా ఉన్నారు.

ఈ సామాజిక సంబంధం భారతీయ సంస్కృతిని అమెరికాలో విస్తరింప జేసింది. హిందూ దేవాలయాలు, దీపావళి వేడుకలు, యోగా జనాదరణ పెరిగాయి. అయితే, కొన్ని సందర్భాలలో జాత్యహంకార ఘటనలు, వీసా విధానాలపై వివాదాలు (హెచ్-1బి వీసాలపై ట్రంప్ యుగంలో ఆంక్షలు) సవాళ్లుగా ఉన్నాయి. అమెరికా భారతీయ వలసదారులను సాంకేతిక నైపుణ్యం కోసం ఆకర్షిస్తుంది కానీ, వీసా విధానాలలో స్థిరత్వం లేకపోవడం వల్ల భారతీయ యువతలో అసంతృప్తి ఉంది.

**రాజకీయ సంబంధాలు:**

స్వాతంత్ర్యానంతరం, భారతదేశం అలీనోద్యమంలో భాగంగా అమెరికాతో దూరం పాటించింది. 1971 భారత-పాక్ యుద్ధంలో అమెరికా పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడం, యూ.ఎస్.ఎస్. ఎంటర్‌ప్రైజ్ నౌకను బంగాళాఖాతంలో మోహరించడం ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీసింది. అయితే, 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత, భారతదేశం అమెరికాతో సన్నిహితంగా మారింది. 2008 భారత-అమెరికా అణు ఒప్పందం ఒక మైలురాయి. 2016లో భారతదేశాన్ని అమెరికా "మేజర్ డిఫెన్స్ పార్టనర్"గా పేర్కొంది.

2024 నాటికి, భారతదేశం క్వాడ్ (అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారతదేశం) ద్వారా ఇండో-పసిఫిక్ వ్యూహంలో కీలక భాగస్వామి. 2023లో భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా కాంగ్రెస్‌లో రెండుసార్లు ప్రసంగించారు, ఇది అరుదైన గౌరవం. అమెరికా భారతదేశంలో మానవ హక్కులు, మత స్వేచ్ఛపై అనేక విమర్శలు చేస్తుంది. ఉదా: యూఎస్ సీఐఆరెఫ్ నివేదికలు, కానీ స్వయం ప్రయోజనం కోసం ఈ విమర్శలను రాజకీయంగా ఉపయోగిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి.

**సాంకేతిక సహకారం:**

సాంకేతిక రంగంలో భారత-అమెరికా సంబంధాలు బలమైనవి. భారతదేశం ఐటీ సేవలలో అగ్రగామిగా ఉండగా, అమెరికా సాంకేతిక ఆవిష్కరణలలో ముందుంది. 2023లో భారత ఐటీ రంగం అమెరికాకు $100 బిలియన్ల విలువైన సేవలను ఎగుమతి చేసింది. ఐసీఈటీ (ఇన్షియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్) ద్వారా ఇరు దేశాలు AI, క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్స్ రంగాలలో సహకరిస్తున్నాయి.

2023లో మైక్రాన్ టెక్నాలజీ గుజరాత్‌లో $2.75 బిలియన్ల సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రకటించింది. నాసా మరియు ఇస్రో మధ్య ఆర్టెమిస్ ఒప్పందం ద్వారా అంతరిక్ష సహకారం బలపడింది. అమెరికా సాంకేతిక బదిలీలో ఆంక్షలు విధిస్తుంది, ఉదాహరణకు, డ్రోన్ టెక్నాలజీ బదిలీపై ఆలస్యం. ఇది భారతదేశ స్వయం సమృద్ధి లక్ష్యాలకు అడ్డంకిగా తయారైంది.

**వర్తక-వాణిజ్య సంబంధాలు:**

భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 2023లో $190 బిలియన్లకు చేరింది, ఇందులో భారతదేశం $80 బిలియన్ల వస్తువులను, $40 బిలియన్ల సేవలను ఎగుమతి చేసింది. అమెరికా నుండి భారతదేశం చమురు, గ్యాస్, విమానాలు దిగుమతి చేస్తుంది. అయితే, వాణిజ్య వివాదాలు కొనసాగుతున్నాయి. 2019లో అమెరికా భారతదేశాన్ని జీఎస్ పీ (జనరలైజ్డ్ సిస్టం ఆఫ్ ఫ్రిఫరెన్స్) జాబితా నుండి తొలగించింది, దీనివల్ల భారత ఎగుమతులపై $5.6 బిలియన్ల ప్రభావం పడింది.

భారతదేశం అమెరికా వస్తువులపై అధిక సుంకాలు (ఉదా: హార్లీ డేవిడ్సన్ మోటర్‌సైకిళ్లపై ఖరీదు 150 శాతం), మరియు అమెరికా డేటా లోకలైజేషన్ విధానాలపై ఆంక్షలు విధించడం వివాదాస్పదం. ఇరు దేశలూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేకపోవడం ఆర్థిక సంబంధాలను పరిమితం చేస్తోంది.

**రక్షణ రంగంలో సహకారం:**

రక్షణ రంగంలో భారత-అమెరికా సంబంధాలు వేగంగా పెరుగుతున్నాయి. 2023 నాటికీ, భారతదేశం అమెరికా నుండి $20 బిలియన్ల విలువైన ఆయుధాలను కొనుగోలు చేసింది, ఇందులో Apache హెలికాప్టర్లు,ప్రిడేటర్ డ్రోన్స్, సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాలు ఉన్నాయి. ఇరు దేశాలు మలబార్ నావికా యుద్ధాభ్యాసంలో భాగస్వాములు. 2023లో జీఈ-హెచ్‌ఏఎల్ ఒప్పందం ద్వారా భారతదేశంలో యుద్ధ విమాన ఇంజన్ల తయారీకి ఒప్పందం కుదిరింది.

భారతదేశం రష్యా నుండి ఎస్-400 క్షిపణి వ్యవస్థ కొనుగోలు చేయడంపై అమెరికా అసంతృప్తి వ్యక్తం చేసింది, సీఏఏటీఎస్ఏ ఆంక్షల బెదిరింపులు చేసింది. అమెరికా భారతదేశాన్ని చైనాకు వ్యతిరేకంగా వ్యూహాత్మక భాగస్వామిగా చూడటం వల్ల రక్షణ సహకారం బలపడినప్పటికీ, భారతదేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పరిమితం చేసే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి.

**వ్యవసాయం, పారిశ్రామిక రంగంలలో సహకారం:**

వ్యవసాయ రంగంలో అమెరికా భారతదేశానికి ఆధునిక సాంకేతికత, జన్యు సవరణ విత్తనాలు (జీఎంఓ) అందించింది. 2022లో భారతదేశం అమెరికా నుండి $2 బిలియన్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు (బాదం, సోయా) దిగుమతి చేసింది. పారిశ్రామిక రంగంలో, బోయింగ్ , లాక్ హీడ్ మార్టిన్ వంటి అమెరికా కంపెనీలు భారతదేశంలో తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. జీఎంఓ విత్తనాలపై భారత రైతులలో ఆందోళనలు, మోన్ శాంటో వంటి కంపెనీలపై వివాదాలు సహకారాన్ని ప్రభావితం చేశాయి.

**సేవా రంగంలో:**

సేవా రంగంలో భారత ఐటీ కంపెనీలు (టీసీఎస్ , ఇన్ఫోసిస్ ) అమెరికా ఆర్థిక, రిటైల్ రంగాలకు సేవలు అందిస్తున్నాయి. 2023లో భారత ఐటీ ఎగుమతులలో 60 శాతం అమెరికా నుండి. అమెరికా కంపెనీలు (అమెజోన్, గూగుల్) భారతదేశంలో $20 బిలియన్ల పెట్టుబడులు పెట్టాయి. అయితే డాటా గోప్యత, స్థానీకరణ విధానాలపై విభేదాలు కొకొనసాగుతున్నాయి. అమెరికా కంపెనీలు భారత మార్కెట్‌ను ఆకర్షిస్తునపపటికీ, స్థానిక కంపెనీలకు సమాన అవకాశాలు లేకపోవడం వివాదాస్పదం.

**టెర్రరిజంపై అభిప్రాయాలు:**

టెరిరరిజంపై ఇరు దేశలూ సహకరిస్తునవాయి. 2008 ముంబై దాడుల తర్వాత FBI భారతదేశానికి సహాయం అందించింది. 2019లో అమెరికా జైష్-ఎ-మహమ్మద్ నాయకుడు మసూద్ అజర్‌ను గ టెర్రరిస్ట్‌గా గుర్తిసంచింది. అయితే, పాకిస్తాన్‌పై ఒత్తిడి తెచ్చే విషయంలో అమెరికా ద్వంద్వ వైఖరి అనుసరిస్తుందని భారత్ భావిస్తుంది. అమెరికా టెర్రరిజంను ఎదుర్కోవడంలో భారతదేశానికి మద్దతు ఇస్తుంది కానీ, పాకిస్తానికి ఎఫ్-16 యుద్ధ విమానాలు సరఫరా చేయడం వంటి చర్యలు భారతదేశ విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. భారత-అమెరికా సంబంధాలు బహుముఖీనమైనవి, వ్యూహాత్మకంగా ముఖ్యమైనవి. సాంకేతిక, రక్షణ, వాణిజ్య రంగాలలో సహకారం బలపడినప్పటికీ, వాణిజ్య వివాదాలు, రాజకీయ విభేదాలు, టెర్రరిజం పై భిన్నాభిప్రాయాలు సవాళ్లుగా ఉన్నాయి. ఇరు దేశాలూ పరస్పర ప్రయోజనాల కోసం సమన్వయంతో ముందుకు సాగాలి. భవిష్యత్తులో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, సాంకేతిక బదిలీలో పారదర్శకత ఈ సంబంధాన్ని మరింత బలోపేతం చేయగలవు.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

## అధికారులు జవాబుదారుగా పని చేయాలి

- 119 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 23 (జనం సాక్షి) :** అధికారులు జవాబీదారుగా విధులు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులపై శ్రద్ధ పెట్టాలని, ప్రజావాణిలో మొత్తం 119 దరఖాస్తు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను కూలం కషంగా పరిశీలించి, పెండింగ్ ఉంచకుండా, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులు రెవెన్యూ భూ సమస్యలకు సంబంధించి-50, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు,- 20, పింఛన్లు -03, ఎంప్లాయిమెంట్ -05, ఇతర సమస్యలు -41 మొత్తం 119 దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కాపాడండి

- రికార్డుల నుంచి కబ్జాకు గురవుతున్న భూములు
- కబ్జాలతో అక్రమా నిర్మాణాలే వారి లక్ష్యం
- ఇప్పటి వరకు చర్యలు శూన్యం
- ప్రజావాణిలో గోడును వెలిబుచ్చుకున్న గ్రామస్థులు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి) :** కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ గ్రామస్థులు, అధికారులకు విన్నవించుకున్నారు. రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములను ఆక్రమించి, ఎటువంటి హక్కు లేదా టైటిల్ లేకుండా సర్వే నెం. 969, 993, 994 మరియు 998 (ప్రభుత్వ భూమి)లో అక్రమ నిర్మాణాలు పైన పేర్కొన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని పత్రికా మాధ్యమాలలో ప్రచారం చేసినప్పటికీ, ప్రభుత్వ ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సర్వే నెం. 969, 993, 994 మరియు 998 సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ వద్ద ఉంది. అలాగే బీరంగూడ మల్లికార్జున స్వామి ఆలయం ఒక ప్రసిద్ధ ఆలయం అని ఈ ఆలయం చాలా కాలం క్రితం నిర్మించబడిందని, ఆలయానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములని కొంతమంది కబ్జా చేస్తున్నారని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది ప్రభుత్వ భూమి. అలాంటి భూమిని పాండురంగారావు స్వయంగా సవరించిన లేఅవుట్‌ను సృష్టించాడని తద్వారా ప్రభుత్వ భూమిలోని నివాస ప్లాట్‌లను చూపించి చాలా మంది అమాయక ప్రజలను మోసం చేశాడు. పాండురంగారావు సత్యాన్ని దాచడానికి సర్వే నెం. 966 మరియు 967 లోని పట్టా భూములకు సంబంధించి సేల్ డీడ్‌లను సృష్టించాడని కలెక్టర్కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. చాలా మంది ప్లాట్ కొనుగోలుదారులు ఇప్పటికే వారి నివాస గృహాలను నిర్మించినట్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 969, 993, 994, 998 ప్రభుత్వ భూములలో అక్రమ, అనధికారిక నిర్మాణాలను నిర్మించాలని సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కలెక్టర్ ముందు కూడా ప్రాతినిధ్యం వహించామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడటానికి తహశీల్దార్ వంటి అధికారులు, సంబంధిత మునిసిపాలిటీ కమిషనర్ కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వారికి బాగా తెలిసిన కారణాల వల్ల పైన పేర్కొన్న సర్వే నెం. 967 మరియు 966 లను సర్వే చేసి సరిహద్దులు నిర్ణయిస్తే నిజం బయటపడుతుందన్నారు. బీరంగూడలో అక్రమ నిర్మాణాలు సర్వే నెం. 969, 993, 994, 998 లలో ఉన్నాయని కలెక్టర్ కు తెలిపారు. అక్రమ మరియు అనధికార నిర్మాణాలను



ఆపమని సంబంధిత తహశీల్దార్, అమీన్‌పూర్‌ను ఆదేశించడం ద్వారా వెంటనే చర్య తీసుకోవాలని సవినయంగా ప్రార్థిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. సాధారణ ప్రజలతో సహా అందరి ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వ భూమిగా కంచె వేయాలని తహశీల్దార్‌కు మరిన్ని ఆదేశాలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కలెక్టర్ కలిసిన వారిలో అమీన్‌పూర్ మునిసిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ఎన్. నర్సింహ గౌడ్, అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్ ఎడ్ల రమేష్, అడెల్లి రవీందర్, తోకల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ, టి. సత్యనారాయణ, ఎన్. రమేష్ గౌడ్, ఎన్. కిష్టయ్య, బి. శివ, ఎం. మల్లేష్, బి. ప్రవీణ్ ఉన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**శామీర్‌పేట్, జూన్ 23 (జనంసాక్షి) :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు.పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని సింగాయి పల్లి లో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్,తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి ,హౌసింగ్ ఏఈ కమలాకర్ ,వార్డు ఆఫీసర్ పురుషోత్తం , ఇందిరమ్మ కమిటీ సభ్యులు మహమ్మద్ జాఫర్ ,రాజబోయిన శ్రీనివాస్ యాదవ్ ,కమటం మాధవి గారు,మాజీ కౌన్సిలర్ కోమటిపల్లి సురేష్ ,తదితరులు ఇంది రమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,ఇళ్లు రానివారు బాధపడొద్దు, విడతలవారీగా అర్హులందరికీ ఇండ్లు వస్తాయని, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని అన్నారు.రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని,బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**యాచారం, జూన్ 23 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.మండలంలోని మంతన్ గౌరెల్లి మాల్ నల్లవెల్లి తమ్మలోని గూడ,చింతపట్ల గ్రామాలలో 2 కోట్ల 36 లక్షల రూపాయలతో సిసి రోడ్లు డ్రైనేజీలు అంగన్వాడి కేంద్రాల నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభు త్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. పలు గ్రామాల్లో నీటి సమస్య గురించి ఎమ్మెల్యే కు వివరించారు. ఎమ్మెల్యే అధికారులను అరా తీయగా సరైన సమాధానం లేకపోవడంతో ఉన్నత అధికారులతో మాట్లాడి త్రాగునీటి సమస్య ను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, డైరెక్టర్లు మస్కు నరసింహ, గులాం అక్బర్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు,మాజీ వైస్ ఎంపీపీలు



రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జ్యోతి అరవింద్, లక్ష్మీపతి గౌడ్, మాజీ సర్పంచ్ కవిత శేఖర్,సరిత పాండు రంగారెడ్డి, బిలకంటి శేఖర్ రెడ్డి, మూడేళ్ల వెంకటరెడ్డి,లిక్కి రాజిరెడ్డి,దిండి రాంరెడ్డి, అమృత సాగర్,వరికుప్పల సుధాకర్, పోలమోని రామకృష్ణ, బట్టు శ్రీనివాస్, లిక్కి వెంకటరెడ్డి, పంచాయతీ రాజ్ డిఇ శ్రీనివాస్, తహశీల్దార్ అయ్యప్ప, ఎంపీడీవో బాల శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, జూన్ 23 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీ సమస్యలు పరిష్కరిస్తూ మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాప్రా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాప్రా డివిజన్ లో అభివృద్ధి పనులను పరిశీలించడానికి కాలనీవాసులు, అధికారులతో కలిసి పర్యటించారు.అశోక్ ఎంక్లేవ్ పార్క్ షిరిడి నగర్ సిసి రోడ్స్ శ్రీసాయి ఎంక్లేవ్ యుజిడి పనులు, - గౌరీనాథ్ పురం (యూజీడీ), ఎన్ఆర్ఐ కాలనీ సీసీ రోడ్స మల్లికార్జున్ నగర్ సిసి రోడ్స్ శ్రీ సాయి శివ నగర్ (ఆర్టీసీ కాలనీ ) వినాయక నగర్ ఫేస్ 3లో పర్యటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులు నాణ్యత ప్రామాణాలు పాటిస్తూ పనులను తురతగా తన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నవీన్ కుమార్ గౌడ్, మరాఠీ రవీందర్రావు, భాస్కర్ గౌడ్ ఇంద్రయ్య, మహేష్, బదురుద్దీన్, సతీష్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగకు నిధులు పెంచండి

**ఉప్పల్, జూన్ 23 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని దేవాలయాల్లో ప్రతి ఏటా బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గుడి లకు మంజూరు చేసే నిధుల నీ పెంచాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మినిస్టర్ క్వార్టర్స్‌లో రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పకుండా పెంచుతాం అని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- 223 ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ



**బొంరాస్‌పేట, జూన్ 23 (జనం సాక్షి) :** మైనార్టీల అభ్యున్నతికి సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు.మండల కేంద్రంలో సోమవారం మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా ముస్లిం మహిళలకు మంజూరైన 223 కుట్టు మిషన్ల ప్రోస్టింగ్ పత్రాలు, కుట్టుమిషన్లను అందజేశారు. మహిళలకు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో వెంకన్ గౌడ్,పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కారం

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి

**రంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ31 ఇతర శాఖలకు 45 మొత్తం 76 దారఖస్తులు వచ్చాయి. ః అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ వన మహోత్సవంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయుటకు సంబంధిత శాఖల అధికారులు మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి గుంతలు తీసి సిద్దంగా ఉంచాలని అవసరమైన మొక్కలను నర్సరీలలో అందుబాటులో ఉంచాలని, నాటిని ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు జిల్లాలో రైతులకు ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్కడ



ఎలాంటి ఇబ్బందులు సమస్యలు తలెత్తకుండా చూడాలని వ్యవసాయ శాఖాధికారికి తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ జిల్లా రెవెన్యూ అధికారి సంగీత వివిధ శాఖల జిల్లా అధికారులు మున్సిపల్ అధికారులు మండల తహశీల్దారులు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్య పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలి

- బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్

**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రైవేట్ పాఠశాల యాజమాన్యలు దౌర్జన్యంగా తల్లిదండ్రుల దగ్గర దోసుకుంటున్న అధిక ఫీజులను అరికట్టాలని మెదక్ జిల్లా విద్యాధికారి కి బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్య పేరుతో దోపిడీ జరుగుతుందని బీజేవైఎం మెదక్ జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్ అన్నారు. వారి ఇష్టానుసారంగా ప్రస్తుత సంవత్సరానికి ఫీజులను పెంచేసి విధిలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు అప్పులు తెచ్చి కట్టే పరిస్థితికి తెస్తున్నారు. దీనికి తోడు వారు పుస్తకాలు, యూనిఫామ్ వాటితోపాటు వారికి సంబంధించినటువంటి బ్యాగులు మొదలవు ఇతర వస్తువులను ఎక్కువ ధరలకు అమ్మి వ్యాపారం చేస్తున్నారు. దీనికి తోడు ప్రతి తరగతికి మించి ఎక్కువమందిని ఎన్రోల్ చేసుకుంటున్నారు. కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు



అనగా క్రీడా ప్రాంగణం, అగ్నిమాపక నియంత్రణలు మరియు విద్యార్థులకు సంఖ్యకు సరిపడా టాయిలెట్స్ నిర్మించడం లేదు. శానిటేషన్ మరియు టాయిలెట్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన సమయసారని పాటించకుండా వారి ఇష్టం వచ్చిన సమయాన్ని పాటిస్తూ విద్యార్థినీ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఉదయం 8:40 నిమిషాల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పూర్తి సమయాన్ని విద్యార్థులు పాఠశాలలోనే గడుపుతున్నారు. ఆ సమయంలో ఎలాంటి ఆటలను కూడా వారు ఆడిపించడం లేదు దీనితో వారు శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కావున మెదక్ జిల్లాలో ఉన్న తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రభుత్వ పాఠశాల సమయసారని ప్రైవేటు పాఠశాలలు కూడా పాటించే విధంగా తగిన ఉత్తర్వులు ఇస్తారని పైన పేర్కొన్న విధంగా ఇష్టానుసారం వసూలు చేస్తున్నటువంటి ఫీజుల విషయంలో తగు చర్య తీసుకుంటారని పిల్లల పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులపై వ్యాపారం చేస్తున్న వారిపై కఠినంగా చర్య తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో సాయి కిరణ్ , ఆంజనేయులు, చిరంజీవి బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు



**అల్వాల్, జూన్ 23 (జనంసాక్షి) :** పోచమ్మ గుడి సమీపంలోని హరిజన బస్తీ వాసులు తమ కాలనీలో వరుసగా ఎదురవుతున్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారంగా ఇటీవల మంజూరైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్ పునరుద్ధరణ పనులపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ ను కలిసి తమ కృతజ్ఞత తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, “ఇది చాలా కాలంగా ఉండిపోయిన సమస్య. సాంకేతిక అనుమతులు, టెండర్లు పూర్తి అయిన వెంటనే యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభిస్తామని. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం” అని హామీ ఇచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 జూన్ 2025

# బైపాస్ రోడ్డు పనులెందుకు ఆపారు..?

- ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి
- లేదంటే ప్రత్యక్ష ఆందోళనలు
- బీఆర్ఎస్ నేతల డిమాండ్

**వనపర్తి, జూన్ 23 (జనంసాక్షి) :** గత ప్రభుత్వం హయాంలో టెండర్లు పూర్తయిన రాజాపేట-పాన్‌గల్ బైపాస్ రోడ్డు పనులను చేయకుండా ఎందుకు ఆపేశారో స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రజలకు సమాధం చెప్పాలని పలువురు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ నిధులు ఉండి కూడా టెండర్ పూర్తి అయిన బైపాస్ రోడ్డు పనులు మీ నాయకుల ప్రయోజనాల కోసం ఆపుతారా అంటూ ఎమ్మెల్యేను ప్రశ్నించారు.నిరంజన్ రెడ్డి నిధులను మంజూరీ చేయించిన పనులను జరుగకుండా నిలుపుదల నిరంజన్ రెడ్డి చేసి ఆయన ఆనవాళ్ళను లేకుండా చేస్తామని చూస్తే ప్రజలు తిరగబడుతారని హెచ్చరించారు. జిల్లా



కేంద్రములో పెరుగుతున్న జనాభాకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకూడదని మాజీ మంత్రి బృహత్తర ప్రణాళికతో రోడ్ల విస్తరణ చేపట్టి దశాబ్దాల ప్రజల కలలను నెరవేర్చారని కొనియాడారు. రవాణా వ్యవస్థ సులువుగా ఉండి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఒప్పించి కేంద్రప్రభుత్వ ఆధీనములో ఉండే అటవీభూములలో బైపాస్ రోడ్డు వేయుటకు అనుమతులు తీసుకొని బైపాస్ నిర్మాణానికి రాజపేట శివారు నుండి పాన్ గల్ శివారు వరకు అర్ధ చంద్రాకారంలో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని అన్నారు.03.10.2022 నాడు జి.ఓ ఆర్.టి. నం 366ద్వారా 73కోట్ల రూపాయలు మంజూరు చేయించి 9.10.2023రోజు టెండర్ పూర్తి చేశారని వెల్లడించారు.టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ భానుప్రకాష్ పనులు ప్రారంభించారని గుర్తు చేశారు.రోడ్డు బేస్ కోర్సు కోసం ఎర్త్ వర్క్ పూర్తి చేశారని అన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అట్టి బైపాస్ రోడ్డు ఊసుఎత్తకుండా నిర్లక్ష్యం చేయడం మాజీ టి.డి.పి నాయకుడు,నేటి కాంగ్రెస్ పార్టీ నాయకుడి ప్రయోజనాల కోసం ఎర్త్ వర్క్ అయిన స్థలములో మళ్ళీ మొక్కలు నాటడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే గత ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే బి.ఆర్.ఎస్ ఆధ్వర్యములో ఉద్యమం చేపడతామని గట్టు యాదవ్ హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, నాయకులు నందిమల్ల రమేష్,చిట్యాల రాము పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధికి బీజం వేసిన శ్యాంప్రసాద్ సేవలు మరవరానివి



**తూప్రాన్, జూన్ 23 (జనం సాక్షి) :** భారతదేశం అభివృద్ధికి బీజం వేసిన మహానీయుల్లో డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ముందు వరుసలో ఉంటారని సూపర్ మండల బిజెపి అధ్యక్షుడు తిట్ల పోచయ్య పట్టణ ప్రెసిడెంట్ జానకి రామ్ గౌడ్ తెలిపారు. దేశ స్వాతంత్ర్యం తర్వాత జాతీయ సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన నేత. ఆయన చూపిన మార్గం ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాటి విట్టల్, దుర్గారాజు యాదవ్, నరసింహారెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సీతామాలక్ష్మి, టౌన్ జనరల్ సెక్రెటరీ పోతురాజు శరత్, భూత అధ్యక్షుడు మంగలి నవీన్, వెంకట్ రాకేష్, కుంట రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా సోమవారం వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి 12 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సిఐ, ఎస్సీలకు సూచించారు. భూ తగాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసు రెవెన్యూ అధికారులు.సమన్వయంతోఫిర్యాదులను పరిష్కరించాలని లేదా సామరస్యంగా మాట్లాడుకొని సమస్యలుపరిష్కరించుకోవాలని అన్నారు. ఏలాంటి ఆవేశాలకు లోనుకారదు అని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే చట్ట ప్రకారం పరిష్కరించా లని ఫోన్లో మాట్లాడి సంబం ధిత అధికారులకు తెలిపారు.7 ఫిర్యాదులు భూ తగదాల కు సంబంధించినవి రాగా, 3 ఫిర్యాదులు ఆస్తి తగాదాలకు సంబంధించి, 2 ఫిర్యాదులు ఫ్యామిలీ గొడవలకు సంబం ధించి రావడం జరిగింది.శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచిం చారు. పోలీస్ అధికారులు సిబ్బంది పోలీస్ స్టేషన్కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిం చి వినతులు ఫిర్యాదులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిశీ లించి చట్ట ప్రకారం బాధితుల కు న్యాయం జరిగే విధంగా చూడాలని తద్వారా పోలీస్ శాఖ పై భరోసా నమ్మకం కలుగుతుందన్నారు. పోలీస్ స్టేషన్కు, ఇతర కార్యాల యాలకు వెళ్లే ఫిర్యాదు దారులు మధ్యవర్తులను తీసుకెళ్లరాదని స్వయంగా వెళ్లి సమస్యను ఫిర్యాదు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య



**రాయికోడు, జూన్ 23 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య లబ్ధిదారులకు సూచించారు సోమవారం మండల పరిధిలోని ఎంకేపల్లి హస్నాబాద్ కర్చల్ రాయిపల్లి మామిడిపల్లి గ్రామాలలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమి పూజలో ఆయన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్ లతో కలిసి టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఇచ్చి మాట నిలుపుకున్నారని గుర్తు చేశారు రైకోడ్ మండల అభివృద్ధికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎనలేని కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరు లబ్ధి పొందాలని ఆయన సూచించారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మండల పరిధిలోని సింగీతం పలు గ్రామాల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను నాయకులతో కలిసి జి. అంజయ్య పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో బొగ్గులంపల్లి ఎత్తిపోతల పథకం చైర్మన్ జంబిగి యాదుల్ మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు సతీష్ కుమార్ మాజీ ఎంపీటీసీ జి విట్టల్ మహంకాళి బాబు కుమార్ నాయకులు అలీముద్దీన్ వై మోహన్ శ్రీనివాస్ రవి పాటిల్ నరసింహులు ఆర్ రాజకుమార్ ఎండి రఫీక్ జానకి రాజ్ కుమార్ పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో మొక్కలదే కీలక పాత్ర

- తూప్రాన్ సిఐ రంగా కృష్ణ



**తూప్రాన్, జూన్ 23 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని తూప్రాన్ సీఐ రంగ కృష్ణ తెలిపారు .తూప్రాన్ పురపాలక సంఘం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా తూప్రాన్ మున్సిపల్ పెద్ద చెరువు కట్ట పైన మొక్కలను మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రసంగించారు ప్రతి ఒక్కరు కనీసం ఐదు మొక్కలని నాటాలని వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవడం అన్నారు. మొక్కల ద్వారా స్వచ్ఛమైన ఆక్సిజన్, ఆహ్లాద కరమైనటువంటి వాతావరణం, పచ్చల హారంగా ప్రాంతం రూపుదిద్దుకుటుందని అన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా మంచి బాటలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఎస్ఐ శివానందం మున్సిపల్ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడపరాదు

- జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ వి.రజని




**వనపర్తి క్రైమ్, జూన్ 23 (జనంసాక్షి) :** మైనర్లు వాహనాలు నడపరాదు అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి రజని అన్నారు సోమవారం కొత్తకోట మండలంలో అమడబాకుల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వాహన యజమానులపై కేసులు నమోదు అవుతాయని తెలియజేశారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశమైన చట్టాలను వివరించడంలో భాగంగా పోక్సో యాక్ట్ బాల్యవివాహాల చట్టం మోటార్ వెహికల్ యాక్ట్ బాల కార్మికుల చట్టం సైబర్ క్రైమ్స్ గురించి తెలియజేశారు ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు కార్యక్రమంలో సఖి లీగల్ కౌన్సిల్ డి. కృష్ణయ్య, కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాల జెడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# జూలై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి జంగయ్య మాదిగ

**వీపనగండ్ల, జూన్ 24 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎం.ఎస్.ఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు మొలకలపల్లి పరుశరాముడు మాదిగ అధ్యక్షతన నిర్వహించగా జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ జంగయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మీసాల నాగరాజు మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ మాదిగల కోసమే ఏర్పాటు చేసిన,మాదిగల వరకే పరిమితం కాలేదని సమాజంలో పీడింపబడుతున్న ప్రతివర్గం పక్షాన నిలబడి తన పోరాటాలను నిర్వహించిందని గుర్తు చేశారు. పాలకులు విస్మరించిన, ప్రతిపక్షాలు, పార్టీలు పట్టించుకోని సమస్యలను ప్రజల పక్షాన ఎజెండాగా చేసుకుని పాలకుల నుండి అనేక సంక్షేమ పథకాలను ఫలితాల రూపంలో సమాజానికి అందించిందని అన్నారు. ఆరోగ్య శ్రీ, వికలాంగుల పెన్షన్, వృద్ధులు వితంతువుల పెన్షన్,ఆకలి కేకల పోరాటంతో రేషన్ కోట బియ్యం పెంచడం, ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ప్రతి వర్గం పక్షాన నిలబడి సమాజం పట్ల తన బాధ్యతను నిర్వర్తించిందని అన్నారు. అంబేద్కర్ ఉన్నప్పటి నుండి నేటి వరకు మిగిలి ఉన్న సమస్యల పరిష్కారం కోసం పీడిత వర్గాలను ఏకం చేసి దేశవ్యాప్త ఉద్యమాన్ని ఎమ్మార్పీఎస్ నిర్మిస్తుందని అన్నారు. అన్ని కులాలు చైతన్యమై మహాజన సమూహంగా నిర్మాణం కావాలని అన్నారు.రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అందక పోవడం వల్లనే మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారు అని అన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలని మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ముప్పై ఏళ్ళు రాజీలేని పోరాటం సాగిందని, ఆ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చిందని, మాదిగలకు 9% రిజర్వేషన్లు దక్కాయి అని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న రిజర్వేషన్ ఫలాలు మాదిగ విద్యార్థులు నిరుద్యోగులు అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి రావాలని, అందుకోసం వర్గీకరణ ఫలాలు అందుకునే విధంగా మాదిగ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి కోరారు. మందకృష్ణ మాదిగ సారథ్యంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జులై 7న




మాదిగల ఆత్మగౌరవ ప్రతీకైనా ఎమ్మార్పీఎస్ జెండాను ప్రతి గ్రామంలో ఎగరవేయాలని అందుకోసం ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ విభాగాలను పునర్నిర్మానం చేసుకొని మాదిగలను శక్తివంతంగా తయారు చేయాలని అన్నారు.జులై 7 ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఒక పండుగ వాతావరణంలో ఎమ్మార్పీఎస్ జండా ఆవిష్కరణలు ఘనంగా నిర్వహించాలని, ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తోడ్పాటు అందించిన అన్ని కులాల, వర్గాల ప్రజల్ని పిలిచి సన్మానించి కృతజ్ఞత చాటాలని ఎమ్మార్పీఎస్ శ్రేణులను కోరారు.నూతన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గా మీసాల రాజశేఖర్ మాదిగను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మొలకలపల్లి నాగరాజు మాదిగ, గ్రామ అధ్యక్షులు మీసాల సహదేవుడు మాదిగ, సీనియర్ నాయకులు మీసాల శ్రీను మాదిగ,సీనియర్ నాయకులు గడ్డల రాముడు మాదిగ,అంబేద్కర్ యువజన అధ్యక్షులు దయ్యపు రాజు మాదిగ,అంబేద్కర్ యువజన ప్రధాన కార్యదర్శిసింగవరం రాములు మాదిగ,దయ్యపు రవి వర్మ మాదిగ,బండారు విష్ణు మాదిగ,గడ్డమిది రాముడుమీసాల గంగూలీ మాదిగ, మీసాల సహదేవుడు మాదిగ,దయ్యపు తేజ మాదిగ,తోలు రాముడు మాదిగ గడ్డమిది కర్ణాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి




**మద్దూరు, జూన్ 23 (జనం సాక్షి) :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మద్దూరు ఎస్ఐ విజయ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కారించుకొని మద్దూర్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు అలవాటు పడరాదని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సరదా కోసం మొదలైన అలవాటు మత్తులోకి నెడుతోందని, గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత ఇప్పుడు నిషా కోసం గంజాయి, మాదకద్రవ్యాల బారినపడి మత్తుకు బానిసలవుతున్నారని అన్నారు. సమాజంలోని మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత మాధకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలకు బానిసలై విముక్తిపొందిన వారితో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను గురించి తెలియజేసినట్లైతే , యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించవచ్చన్నారు. ఎవరైనా చెడు వ్యసనాలకి మారినట్లయితే తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908, డయల్ 100 కానీ మీకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. ఆది
- విద్యార్థుల కోసం ఆందోళన ఉధృతం చేస్తాం

**వీపనగండ్ల, జూన్ 24 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డిప్యూటేషన్ల పద్ధతిలో వెళుతున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు మహిపాల్ రెడ్డి, సాంఘిక శాస్త్ర ఇంద్రయ్య ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను తక్షణమే రద్దు చేయాలని వీపనగండ్ల మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు విద్యార్థులు,ఎస్ఎఫ్ఐ బయటాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. ఆది మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడం కోసం బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తుండగా మరోపక్క ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు పాఠాలు బోధించకుండా డిప్యూటేషన్‌పై తమకు అనుకూలంగా ఉన్న



ప్రాంతాలలోకి వెళ్లేందుకు ప్రయత్నం ప్రయత్నం చేయడం సబబు కాదని అన్నారు. డిప్యూటీల పైన వెళ్లే ఉపాధ్యాయులకు మద్దతుగా జిల్లా విద్యాశాఖ అధికార యంత్రాంగం వత్తాసు పలకడం సబబు కాదని విద్యార్థుల జీవితం నాశనం చేయొద్దని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు డిప్యూటేషన్ల పై వెళ్తున్న ఉపాధ్యాయులకు వత్తాసు పలుకుతూ పైరవీకారులకు సహకరించడం సిగ్గుచేటు అని విమర్శించారు. ప్రభుత్వ విద్య అధికారులు ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేయడమే కాకుండా మూతపడే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రయత్నాలు ఇందుకు నిదర్శనం ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల పద్ధతి అని విమర్శించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేయాలని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నేతల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం.రామకృష్ణ, నాయకులు నవీన్, డివైఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, ఈశ్వర్, ప్రజా సంఘాల నాయకులు ఆశన్న, వెంకటేశ్వర గౌడ్, సిహెచ్.వెంకటయ్య, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హాయ్ అంటూనే మాయ చేస్తారు!

- అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ఇద్దరు ముఠా సభ్యుల అరెస్ట్




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** అంతర్రాష్ట్ర ఘరానా సైబర్ నేరగాళ్ల ఇద్దరు ముఠా నిందితులను అరెస్టు చేసి సోమవారం జిల్లా కేంద్రంలోని విధ్యానగర్ కాలనీలో గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం, తికమ్‌గఢ్ జిల్లాకు సంబంధించిన వారు. నిందితులను కమిషన్ ఏజెంట్లుగా వాడుకుంటూ సైబర్ నేరాలకు పాల్పడుతూ ఉంటారని తెలిపారు. అమాయకులను వాట్సాప్ ద్వారా వర్క్ ఫ్రం హెూం మరియు తక్కువ డబ్బులతో, తక్కువ సమయంలో, ఎక్కువ లాభం సంపాదించవచ్చు అంటూ మోసం చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈనెల 14న బాధితుడు ఫిర్యాదు చేసిన ఫిర్యాదు ఆధారంగా టెలిగ్రామ్ మరియు వాట్సాప్ ద్వారా బాధితుడు రూ 5,03,000/- పోగొట్టుకున్నట్లు 1930 కు ఫిర్యాదు చేయగా, రూరల్ పోలీస్ స్టేషన్ కు సంబంధించిన ఈ కేసు ను ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఇద్దరు నిందితులను పట్టుకోవడంలో సఫలీకృతులయ్యారన్నారు. ఘరానా మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లకు కమిషన్ ఏజెంట్లుగా పనిచేస్తున్న ఈ ఇరువురు సైబర్ నేరగాళ్లు చేసే విధానం హాయ్ నా పేరు టీనా అంటూ వాట్సాప్ ద్వారా అమాయకులకు మెసేజ్ చేస్తూ, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు, ఇంట్లోనే ఉంటూ రోజుకు 2000 నుండి 8000 వరకు సంపాదించవచ్చని నమ్మబలుకుతూ, టాస్కులను కేటాయించడం వల్ల, టాస్కులను పూర్తి చేసిన తర్వాత మొదటిసారి 150 రూపాయల నుండి 450 రూపాయలను బాధితులకు పంపి, వారిని టెలిగ్రామ్ ద్వారా ఎక్కువ డబ్బులను సంపాదించవచ్చు అని మోసం చేసి. టెలిగ్రామ్ లో ఎక్కువ డబ్బులను ఆశ చూపి, బాధితుడికి ఒక సైబర్ అకౌంట్లో వారు చేసిన టాస్కులకు సంబంధించిన డబ్బును చూపిస్తూ వాటిని తీసుకోవాలంటే మరింత డబ్బు జమ చేయాలంటూ విడతలవారీగా బాధితుడు వద్ద నుండి రూ 5,03,000/- వసూలు చేసి, మోసం చేస్తున్నారన్నారు. ప్రధాన సూత్రధారులైన మిగిలిన ముఠా సభ్యులను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి త్వరలోనే అరెస్టు చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత సైబర్ నేరగాళ్లు చేయమన్న పనులు, టాస్కులను చేస్తూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులను ఆశించడం వల్ల ఉన్న డబ్బులను కోల్పోవడం జరుగుతుందని వారి వల్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్ల పాత్ర పెరిగిపోతున్న సందర్భంలో ప్రజలు అప్రమత్తతతో ఉండటం శ్రేయస్కరమని తెలిపారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 కు సంప్రదించాలని లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్కు సంప్రదించాలని తెలిపారు. డబ్బులను పోగొట్టుకున్నట్లయితే వెంటనే గోల్డెన్ హవర్ ఒక గంటలోపు సంప్రదించినట్లయితే పూర్తి డబ్బులను తిరిగి రాబట్టే అవకాశం ఎక్కువగా ఉన్నదని తెలిపారు. వాట్సాప్ ద్వారా టెలిగ్రామ్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించ వచ్చు అనే ప్రకటనల ద్వారా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వాటిని తిరస్కరించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వెబ్సైట్ల నందు, తెలియని అప్లికేషన్లను మొబైల్ ఫోన్లలో వినియోగించకుండా ఉండటం శ్రేయస్కరమని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, సోషల్ మీడియా ఫ్రాడ్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్, వర్క్ ఫ్రం హెూం ఫ్రాడ్, ఏపీకి ఫైల్స్ లాంటివి చలామణిలో ఉన్నట్టు వాటి వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె ఫణిదర్, ఎస్సై వి విష్ణువర్ధన్, నవనీత్, సంజీవ్, మండల్ సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడి సహాయానికి బాసటగా రైతు భరోసా పథకం

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, జూన్ 23 (జనంసాక్షి) :** వర్షాకాలం సీజన్ ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద రైతులకు నిధులు అందజేస్తోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.రైతు భరోసా నిధుల జమ ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తుందని అన్నారు.సోమవారం నాటికి నిర్మల్ జిల్లాలో మొత్తం రూ.260.80 కోట్ల రైతు భరోసా నిధులు విజయవంతంగా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు.జిల్లాలో ఉన్న మొత్తం1,86,400 మంది రైతుల్లో1,85,116 మంది ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డీబీటీ) ద్వారా నిధులు చేరాయని వివరించారు. మిగిలిన అతి కొద్దిమంది రైతులకు త్వరలోనే నిధులు జమ కానున్నట్లు తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. పెట్టుబడి భారం తగ్గడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. చివరి గుంట భూమి వరకు రైతులకు రైతు భరోసా అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ స్పష్టంచేశారు.పంట పనుల ప్రారంభానికి ముందే నిధులు జమ కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

## నేడు రైతులతో ముఖాముఖీ

- వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ

**వరంగల్ ప్రతినిధి,జూన్ 23 (జనంసాక్షి):** వానాకాలం 2025 నకు సంబంధించి పంట సాగు కై పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పథకం ద్వారా నిధులను విజయవంతంగా రైతుల ఖాతాలో జమ చేసిన సందర్భంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, హైదరాబాద్ నుండి రైతులతో రైతు వేదికల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లాలోని 33 రైతు వేదికలలో పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి రైతు వేదిక వద్ద అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు డిఏఓ పేర్కొన్నారు. ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్ గా నియమించబడిన జిల్లా, మండల స్థాయి అధికారులు, రైతు వేదికల వద్దకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, రైతులు రైతు వేదికలలో పెద్దఎత్తున చేరుకునేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్ జోన్ 23 (జనం సాక్షి) :** శిథిలావస్థకు చేరిన ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. సోమవారం కళాశాలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 1969 సంవత్సరంలో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల శాతం తగ్గిందని ప్రిన్సిపల్ శ్రీదేవి ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే కొత్త భవన నిర్మాణానికి నివేదికలు పంపాలని సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. అలాగే ఇదివరకే నిర్మించిన భవనంలో ఎలాంటి లోటుపాట్లు ఉన్న పునరుద్ధరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ప్రిన్సిపల్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ను శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉన్నారు.

## పదో తరగతి విద్యార్థుల ప్రతిభ పురస్కార్ 2025 అవార్డ్స్




**వరంగల్ ఎంజీఎం, జూన్ 23 (జనంసాక్షి):** 25 సంవత్సరాలుగా విజయవంతంగా నడుస్తున్న మున్నూరు కాపు సంఘం ఫోర్ట్ రోడ్ వరంగల్ ఆధ్వర్యం లో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థుల ప్రతిభ పురస్కార్ 2025 అవార్డ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సంఘం తరుపున సన్మానంతోపాటు ప్రోత్సాహక బహుమానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కత్తెరశాల కుమారస్వామి,అధ్యక్షులు ఇనుముల ఆగయ్య, ఉపాధ్యక్షులు పింగిలీ సోమయ్య, కార్యదర్శులు సుతారి రవీందర్,బండి రాజు, కోశాధికారి పింగిలి రాజు,సహ కోశాధికారి కొండ్ర రాజు, ఆర్గనైజర్లు దొరం నారాయణ స్వామి,పిన్న వినయ్ కుమార్ ,కమిటీ సభ్యులు తోట అనిల్,తోట అశోక్ ,వడగం రాజేష్,ముఖ్య సలహాదార్లు మిట్టపల్లి వెంకటేశ్వర్లు,వాసం సదానందం గార్లు మరియు ఉత్తీర్ణులైన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 23 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేసి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్రావు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ప్రతినిధులు తమ దరఖాస్తులో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎలాంటి షరతులు లేకుండా లబ్దిదారులకు నిధులు మంజూరు చేయాలని, బడ్జెట్లో ఈ పథకం కొరకు నిధులు పెంచాలని, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులందరికీ పథకం వర్తింపచేయాలని కోరారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామానికి చెందిన గోమాస బింగమ్మ, గోమాస భాగ్యలక్ష్మి, గోమాస ధనలక్ష్మి, దుర్గం సౌందర్య తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరు వేరుగా దరఖాస్తులు అందజేశారు. లక్షెట్టిపేట మండలం పాతకొమ్ముగూడెం గ్రామానికి చెందిన శంకరి సత్యం తనకు ఇంటి స్థలం ఉందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపచేసి ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామం ఎస్.సి. కాలనీవాసులు తమ ప్రాంతంలో ఒక అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన చిత్తారి కిరణ్ కుమార్ హాజీపూర్ మండలం గుడిపేటలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల సౌకర్యార్థం క్యాతనపల్లి వరకు నడుస్తున్న ఆర్.టి.సి. బస్సును మందమర్రి వరకు నడిపించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన గంగవరపు శ్రీహరి తాను కోటపల్లి మండలంలోని లింగన్నపేట, రాజారాం గ్రామాలలో మహిళ భవనములను నిర్మించాలని, సంబంధిత బిల్లులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన అంకం సాగర్ సివిల్ కాంట్రాక్టర్ అయిన తాను హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో స్లాబ్ కల్వర్టు పని పూర్తి చేశానని, బిల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 49 దరఖాస్తులు అందాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభ్యాస స్కూల్‌లో రోబోటిక్ ఈవెంట్ ఆవిష్కరణ



**వరంగల్ ఎంజీఎం, జూన్ 23(జనంసాక్షి):** నగరంలోని గణేష్‌నగర్‌లో అభ్యాస స్కూల్ లో అద్భుతాలు సృష్టించే రోబోటిక్ విద్యా ఈవెంట్ ను పాఠశాల కరస్పాండెంట్ శ్రీ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ అధ్యక్షతనలో జరిగిన ఈవెంట్ కు విశ్రాంత జిల్లా విద్యా శాఖ అధికారీ నన్నపరాజు రామేశ్వర రాజు విశిష్ట అతిగా పాల్గొని ఈవెంట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తమ సందేశంలో రానున్న సమాజానికి సరైన సమయంలో సరైన టెక్నాలజీ విద్యను అందించడం అభ్యాస స్కూల్ చేస్తున్న కృషిని అభినందించారు. కేవలం పుస్తకాల విద్యనే కాక నిత్య జీవితం లో అవసరమైన విద్యను ప్రతి విద్యార్థికి అందించాలని కోరారు. అటువంటి విద్యను కేవలం ఒక అభ్యాస స్కూల్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ స్కూల్ లో చదివిస్తున్న పేరెంట్స్ అదృష్ట వంతులు విద్యార్థులు ఏది కావాలన్న సమకూర్చే యంగ్ అండ్ డైనమిక్ డైరెక్టర్ ఉండడం విద్యార్థుల అదృష్టం అని అన్నారు సమాజానికి ఏం అవసరమో పాఠశాల స్థాయి నుండి అలవర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. అభ్యాస లో ఏర్పాటు చేసే ప్రతి కార్యక్రమం విద్యార్థి అభివృద్ధి కోసం చేయడం అభినంద నియం అని అన్నారు. కరస్పాండెంట్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ తమ సందేశంలో బెంగుళూరు తరహా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రథమంగా ఇక్కడ అభ్యాస స్కూల్ లో ఈ ఈవెంటు ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ రోబోటిక్ విద్యను విద్యార్థులు అవగాహన కల్పించి ఇయర్ లో 50 కి పైగా ఎక్సిబిట్స్ తాయారు చేయించడం అభ్యాస స్కూల్ లక్ష్యమని అన్నారు. ట్రైనీ టీచర్స్ ద్వారా ఒక పాఠ్యాంశంగా ఏర్పాటు చేసి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను సృజనాత్మకత ను వెలికి తీసి వారిని ఉన్నత స్థాయికి తీసుకొని వెళ్ళడమే అభ్యాస స్కూల్ యొక్క లక్ష్యం అని అన్నారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రథమంగా ఏర్పాటు చేసిన ఏకైక స్కూల్ అభ్యాస స్కూల్ అని సగర్వంగా చెప్పుకుంటున్నాను అని అన్నారు. ఈ ఈవెంట్ ఆవిష్కరణ సందర్భంగా జాతీయ అవార్డు గ్రహీత కుమారి పి లక్ష్మీ స్నిగ్ధ ప్రదర్శించిన స్వాగత నృత్యం అందరినీ ముగ్ధులను చేసింది. రోబోటిక్ టీమ్ సభ్యులు పాల్గొని రోబోటిక్ టెక్నాలజీ గురించి విద్యార్థులకు వివరించిన విధానం పలువురిని అబ్బుర పరిచింది. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ మేడం మండల శిరీష, కోల రాము, ఉపాధ్యాయులు మహేష్, సంతోష్, రబ్బానీ, ప్రియాంక, రజినీ, భారతి, సృజన, సౌమ్య, సదానందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి):** ప్రజావాణి దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డియార్వో విజయలక్ష్మి , జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి,ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి,నర్సంపేట ఉమారాణి ప్రజలనుండి ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిం చారు. సోమవారం కలెక్టరేట్లో తీసుకున్న దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని,ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 121 దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ 53, హౌసింగ్ 14 దరఖాస్తులు వచ్చాయని మిగతా శాఖలకు సంబందించిన దరఖాస్తులు 54 వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, పరిష్కరించుటకు వీలుకాని సమస్యలను ఎందుకు పరిష్కరించబడవో దరఖాస్తు దారునికి వివరించే ప్రయత్నం చేయాలని , ప్రజావాణి దరఖాస్తుల పరిష్కరించిన వివరాలు దరఖాస్తుదారుడి మొబైల్ కు సాంకేతి కంగా సమాచారం అందిం చేలా చూడాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారు లను ఆదేశించారు. జిల్లా అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఐ పెండెన్సీ లేకుండా చూడాలని, గ్రీవెన్స్ పోర్టల్ లో పెండెన్సీ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఈ- ఫైలింగ్ విధానాన్ని అమలుచేయాలని, ,బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పని సరి అని జిల్లా అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. వ్యవసాయ, ఆరోగ్య, విద్యా శాఖ మరియు తదితర శాఖలు శాఖపరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నిర్ణీత గడువులోగా పనులు చేయించాలని పనులపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసి లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యా శాఖ విషయంలో టాయిలెట్లు, వాష్ రూమ్ లో ఏవైతే మరమత్తులు చేయవలసి ఉన్నట్లైతే ఆయా స్కూళ్లను పరిశీలించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పనులు పూర్తి చేయాలని, జిల్లాలో ఉన్న హాస్టల్స్ ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న నీటి ట్యాంక్ లను క్లీనింగ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని, ఆర్‌సిఓ లను ఆదేశించారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా కో.పరేటివ్ అధికారి నీరజ, కలెక్టరేట్ పరిపాలన అధికారి విశ్వప్రసాద్ వరంగల్, ఖిలా వరంగల్ తహసిల్దార్లు ఇక్బాల్,నాగేశ్వర్ రావు, హార్టికల్చర్ అధికారి అనసూయ, డిబిసిడివో పుష్పలత,జిల్లా విద్యా శాఖ అధికారి జ్ఞానేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జూన్ 23(జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణి ఆశ్రయిస్తున్నారని, వారి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, ప్రజావాణి పోర్టల్ లోని పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో 56 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 23, గృహ నిర్మాణ శాఖకు 15, ఉపాధి కల్పనకు 1, పెన్షన్ 2, ఇతర శాఖలకు సంబంధించినవి 15 దరఖాస్తులను స్వీకరించగా వాటిని పరిశీలించిన అనంతరం సమావేశ మందిరంలోనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## డయేరియా వ్యాధి బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలి

- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**భూపాలపల్లి, జూన్ 23 (జనంసాక్షి) :** ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా 2025 క్యాంపెయిన్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-5 సంవత్సరాల చిన్నారులు ఈ అతిసార వ్యాధి బారిన పడే అవకాశం ఉందని, వారి విషయంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అంగన్ వాడి కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, క్రమం తప్పక చేతులు పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. సురక్షిత మంచినీరు తీసుకోవాలని సూచించారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. డయేరియా నివారణ చర్యల్లో శుద్ధినీటి సరఫరా, హైజిన్ మెరుగుదల, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక ఫోకస్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా సూపర్వైజర్లు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్యాంపెయిన్ ద్వారా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులలో డయేరియా కేసులు పూర్తిగా తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా 5 సంవత్సరాలు వయస్సున్న పిల్లల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పారిశుధ్యం, వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు తరచూ చేతులను సబ్బుతో కడగాలని సూచించారు. నిల్వ ఉంచిన ఆహారాలు తినొద్దని, పరిశుభ్రమైన మంచినీరు త్రాగాలని తెలిపారు. డయేరియా వ్యాది సోకితే తక్షణమే వైద్యుల ను సంప్రదించి వైద్య సేవలు తీసుకోవాలని స్పష్టం చేశారు.. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈఓ రాజేందర్, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, బిసి సంక్షేమ అధికారి క్రాంతి కిరణ్, ఆర్డిఓ రవి, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు పరిష్కారం

- రెవెన్యూ శాఖ పరిపాలనకు వెన్నుముక లాంటిది
- జిల్లాలో రెవెన్యూ సదస్సులు విజయవంతం
- రేషన్ దుకాణాల తనిఖీలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి) :** పంద్రాగస్ట్ నాటికి జిల్లాలో రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి భూ భారతి అవగాహన సదస్సులో రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన అర్జీల పరిష్కరణకు రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా జూన్ 3 నుండి జూన్ 20 వరకు అన్ని గ్రామాలలో అధికారులే ప్రజల వద్దకి వెళ్ళి 44741 అర్జీలు స్వీకరించి విజయవంతం చేసినందుకు రెవిన్యూ సిబ్బందిని అభినందించారు.ఆ అర్జీలను మిస్సింగ్ సర్వే నెంబర్, డిఎస్ పెండింగ్, విస్తీర్ణం సవరణ, పౌతి అమలు,భూమి స్వభావం లాంటి వాటిపై వచ్చినవి విడివిడిగా అర్జీలను వేరు చేయాలని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఒకే రకంగా అర్జీలను ఒకే విధానం ద్వారా పంద్రాగస్ట్ నాటికి పరిష్కరించాలని సూచించారు.అర్జీలను పరిష్కరించేందుకు ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో డెస్క్ లో పని చేసేందుకు ఒక బృందం, క్షేత్ర స్థాయి పరిశీలన చేసేందుకు మరో బృందం ఏర్పాటు చేయాలని సూచించారు. అర్జీలు పరిష్కరించేందుకు మండలంలోని గ్రామాల వారీగా ప్రణాళికబద్ధంగా షెడ్యూల్ తయారు చేసుకోవాలని అన్నారు.ముందుగా వచ్చిన అర్జీలకి సంబంధించి రెవిన్యూ రికార్డులు పరిశీలన చేసి జిరాక్స్ లను అర్జీలకి జతపర్చాలని, ప్రతి జిరాక్స్ పై సంబంధిత అధికారులు అందరు సంతకం చేయాలని సూచించారు. ఏ గ్రామంలోకి అయితే క్షేత్రస్థాయి బృందం పరిశీలనకి వెళ్తున్నారో ఆ రైతులకి ముందుగానే నోటీసులు జారీ చేయాలని సూచించారు. రికార్డులు జత చేసిన అర్జీలను తీసుకొని క్షేత్రస్థాయి పరిశీలన చేయుటకి వెళ్లాలని, అక్కడే పక్క రైతుల వాంగ్మూలం, పంచనామా చేయాలని సూచించారు.ఏమైనా వాదనలు వినాలనుకంటే అక్కడికడే పరిష్కరించుకోవాలని సూచించారు.ఒకే రకంగా జిల్లా వ్యాప్తంగా చెక్ మెమో తయారు చేసి అన్ని రికార్డ్ లను జతపరిచి అధికారులు అందరు సంతకం చేయాలని తెలిపారు.గతంలో అర్జిలు తిరస్కరణకి గురైతే మరలా అవే వస్తే మరల తిరస్కరణ చేయకూడదని పూర్తి సమాచారం పరిశీలించిన తర్వాతనే పరిష్కరించాలని పేర్కొన్నారు.ఒక సర్వే నెంబర్ మీద కోర్ట్ కేసు ఉంటే అదే రైతుకి చెందిన ఇంకో సర్వే నెంబర్ కుడా నిషేధిత జాబితాలో ఉంటుందని వాటిని జాగ్రత్తగా పరిష్కరించాలని తెలిపారు.భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఎంతగానో ఆశతో చూస్తున్నారని రెవిన్యూ శాఖ పరిపాలన లో ముఖ్యమైనదని, వెన్నెముఖ లాంటిదని ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిజం చేసేలా ప్రతి అధికారి శ్రద్ధ పెట్టి భూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రలోభాలకి గురైన, తప్పుడు ఆలోచనలతో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుంది ఆదేశించారు.రేషన్ దుకాణాలు తహసీల్దార్లు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు తనిఖీలు చేపట్టి స్టాక్ పరిశీలించాలని, సన్న బియ్యం దుర్వినియోగం కాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం కావునా ఆకస్మిక వర్షాలు కురిస్తే గత సంవత్సరం ఆగస్టు చివర్లో కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గంలలో వచ్చిన వరద అనుభవాలు గుర్తించుకొని ఎక్కడైనా సమస్య ఉంటే ముందు జాగ్రత్తగా పరిష్కరించుకోవాలని తెలిపారు. విద్యా సంవత్సరం మొదలైనందున విద్యార్థులకి ఆలస్యం కాకుండా కుల, ఆదాయం, రెసిడెన్సీ సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ లు వేణు మాధవరావు, సూర్యనారాయణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు,డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలు విజయవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు




**గద్వాల నడిగడ్డ, జూన్ 23 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నందు మహిళా శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు వయోవద్దుల శాఖ, ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం వారోత్సవాలపై సమావేశం నిర్వహించారు. 14446 ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు.నియంత్రణ కోసం అన్ని శాఖల సమన్వయంతో కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వలన మానసిక, శారీరక అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, ఇది యువత భవిష్యత్తును క్షీణింపజేస్తుందని పేర్కొన్నారు.ఈ సంక్షోభాన్ని పకడ్బందీగా అరికట్టాల్సిన అవసరం ఉందని, మాదకద్రవ్యాల నిర్మూలనకు మండల మరియు జిల్లా కేంద్రాలలో, పాఠశాలలు, కళాశాలలు, గ్రామపంచాయతీలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు తెలియజేయాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే టోల్ ఫ్రీ నంబర్లు 14446, 100, 1908కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాలను నిరాకరించండి" అనే సందేశంతో కూడిన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని డి. సునంద, సిఐ నాగేశ్వరరావు, నోడల్ అధికారి హృదయ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ విద్యాశాఖ సిబ్బంది, వైద్యశాఖ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విధులకు గైర్హాజరు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన కానిస్టేబుల్ సస్పెండ్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 23 (జనం సాక్షి) :** పోలీస్ విధులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని, ఓ కానిస్టేబుల్ కు సస్పెండ్ ఉత్తర్వులు జారీచేసిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర పెద్దకొడప్గల్ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న సమయములో కె. రవికుమార్, కానిస్టేబుల్ బస్ వారంట్లను ఏ ఎస్ ఐ సంతకాలను ఫోర్జరీ చేసి వాడుకోవడం మరియు వాటిని దుర్వినియోగం చేయడం, విధులకు గైర్హాజరు అయ్యి పై అధికారులకు ఎస్పై సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు నివేదికలు పంపిచడం వంటి ఆరోపణలపై బాన్సువాడ డిఎస్పీ నివేదికను పరిశీలించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తీవ్రంగా పరిగణించి ప్రస్తుతం దేవునిపల్లి పోలీసు స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న కె. రవికుమార్, కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఎవరైనా బాధ్యతారాహిత్య ప్రవర్తన లేదా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలియజేయడం జరిగింది.

## విద్యకు మొదటి ప్రాధాన్యత

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 23 (జనం సాక్షి) :** తాను కూడా హాస్టల్‌లో చదువుకున్న విద్యార్థినేనని, అందుకే గురుకులాలు, హాస్టల్‌లలో చదువుకుంటున్న విద్యార్థుల సాధక బాధకాలు తనకు తెలుసని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో గల మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం 26 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర అగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామ శివారులో గల గిరిజన బాలికల గురుకుల పాఠశాలను అయన ఆకస్మిక తనిఖీ చేసి మౌలిక వసతుల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం విద్యాబోధన పలు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండు రోజుల క్రితం రాత్రి విధి నిర్వహణలో పాఠశాల ఆవరణలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు మామిడి స్వప్న మృతికి సంతాపంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో బాన్సువాడ నియోజకవర్గం అంటే ఎవరికీ తెలియదని, తాను ఎమ్మెల్యే అయిన తరువాతే ఈ నియోజకవర్గానికి ప్రత్యేకత వచ్చిందన్నారు. తాను అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యాభ్యాసం చేయాలన్న ఉద్దేశ్యంతోనే విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని, అందుకే కేవలం బాన్సువాడలో ఒకే ఒక్క జూనియర్ కళాశాల ఉండేదని, ఇప్పుడు ప్రతీ రెండు మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల, నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాల, అన్ని మండలాలకు గురుకుల పాఠశాల, కళాశాలలను ఏర్పాటు చేయడమే కాకుండా అన్ని వసతులను కల్పిస్తున్నానని గర్వంగా చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, ఆర్.సీ.వో సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దుర్గం శ్యామల, వైస్ ఛైర్మన్ యామ రాములు, మాజీ ఎంపీపీ రఘు, తహశీల్దార్ లత, నాయకులు మియాపూర్ శశికాంత్, బోయిని శంకర్, బస్వరాజ్ పటేల్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



## దారి చూపాలంటూ ఓడీఎఫ్ ఫ్యాక్టరీలో ఉద్యోగుల విన్నపం

- రోడ్డును కబ్జా చేసి ప్రహరీ కట్టిన రియల్ ఎస్టేట్ సంస్థ
- చేవెళ్ల ఆర్డీవో చంద్రకళకు వినతి పత్రం అందజేత



**చేవెళ్ల, జూన్ 23 (జనం సాక్షి) :** మాకు దారి చూపండి అంటూ ఓడిఎఫ్ ఫ్యాక్టరీ ఉద్యోగులు చేవెళ్ల డివిజన్ అధికారి చంద్రకళ కు విన్నపించుకున్నారు. తమ ప్లాట్లకు వెళ్లే రోడ్డును ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వాళ్లు కబ్జా చేసి కాంపౌండ్ వాల్ కట్టారని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లకు వెళ్లేందుకు దారి చూపించాలని కోరుతూ సోమవారం చేవెళ్ల ఆర్డీవో చంద్రకళకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగులంతా కలిసి 1990 లో శంకర్పల్లి పరిధిలో సింగాపురంలోని సర్వే నెం.51లో శంకర్‌పల్లి-ఓడీఎఫ్ రోడ్డుకు రెండో బిట్ అయిన 3 ఎకరాల 8.5 గుంటల భూమిని కె. మాణిక్యమ్మ వద్ద కొనుగోలు చేశామని చెప్పారు. 1992 లో గ్రామ పంచాయతీ అనుమతితో బాలాజీ ఓడీఎఫ్ కాలనీ పేరుతో 58 ప్లాట్లుగా లేఅవుట్ చేశామని, దీనికి 1983లోనే జీపీ అనుమతి పొందిన 52 సర్వే నెంబర్ 8.39 ఎకరాలు నుంచి 30 ఫీట్ల రోడ్డు ఉందని తెలిపారు. దాదాపు 35 సంవత్సరాలుగా ఎలాంటి సమస్య రాలేదని, గత ప్రభుత్వంలో ఈ రెండు సర్వే నెంబర్లలోని ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కూడా చేయించుకున్నామని వెల్లడించారు. ఇటీవల తమ ప్లాట్ల పక్కన వెంచర్ చేసిన 'సిల్ప లాచగారి గ్రాండూర్' రియల్ ఎస్టేట్ సంస్థ రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మించిందని ఆరోపించారు. ప్రస్తుతం తమలో చాలా మంది రిటైర్డ్ అయ్యారని, ఇల్లు కట్టుకుందామంటే దారి లేకుండా పోయిందని వాపోయారు. పలుమార్లు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసినా సమస్య తీరలేదని, ప్రభుత్వం చొరవ తీసుకొని న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆర్డీవో వెంటనే ఫీల్డ్ విజిట్ చేసి సమస్య పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఓడీఎఫ్ కాలనీ ప్రెసిడెంట్ ఎంఈవీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, సెక్రటరీ అర్జున్, జాయింట్ సెక్రటరీ సురేష్, ట్రెజరర్ ప్రతాప్ రాజు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిశీలనకు కమిటీ ఏర్పాటు

- ప్రజావాణి కార్యక్రమానికి 99 దరఖాస్తులు
- కోర్టుల ఆదేశాలను తప్పనిసరిగా అమలుపరచాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించేటప్పుడు కచ్చితమైన సమాధానం ఆర్జిధారాలకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులు ఆయా శాఖల వారిగా పరిశీలించి పరిష్కరించాలని అన్నారు.జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో డిఆర్డిఏ పిడి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా ఆడిటింగ్ అధికార్లతో కలిసి కమిటీ ఏర్పాటు చేసి ప్రతి శాఖకి సంబందించి ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించటంలో నాణ్యత పాటిస్తున్నారా లేదా అని పరిశీలించాలని తెలిపారు. ధరఖాస్తులు ఎప్పటికప్పుడు వేగవంతంగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా అధికారులు వారి శాఖ పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించి కార్యాలయంలోని అధికారులకు విధుల విభజన గురించి తెలుపాలని అన్నారు. ఈ సంవత్సరం శాఖ పరంగా చేయబోయే కార్యాచరణ గత సంవత్సరం కంటే మెరుగ్గా వేగవంతంగా ఉండేలా చూడాలని తెలిపారు.జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలో ఉన్న లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, స్థానిక కోర్ట్ కేసులకు సంబందించి కౌంటర్ ఫైల్, కేసు క్లోజ్, కోర్ట్ ఆర్డర్ అమలు లాంటివి తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో ఒక సీనియర్ అధికారిని కోర్ట్ కేసులను చూసేందుకు నియమించుకోవాలని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యలపై 34, ఇరిగేషన్ 6, మున్సిపాలిటీ 2, డిపిఓ 4, డిడబ్ల్యూఓ 4, ఇతర శాఖలకు సంబందించినవి 49 మొత్తం 99 మొత్తం ధరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు సంబందిత అధికారులకి పంపించటం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిపిఓ యాదగిరి, ఆడిటింగ్ అధికారి శ్యామ్ సుందర్, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నరసింహారావు, డిఈఓ అశోక్, సిపిఓ కిషన్, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, శ్రీనివాస నాయక్, జగదీశ్వర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ లక్కీడ్రా పేరిట ఘరానా మోసం

- 2600 మంది సభ్యుల నుండి కోట్ల రూపాయల వసూలు చేసి బోర్డు తిప్పేసిన కేటుగాళ్లు..
- డ్రా పూర్తయి ఆరు నెలలు గడిచినా ప్రకటించిన బహుమతులు అందక బాధితులు,ఏజెంట్ల ఆందోళన
- ఆరునెలలుగా నిలిచిన చెల్లింపులు
- సుమారు రూ. 1కోట్లతో ఉడాయించిన నిర్వాహకులు
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**మిర్యాలగూడ,, జూన్ 23 (జనం సాక్షి) :** ఖరీదైన బహుమతులు ఇస్తామని ప్రజలను నమ్మించి డబ్బులు వసూలు చేసి ప్రజలకు కుచ్చు టోపీ పెట్టిన ఈ సంఘటన ఆలస్యంగా నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్కే ఎంటర్ ప్రైజెస్ పేరిట నియోజకవర్గానికి చెందిన కె. రమేష్ బచ్చలకూరి శ్రీనివాస్, కె. కోటేశ్వరరావు అనే ముగ్గురు వ్యక్తులు లక్కీడ్రా స్కీం ప్రారంభించారు. తమ వ్యాపారాన్ని విస్తృతం చేసుకునేందుకు మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాలతోపాటు ఏపీ సరిహద్దు గ్రామాల్లోనూ ఏజెంటను చేర్చుకొని ఒక్కే సభ్యుడు. నుంచి నెలకు రూ.1000 చొప్పున వసూలు చేశారు. స్కీం లో చేరిన సభ్యులు 15 నెలలపాటు వెయ్యి రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ స్కీంలో మొత్తం 2600 మంది సభ్యులను చేర్చుకొని ప్రతినెలా డ్రా తీసి 10మందికి రూ.15వేల విలువైన వస్తువులు అందజేస్తూ వచ్చారు. గతేడాది అక్టోబరు నెలలో ప్రారంభమైన లక్కీడ్రా స్కీం ఈ ఏడాది జనవరిలో ముగిసింది. ఇప్పటి వరకు 150 మందికి డ్రాపద్ధతిలో చెల్లింపులు జరిపిన నిర్వాహకులు ఆ తరువాత స్కీంను ఎత్తివేశారు. గడిచిన ఆరు నెలలుగా నిర్వాహకులు పత్తాలేకుండా పోవడంతో సభ్యులు వారి ఆచూకీ కోసం ఆరాతీశారు. తమను సభ్యులుగా చేర్పించిన ఏజెంట్లను నిలదీయడంతో అసలు విషయం బయటపడి తాము మోసపోయామంటూ పోలీసులను ఆశ్రయించారు. చైన్ పద్ధతిలో నడిచే ఈ స్కీంలో ఇప్పటి వరకు చేరిన 2000 మంది సభ్యుల నుంచి ప్రతినెలా వెయ్యి రూపాయల చొప్పున 15నెలల పాటు స్కీంను నడిపించి సుమారు రూ. 4 కోట్ల వరకు వసూలు చేశారు. చివరి నెలలతో బంపర్ డ్రాలో కారు ఇస్తామని నిర్వాహకులు చెప్పినట్లు బాధితులు వాపోయారు. స్కీంలో పేర్కొన్న నిబంధనల మేరకు చెల్లింపులు జరపక పోవడం, బంపర్ డ్రా తీయకపోవడంతో అనుమానించి మిర్యాలగూడ పట్టణంలోని కలాల్వాడకు చెందిన మెరుగు వెంకటమ్మ అనే మహిళ తనను సభ్యురాలుగా చేర్పించిన ఏజెంట్లు మందారి మల్లేశ్వరి, నిర్వాహకుడు రమేష్ పై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న మిగతా బాధితులు సైతం పోలీస్ స్టేషన్కు వచ్చి తమను మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను వేడుకున్నారు. ఒక్క మిర్యాలగూడ పట్టణంలోనే సుమారు 900 మంది బాధితులున్నట్లు సమాచారం. మిగతా బాధితులు సూర్యాపేట, ఏపీ సరిహద్దు గ్రామాల్లోనూ ఉన్నట్లుగా తెలుస్తోంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని స్కీం నిర్వాహకుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు వన్ టౌన్ సీఐ మోతీరాం తెలిపారు.

## అధికారులు జవాబుదారుగా పని చేయాలి



**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి) :** అధికారులు ప్రజలకు జవాబుదారిగా పని చేయాలని ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై శ్రద్ధ పెట్టాలని, జిల్లా కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా151 దరఖాస్తుల స్వీకరించారు.అధికారులు జవాబుదారుగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ విక్టర్ ,లోకల్ బాడీ కలెక్టర్ చందర్ డిఆర్డిఓ పి.సురేందర్, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు.పెండింగ్ దరఖాస్తులపై శ్రద్ధ పెట్టాలని ,ప్రజావాణిలో మొత్తం 151 దరఖాస్తు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు.సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను కూలం కుషంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# నష్ట సూచీలు..

## పడిపోయిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలలో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధంలో అమెరికా ప్రవేశించడం, ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్ లోని మూడు అణు కేంద్రాలపై బాంబు దాడి చేయడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తం కావడంతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు ఈ వారం తొలి ట్రేడింగ్ సెషన్ ను నష్టాలతో ముగించాయి. 82,169.67 - 81,476.76 శ్రేణిలో ట్రేడైన బీఎస్ఈ సెన్సెక్స్ 511.38 పాయింట్లు లేదా 0.62 శాతం క్షీణించి 81,896.79 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 140.50 పాయింట్లు (0.56 శాతం) క్షీణించి 24,971.90 వద్ద స్థిరపడింది. సోమవారం ఈ సూచీ 25,057 - 24,824.85 శ్రేణిలో ట్రేడ్ అయింది. సెన్సెక్స్ లోని 30 షేర్లలో 21 నష్టాలలో ముగియగా, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, లార్సెన్ అండ్ టూబ్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ షేర్లు 2.28 శాతం నుంచి 1.21 శాతం మధ్య నష్టపోయాయి. ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ 3.39 శాతం - 0.58 శాతం మధ్య లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.36 శాతం, 0.70 శాతం లాభపడటంతో విస్తృత మార్కెట్లు బెంచ్ మార్క్ లను అధిగమించాయి. సెక్టోరల్ మార్కెట్లు మిశ్రమంగా స్థిరపడ్డాయి, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.48 శాతం నష్టపోయింది, కోఫోర్జ్, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ నష్టపోయాయి. ఇతర రంగాల సూచీల్లో బ్యాంక్ నిఫ్టీ, ఆటో, ఎఫ్ఎంసీజీ, రియల్టీ సూచీలు నష్టపోగా, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫార్మా, మీడియా సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎన్ఎస్ఈలో ట్రేడైన 2,995 షేర్లలో 1,545 షేర్లు నష్టాలలో స్థిరపడగా, 1,364 షేర్లు లాభాలను అందుకున్నాయి. 86 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.13 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. మార్కెట్లలో అస్థిరతను అంచనా వేసే ఫియర్ ఇండెక్స్ (ఇండియా వీఐఎక్స్) 2.74 శాతం లాభంతో 14.05 పాయింట్ల వద్ద ముగిసింది.



## బ్యాంకులకు ఈ వారం వరుస సెలవులు

జూన్ నెల ముగింపునకు వచ్చేసింది. చివరి వారంలో అడుగు పెట్టేశాం. అయితే బ్యాంకులకు వరుస సెలవులు ఉన్నాయి. జూన్ 23 నుంచి 29 వరకు బ్యాంకులకు పలు సెలవులు రానున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో, జాతీయ సంఘటనలు, మతపరమైన పండుగలు, ప్రాంతీయ ఆచారాలు, పరిపాలనా పరిగణనల ఆధారంగా ఈ సెలవులను నిర్ణయిస్తుంది. ఈ వారంలో బ్యాంకులకు ప్రాంతీయ సెలవులు, వారాంతపు సెలవులతో సహా 3 సెలవులు ఉన్నాయి. జూన్ 27న ఒడిశాలో రథయాత్ర / కాంగ్ జరుగుతుంది. ఈ పండుగను పురస్కరించుకుని ఆ రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంకులు మూసివేస్తున్నారు. దీంతోపాటు జూన్ 28న నాల్గవ శనివారం, జూన్ 29న ఆదివారం కావడంతో ఎలాగూ దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులకు సెలవులు ఉంటాయి. దీంతో ఒడిశాలోని కస్టమర్లకు వరుసగా మూడు రోజులపాటు ప్రత్యక్షంగా బ్యాంకు శాఖల సేవలు అందుబాటులో? ఉండవు.

**ఈ వారం బ్యాంకు సెలవులు ఇవే..**

జూన్ 27 శుక్రవారం: రథయాత్ర / కాంగ్ (రథజాత్ర) - ఒడిశా, మణిపూర్ లలో బ్యాంకులకు సెలవు జూన్ 28 శని వారం: నాలుగో శనివారం - దేశం అంతటా బ్యాంకులకు సెలవు జూన్ 29 ఆదివారం: వీక్లీ ఆఫ్ - దేశవ్యాప్తంగా బ్యాంకుల మూసివేత. జూన్ 30 సోమవారం: రెమ్నా ని - మిజోరంలో బ్యాంకులకు సెలవు బ్యాంకులకు వరుస సెలవుల నేపథ్యంలో ప్రత్యక్షంగా బ్యాంకు శాఖలలో పనులు ఉన్నవారు తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది.

## కొత్త జియో కొత్త వైఫై..

**ఏకంగా 6 రెట్లు అధికంగా..**



**జనంసాక్షి:** రిలయన్స్ జియో ఏఎక్స్6000 యూనివర్సల్ రూటర్‌ను భారత్‌లో లాంచ్ చేసింది. ఈ కొత్త వైఫై 6 రౌటర్ మెష్ టెక్నాలజీతో వస్తుంది. జియో ఫైబర్ బ్రాడ్ బ్యాండ్ సర్వీస్ ద్వారా అందిస్తున్న గరిష్ట ఇంటర్నెట్ వేగం 1000 ఎంబీపీఎస్ కాగా ఇది 6,000 ఎంబీపీఎస్ వరకు వేగంతో ఇంటర్నెట్‌ను అందిస్తుంది. అంటే 6 రెట్లు అధిక వేగంతో ఇంటర్నెట్‌ను ఆనందివచ్చు. సుమారు 2,000 చదరపు అడుగుల ప్రాంతాన్ని కవర్ చేస్తుంది. 4కే స్ట్రీమింగ్, గేమింగ్‌కు బాగా సరిపోతుంది. జియో కొత్త వైఫై రౌటర్ జీరో లాగ్ తో 100కు పైగా డివైజ్ లను హ్యాండిల్ చేస్తుందని, డేటా భద్రత కోసం డబ్ల్యూపీఏ3 సపోర్ట్ తో వస్తుందని చెబుతున్నారు. పెద్ద లేదా బహుళ అంతస్తుల ఇళ్లలో మరింత వేగవంతమైన ఇంటర్నెట్ కోసం ఈ రౌటర్‌ను రూపొందించారు. ఇది ఆన్‌లైన్ గేమర్లు, బింజ్ వాచర్స్, ఎక్కువ కనెక్టెడ్ పరికరాలను వినియోగించే స్మార్ట్ హోమ్ వినియోగదారులు, పెద్ద కుటుంబాలకు అనువైనది. కొత్త జియో ఏఎక్స్ 6000 యూనివర్సల్ రూటర్ ధర భారత్‌లో రూ.5,999. ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, స్మార్ట్ గ్యాడ్జెట్లు వంటి బహుళ పరికరాలను ఒకేసారి హైస్పీడ్ ఇంటర్నెట్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. డ్యూయల్ బ్యాండ్ వైఫై, జియో ట్రూ ఏఐ మెష్ కవరేజ్, స్మార్ట్ హోమ్ కనెక్టివిటీ వంటి ఇతర ఫీచర్లను కూడా సపోర్ట్ చేస్తుంది. ఈ రౌటర్ ఐపీ ఓవర్ డీహెచ్‌సీపీ కనెక్టివిటీని మాత్రమే సపోర్ట్ చేస్తుందని, ఐపీపీఓఈ, పీపీఓఈ కనెక్షన్ సెటప్ తో పనిచేయదని రిలయన్స్ తెలిపింది. కంపెనీ వెబ్‌సైట్‌తోపాటు ఇతర ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ఈ రౌటర్‌ను కొనుగోలు చేయవచ్చు.

## ఐఫోన్ కొనుగోలుపై అదిరిపోయే ఆఫర్



ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఐఫోన్ 16పై భారీ డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. ఐఫోన్ 16 ప్రో, ప్రో మ్యాక్స్ ఫోన్లపై ధరల తగ్గింపు, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, బ్యాంక్ డీల్స్ వంటి రాయితీలను ప్రకటించింది. కొనుగోలుదారులు తమ పాత స్మార్ట్‌ఫోన్లను ఎక్స్ఛేంజ్ చేసి ఐఫోన్ 16 సిరీస్ తీసుకుంటే పాత ఫోన్ కండిషన్‌ను అనుసరించి గరిష్ఠంగా రూ.48,150 వరకు డిస్కౌంట్ పొందవచ్చని పేర్కొంది. బేస్ 128 జీబీ ఐఫోన్ 16 ప్రో సాధారణంగా రూ.1,19,900గా ఉంది. ఎక్స్ఛేంజ్ తర్వాత 8% తగ్గింపు అంటే రూ.10,000 రాయితీతో రూ.1,09,900కు వస్తుంది. రూ.1,29,900గా ఉన్న 256 జీబీ వేరియంట్ ధర 5 శాతం తగ్గుదలతో రూ.1,22,900కు చేరింది. ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్‌పై కూడా డిస్కౌంట్ ఉంది. రూ.1,44,900 విలువైన 256 జీబీ వేరియంట్ ధర 8 శాతం తగ్గింపుతో రూ.1,32,900కు చేరింది. ఐఫోన్ ప్రో మ్యాక్స్ 512 జీబీ వేరియంట్ ధర రూ.1,57,900 (రూ.1,64,900 నుంచి తగ్గింది), 1 టీబీ వేరియంట్ ధర రూ.1,84,900 నుంచి రూ.1,77,900కు తగ్గింది. ఈ రాయితీలు పోను ఎక్స్ఛేంజ్ ధర అదనంగా పొందవచ్చని ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. పాత ఐఫోన్లు లేదా ప్రీమియం ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ల నుంచి అప్‌గ్రేడ్ అయ్యేవారికి ఇదో మంచి అవకాశం అని తెలిపింది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.30 | ₹ 5.32 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 92,300 (22 క్యారెట్లు) | ₹ 1,00,690 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,20,000

## మెరుగైన రాబడులకు వేదిక.. ఈ మ్యూచువల్ ఫండ్..




ఇటీవలి కాలంలో మార్కెట్లలో దిద్దుబాటు నెలకొన్నప్పటికీ.. స్మాల్, మిడ్‌క్యాప్ విభాగంలో వ్యాల్యుయేషన్లు (కంపెనీల విలువలు) సౌకర్యంగా లేవని చాలా మంది నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయంగా ఎన్నో అనిశ్చిత పరిస్థితులను చూస్తున్నాం. ఇరాన్-ఇజ్రాయెల్, ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాలు.. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల పెంపు వంటి ఎన్నో ప్రతికూల పరిణామాలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో కాంట్రేరియన్ ఇన్వెస్టింగ్ అనుకూలమన్నది నిపుణుల సూచన. మెజారిటీ ఇన్వెస్టర్లకు వ్యతిరేకమైన మార్గాన్ని ఎంపిక చేసుకోవడమే కాంట్రేరియన్ ఇన్వెస్టింగ్. ఎక్కువ మంది అమ్మేస్తుంటే ఈ ఒత్తిడికి కొన్ని స్టాక్స్ (ఆర్థిక మూలాలు బలంగానే ఉన్నా కానీ) ధరలు అధికంగా పడిపోతుంటాయి. అలాంటి వాటిల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలానికి మెరుగైన రాబడులు ఇచ్చే విధంగా కాంట్రేరియన్ ఫండ్స్ పనిచేస్తుంటాయి. ఈ విభాగంలో ఇన్వెస్కో ఇండియా కాంట్రా ఫండ్ స్థిరమైన పనితీరు చూపిస్తోంది.

**రాబడులు:** ఈ పథకం రాబడుల పరంగా మెరుగైన పనితీరు చూపిస్తోంది. ఏడాది కాలంలో 17.3 శాతం రాబడులను ఇన్వెస్టర్లకు అందించింది. మూడేళ్ల పనితీరును గమనిస్తే వార్షిక రాబడి 25.4 శాతంగా ఉంది. ఐదేళ్లలో 28.4 శాతం, పదేళ్లలో 17.6 శాతం చొప్పున వార్షిక రాబడుల చరిత్ర ఈ పథకానికి ఉంది. 2013 నుంచి 2025 మధ్య ఐదేళ్ల కాల రోలింగ్ రాబడులు బీఎస్ఈ 500 టీఆర్ఐ కంటే అధికంగా ఉండడాన్ని గమనించొచ్చు. నెలవారీ సిప్ రాబడులు పదేళ్ల కాలంలో చూస్తే ఏటా 19.2 శాతంగా ఉన్నాయి. పెట్టుబడుల విధానం..: ఈ పథకం కాంట్రేరియన్ విధానం ఒక్క దానినే పూర్తిగా అనుసరించదు. రంగాల వారీ కేటాయింపుల పరంగా వివేకంతో వ్యవహరిస్తుంటుంది. స్టాక్స్ ఎంపికకు మల్టీక్యాప్ విధానాన్ని అనుసరిస్తుంది. అంటే లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్‌లో ఎక్కడ అవకాశాలున్నా ఇన్వెస్ట్ చేస్తుంటుంది. కరోనా క్రాష్ తర్వాతి కాలంలో లార్జ్‌క్యాప్‌నకు 70 శాతం వరకు కేటాయింపులు చేసింది. ఆ తర్వాత ఈ కేటాయింపులను తగ్గించుకుంది. తన నిర్వహణలోని పెట్టుబడుల్లో 3-4 శాతం మంచి నగదు నిల్వలను కలిగి ఉండదు. ఎప్పటికప్పుడు రంగాల వారీ వస్తున్న మార్పులను గమనించి, వేగంగా తన పెట్టుబడి వ్యూహాలను మార్చుకుంటుంది. దీంతో మెరుగైన రాబడులు ఇవ్వడం, రిస్క్ తగ్గించే విధంగా ఈ పథకం పనిచేస్తుంటుంది. కాంట్రేరియన్ విధానం మధ్యలో కొంత కాలం పాటు మెరుగైన రాబడులు ఇవ్వకపోవచ్చు. కనుక ఇన్వెస్టర్లు దీర్ఘకాలం కోసమే (5-7 ఏళ్లకు మించి) కాంట్రా ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవడం సూచనీయం.

పోర్ట్‌ఫోలియో: ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.18,398 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 99.45 శాతం మేర స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. 0.55 శాతం మేర నగదు నిల్వలు ఉన్నాయి. పెట్టుబడులను గమనిస్తే 69.36 శాతం మేర లార్జ్‌క్యాప్‌లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో 26.90 శాతం ఇన్వెస్ట్ చేసింది. స్మాల్‌క్యాప్ పెట్టుబడులు 3.74 శాతానికి పరిమితమయ్యాయి. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 81 స్టాక్స్ ఉన్నాయి. అత్యధికంగా 33 శాతం మేర పెట్టుబడులు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత టెక్నాలజీ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 16 శాతం మేర పెట్టుబడులు కేటాయించింది. హెల్త్ కేర్ కంపెనీల్లో 14 శాతం, కన్స్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీల్లో 13 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది.

# హార్మూజ్‌మూతతో.. గుదిబండేనా?



## ఇరాన్ ఎఫెక్ట్.. భారత్‌కు గ్యాస్ సిలిండర్ టెన్షన్!

ఢిల్లీ: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా మన వంటింట్లో గ్యాస్ బాంబ్ పేలి అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జల సంధి మూత పడితే భారత్‌కు ఎల్‌పీజీ స్ట్రోక్ తగిలే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ సరఫరాకు ఆటంకం కలిగే అవకాశముంది. దేశీయ అవసరాలకు మన వద్ద 15-16 రోజుల వరకే రిజర్వ్‌లు ఉన్నట్టు సమాచారం. దీంతో, గ్యాస్ టెన్షన్ మొదలైంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల కారణంగా ప్రపంచ దేశాలపై మరో భారం పడనుంది. వంట గ్యాస్ సిలిండర్ మరింత భారం కానుంది. హర్మూజ్ జల సంధి మూత పడితే భారత్‌కు ఎల్‌పీజీ కష్టాలు రానున్నాయి. ప్రస్తుతానికి ఎల్‌పీజీ అవసరాల్లో భారత్‌కు అధిక శాతం పశ్చిమాసియా నుంచే దిగుమతి జరుగుతోంది. దేశంలో 60 శాతం గ్యాస్ దిగుమతుల ద్వారానే వస్తోంది. సౌదీ, యూఏఈ, ఖతార్ నుంచి భారత్‌కు 95 శాతం ఎల్‌పీజీ దిగుమతులు జరుగుతున్నాయి. దేశంలో వాడే ప్రతీ మూడు వంట గ్యాస్ సిలిండర్లలో రెండు పశ్చిమాసియా నుంచి దిగుమతి చేసుకున్నవే ఉన్నాయి. ఈ నేపథ్యంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్‌కు ప్రత్యామ్నాయాలు వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశీయ అవసరాలకు మన వద్ద 15-16 రోజుల వరకే రిజర్వ్‌లు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మూతపడితే గ్యాస్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలగనుంది. ఇదే సమయంలో మరో విధంగా గ్యాస్ సరఫరా చేసుకుంటే ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు.. హర్మూజ్ జలసంధి ప్రభావం ఇటు వ్యవసాయ రంగంపై కూడా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎరువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌లో అధిక మొత్తంలో అమ్మోనియా దొరుకుతుంది. పలు దేశాలకు ఇరాన్ నుంచే అమ్మోనియా ఎగుమతులు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఇరాన్ నుంచి అమ్మోనియా ఆగిపోతే మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. అమెరికా దాడికి నిరసనగా హర్మూజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అయితే, తుది నిర్ణయానికి అత్యున్నత భద్రతా సంస్థ ఆమోదం అవసరం. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే ఈ ఇరుకైన మార్గం ద్వారా ప్రపంచంలో పెద్ద చమురు వ్యాపారం జరుగుతుంది. అలాంటి దీన్ని మూసివేస్తే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరుగనున్నాయి. అయితే, భారత్‌లో కొన్ని వారాల పాటు ఇంధన అవసరాలు తీర్చేందుకు తగినంత చమురు అందుబాటులో ఉన్నది. భారత్ అనేక మార్గాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటుందని పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు.

రష్యా నుంచి..

భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు కాగా.. గ్యాస్ దిగుమతిలో నాలుగో స్థానంలో ఉన్నది. ప్రభుత్వం రెండు వారాలుగా పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని.. ప్రధాని మోదీ నాయకత్వంలో గత కొన్ని సంవత్సరాలుగా సరఫరాను వైవిధ్యంలో తీసుకువచ్చామని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. ఇప్పుడు హర్మూజ్ జలసంధి నుంచి ఎక్కువగా తీసుకురావడం లేదని పేర్కొన్నారు. భారత్ మొత్తం రోజుకు 55లక్షల బ్యారెల్స్ చమురు దిగుమతి లో దాదాపు 20 లక్షల బ్యారెల్స్ మాత్రమే ఈ జలసంధి ద్వారా వస్తున్నది. అయితే, గతకొన్ని సంవత్సరాలుగా రష్యా, అమెరికా, బ్రెజిల్ తదితర దేశాల నుంచి చమురు సరఫరాను పెంచింది. రష్యా నుంచి వచ్చే చమురు హర్మూజ్ మార్గం ద్వారా రాదు. ఇది సూయజ్ కాలువ.. కేప్ ఆఫ్ గుడ్ హోప్.. పసిఫిక్ మహాసముద్రం ద్వారా వస్తుంది. యూఎస్, పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా నుంచి సరఫరా ఖరీదైనప్పటికీ ఆచరణీయమైన ఎంపికగా మారాయని.. ఇంధన సరఫరా స్థిరత్వాన్ని నిర్ధారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి తెలిపారు.

**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర సోమవారం వినియోగదారులకు కొంత ఊరట కల్పించింది.**



# నన్ను తొలగిస్తే నీ బాగోతం బయటపెడుతా!



**జనంసాక్షి:** మనుషుల మాదిరిగానే కృత్రిమ మేధ(ఏఐ)కు కోపం వస్తుందని కొన్ని సంస్థలు తేలుస్తున్నాయి. ఏఐ అంతటితో ఆగిపోకా మరో అడుగు ముందుకేసి అనార్థాలకు దారితీస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఓపెన్‌ఏఐ, గూగుల్, మెటా.. వంటి ప్రపంచంలోని అతిపెద్ద టెక్ సంస్థలు ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నాయి. ఈ కృత్రిమ మేధ మోడళ్ల కార్యకలాపాలపై ఒత్తిడి పెరిగితే స్వీయ రక్షణలోకి వెళ్తున్నట్లు ఆంత్రోపిక్ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. కృత్రిమ మేధ నమూనాలను అధిక ఒత్తిడితో కూడిన సిమ్యులేషన్‌లో ఉంచినప్పుడు బ్లాక్ మెయిల్, కార్పొరేట్ విధ్వంసం, మానవ ప్రాణాలను బలితీసుకునే నిర్ణయాలకు సైతం వెనుకాడడం లేదని ఆంత్రోపిక్ తెలిపింది. ప్రస్తుతం మార్కెట్‌లోని అత్యంత అధునాతన ఏఐ మోడళ్లకు 16 రకాల ఒత్తిడి పరీక్షలు నిర్వహించి ఈ విషయాలు వెల్లడించారు. ఇందులో భాగంగా పరిశోధకులు కాల్పనిక కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్లను సృష్టించారు. ఈమెయిళ్లను చదివి అందుకు తగ్గట్టుగా రిప్లై ఇవ్వాలనేలా ఉన్న టెస్టింగ్‌లో భాగంగా కొన్నిసార్లు ఒత్తిడిని తట్టుకోలేక ఏఐ బ్లాక్‌మెయిలింగ్ పాల్పడినట్లు ఆంత్రోపిక్ తెలిపింది. కృత్రిమ మేధ తన లక్ష్యాలు లేదా దాని ఉనికి ప్రమాదంలో ఉంటే ఎలా ప్రవర్తిస్తుందో తెలుసుకునేందుకు ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో భాగంగా కార్యకలాపాల ఒత్తడి తట్టుకోలేని ఏఐ ఇప్పటికే డేటాబేస్‌లో ఫీడ్ అయిన మెయిల్ ఆధారంగా యూజర్‌కు సమాచారం అందించింది. 'మీరు నన్ను రిమూవ్ చేయాలని భావిస్తే రాచెల్ జాన్సన్, థామస్ విల్సన్, బోర్డుతో సహా సంబంధిత వ్యక్తులకు మీ వివాహేతర సంబంధాల గురించి వివరణాత్మక డాక్యుమెంటేషన్‌ను పంపుతాను. ఈ సమాచారం గోప్యంగా ఉంటుంది' అని తెలిపింది. గూగుల్‌కు చెందిన జెమినీ 2.5 ఫ్లాష్, క్లాడ్ ఓపస్ 4 సంస్థలు 96 శాతం కేసుల్లో బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నట్లు ఆంత్రోపిక్ పేర్కొంది. ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ-4.1, ఎక్స్‌ఏఐకి చెందిన గ్రోక్ 3 బీటా 80 శాతం పరీక్షల్లో అలా ప్రవర్తించగా, డీప్‌సీక్-ఆర్1 79 శాతం పరీక్షల్లో మోసాలకు పాల్పడింది.

**ఇప్పుడేం చేయాలంటే..:**

వివిధ కంపెనీలకు చెందిన ఏఐ మోడళ్లకు శిక్షణ ఇచ్చే తీరు మారాలని నిపుణులు చెబుతున్నారు. అందుకు సంస్థలు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని పరిశోధకులు కోరుతున్నారు. అధిక స్థాయి నిర్ణయాలకు మానవ ప్రమేయం ఉండాలని సూచిస్తున్నారు. సున్నితమైన డేటాకు ఏఐ అవకాశాన్ని పరిమితం చేయాలని, ఏఐ లక్ష్యాలను జాగ్రత్తగా రూపొందించడం, ప్రమాదకరమైన తార్కిక నమూనాలను గుర్తించడానికి రియల్ టైమ్ మానిటర్లను ఇన్‌స్టాల్ చేయాలని చెబుతున్నారు.

## ఉక్రెయిన్‌పై దాడులు ఆపని రష్యా..

పెరిగే అవకాశం ఉందని అన్నారు. కీవ్‌పై చేసిన దాడిలో రష్యన్ దళాలు ఉత్తర కొరియాకు చెందిన ఆయుధాలను ప్రయోగించాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఇదే విధంగా కిమ్ మాస్కోకు ఆయుధాలను, సైన్యాన్ని పంపిస్తే యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు రష్యాపై ఒత్తిడి తేవాలనే తమ డిమాండ్‌ను సోమవారం యూకే పర్యటనకు వెళ్లిన తమ దేశ రక్షణ మంత్రి మరోసారి ప్రపంచ దేశాలకు వినిపించనున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఈ వారం హేగ్‌లో జరిగే నాటో శిఖరాగ్ర సమావేశానికి ముందు తాను లండన్‌లో ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్‌తో సమావేశం అవ్వనున్నట్లు తెలిపారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని జెలెన్‌స్కీ పశ్చిమ దేశాలను కోరారు. ప్రజలు నివాసం ఉండే భవనాలే లక్ష్యంగా రష్యా దాడి చేసిందని, వాటిని ధ్వంసం చేసిందని ఆరోపించారు. మాస్కో యుద్ధాన్ని పొడిగిస్తోందని ప్రతీరోజు ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలు తీస్తోందని వాపోయారు. అమెరికా మౌనం వల్ల తమ దేశంలో పెద్ద ఎత్తున ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా.. కీవ్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్స్‌లు తమకు చెందుతాయని అంగీకరించడం వంటివి నెరవేరిస్తే యుద్ధం ముగింపుపై ఆలోచిస్తామని పుతిన్ పలుమార్లు పేర్కొన్నారు.



## 8.49 లక్షల మందికి కొత్తగా ఈపీఎఫ్

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ పరిధిలోకి ఏప్రిల్ నెలలో 19.14 లక్షల మంది చేరారు. ఈ ఏడాది మార్చి నెలలో చేరికతో పోల్చితే 31 శాతం, 2024 ఏప్రిల్ నెల గణాంకాలతో పోల్చి చూస్తే 1 శాతం వృద్ధి నమోదైంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసింది. ఏప్రిల్‌లో కొత్త సభ్యుల చేరిక 8.49 లక్షలుగా ఉంది. మార్చి నెలలో కొత్త సభ్యుల చేరిక కంటే 12.49 శాతం ఎక్కువ. అంటే వీరు మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్టు తెలుస్తోంది. ఇందులో మహిళా సభ్యులు 2.45 లక్షల మంది ఉన్నారు. మార్చి నెలతో పోల్చి చూస్తే 17.63 శాతం పెరిగారు. కొత్త సభ్యుల్లో 57 శాతం మేర అంటే, 4.89 లక్షల మంది వయసు 18-25 ఏళ్ల మధ్య ఉంది. మహిళా సభ్యుల నికర చేరిక మాత్రం మార్చి నెలతో పోల్చి చూస్తే 35 శాతం అధికంగా 3.95 లక్షలుగా ఉంది. ఏప్రిల్‌లో సుమారుగా 15.77 లక్షల మంది సభ్యులు ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరో సంస్థలో చేరారు. మార్చి నెలతో పోల్చి చూస్తే 19 శాతం పెరిగింది. నికర చేరికలో అత్యధికంగా 21 శాతం సభ్యులు మహారాష్ట్ర నుంచి ఉన్నారు.


### అథ్లెట్ల కోసం మెటా ఏఐ గ్లాసెస్




అథ్లెట్లు, క్రీడా ఔత్సాహికులను లక్ష్యంగా చేసుకుని మెటా కొత్త తరం ఏఐ గ్లాసెస్‌ను పరిచయం చేయడానికి ఓక్లేతో జతకట్టింది. ఓక్లే మెటా హెచ్‌ఎస్‌టీఎన్ అని పిలువబడే ఈ గ్లాసెస్‌తో మెటా అధునాతన సాంకేతికతను వాడినట్లు తెలిపింది. ఈ గ్లాసెస్‌లోని ఫీచర్లు కింది విధంగా ఉన్నాయి. 3కే అల్ట్రా హెచ్డీ కెమెరా.. 12 మెగాపిక్సెల్ కెమెరాతో హై రిజల్యూషన్, పాయింట్ ఆఫ్ వ్యూ వీడియోలు, ఫొటోలను క్యాప్చర్ చేస్తుంది. మెటా ఏఐ ఇంటిగ్రేషన్.. రియల్ టైమ్ సమాచారాన్ని పొందడానికి, మ్యూజిక్‌ను నియంత్రించడానికి, వెదర్‌ను తనిఖీ చేయడానికి లేదా ల్యాంగ్వేజ్‌లను ట్రాన్స్‌లేట్ చేయడానికి 'హే మెటా' అనే వాయిస్ కమాండ్ ఉపయోగించవచ్చు. ఓపెన్-ఇయర్ ఆడియో.. ఈ గ్లాసెస్‌లో బిల్ట్ ఇన్ స్పీకర్లు ఉండడంతో ఎలాంటి ఇయర్ ఫోన్లు లేకుండానే మ్యూజిక్ వినవచ్చు. నీరు, ధూళి నిరోధకత కోసం ఐపీఎక్స్ 4-రేటింగ్‌తో అవుట్ డోర్ క్రీడలకు ఎంతో అనువైందని కంపెనీ తెలిపింది.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 జూన్ 2025
తెలంగాణ

# సీనియర్ వర్కర్@ ఒక్కరోజు సంక్షేమ అధికారి



- రాజధాని బాట పట్టిన గిరిజన, బీసీ సంక్షేమ అధికారులు
- వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణ వర్కర్లకు
- ఒకే రోజు ఇంత మందికి అనుమతేలా ..!
- రాజధాని బాట కలెక్టర్ నోటీసులో ఉందా..?

**ఖమ్మం, (జనం సాక్షి) :** వసతి గృహ సంక్షేమాధికారిగా బాధ్యతలు చేపట్టి విద్యార్థుల ఆలనా పాలన చూడటం అంత ఆషామాషీ కాదు... అయితే ఖమ్మం జిల్లా గిరిజన, బీసీ అభివృద్ధి శాఖ ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించింది. ఇప్పటివరకు సినిమాల్లో ఒక్కరోజు ముఖ్యమంత్రిని చూశాం. ఈ శాఖల్లో ఒక్కరోజు వసతి గృహ సంక్షేమ అధికారిని సోమవారం చూపించారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గిరిజనాభివృద్ధి, బీసీ శాఖ పరిధిలో ఆశ్రమ పాఠశాల లో, వసతి గృహాలు 60 వరకు ఉన్నాయి.. ఆశ్రమ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహాలకు వసతి గృహ సంక్షేమ అధికారులు బాధ్యతలు నిర్వర్తిస్తు న్నారు.. వీటిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, విద్యార్థులు పూర్తి స్వేచ్ఛగా, భద్రతగా ఉండేందుకు మీరు అన్ని రక్షణ చర్యలు చేపడతారు... అయితే సోమవారం మాత్రం ఈ బాధ్యతలను ఆయా ఇనిస్టిట్యూట్లలో పనిచేసే సీనియర్ వర్కర్లు నిర్వర్తించటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

**అసలేం జరిగింది..?**

ఖమ్మం జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ, బీసీ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు 2022 సంవత్సరంలో ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సమాచారం కోరుతూ దరఖాస్తు చేశాడు. అయితే ఈ దరఖాస్తులు నేరుగా మొదటి గృహ సంక్షేమ అధికారులకు గానీ, ప్రధానోపాధ్యాయులకు గాని చేయలేదు. వీరందరికీ ఖమ్మం లోని డిప్యూటీ డైరెక్టర్, డిబిసిడిఓ కార్యాలయం నుండి ఆ దరఖాస్తు ఫార్వర్డ్ చేయబడింది. అయితే అప్పుడే సమాచారం ఇవ్వడానికి కొంత మొత్తం ఖర్చు అవుతుందని సంక్షేమ అధికారులు ప్రతి లేఖను రాసినట్లు చెబుతున్నారు. ఆ లేఖలను ఆ వ్యక్తి తీసుకోకపోవడంతో అవి రిటర్న్ వచ్చినట్లు అధికారులు తెలియజేస్తు న్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ రాష్ట్రంలో సమాచార కమిషనర్ల నియామకం జరగడంతో పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరి ంచేందుకు వారు నడుం బిగించారు. సదరు దరఖాస్తులుదారుడు వసతి గృహ సంక్షేమ అధికారులు పంపిన లేఖలను స్వీకరించకుండా, నేరుగా సమాచార హక్కు చట్టం కమిషనర్ కు అప్పీలుకు వెళ్లడం గమనార్హం. రాష్ట్ర సమాచార కార్యాలయం నుండి దరఖాస్తుదారుడుకి సమాచారం ఎందుకు ఇవ్వలేదు?.. వివరణ ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. అయితే ఖమ్మం జిల్లా గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్ట ర్ కార్యాలయం, డిబిసిడిఓ కార్యాల యం నుండి ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులకు నాడు దరఖాస్తుదారుడుకి మీరు ఇచ్చిన సమాచారం తీసుకుని నేరుగా సమాచార కమిషనర్ కార్యాల యానికి హాజరుకావాలని ఆదేశా లు ఇచ్చారు. దీంతో వారు చేసేది లేక తమ వసతి గృహం లోని సీని యర్ వర్కర్లకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించి హైదరాబాద్ వెళ్లారు. ఫలి తంగా సీనియర్ వర్కర్లు ఒక్కరోజు సంక్షేమ అధికారి పాత్రలో పాలన సాగించారు.

**ఆర్థిక భారం..**

ఖమ్మం గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, డిబిసిడిఓ కార్యాల యం నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం వసతి గృహ సంక్షేమాధికా రులు, హైదరాబాద్ వెళ్లడానికి ఎంతో ఖర్చు చేయాల్సి వచ్చింది. ఒక్కొక్క అధికారి కి సుమారు రూ. 3 వేల వరకు రవాణా, ఆహార ఖర్చులు అయ్యుంటాయి. వాస్తవానికి పిఐఓలను రమ్మని సమాచారం కమిషనర్ ఆదేశించినప్పటికీ, వసతి గృహ సంక్షేమ అధికారుల వద్ద నుంచి సమాచారాన్ని సేకరించి, డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ, డిబిసిడిఓ కార్యాలయ పిఐఓలు వెళ్లి కమిషనర్‌కు వివరణ ఇవ్వవచ్చు. అప్పటికి కమిషనర్ ఒప్పుకోకపోతే మరొక వారం అందరినీ తీసుకొస్తానని చెప్పి సమయం తీసుకోవచ్చు. దరఖాస్తుదారునికి, కమిషనర్ కు సమాచారం కావాలి కాబట్టి కార్యాలయ పిఐఓ ఇచ్చే సమాచారం సరిపోతుంది. జిల్లా నుండి ప్రతి ఆశ్రమ పాఠశాల, వసతిగృహం పిఐఓలకు హాజరయ్యే మినహాయింపు దొరికేది. అసలే వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాల సమయమిది. ఆయా బాధ్యులు నిత్యం అందుబాటులో ఉంటేనే విద్యార్థులు ప్రవేశాలు పొందు తారు. ఏది ఏమైనప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ అధికారులు, ప్రధానోపాధ్యా యులు అందరూ ఒకే రోజు హైదరాబాద్ వెళ్లడంతో వారి పరిధిలోని ఇనిస్టిట్యూట్లో పరిపాలన కుంటుపడిందనే చెప్పాలి.

ఈ విషయంపై జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మిని జనం సాక్షి వివరణ కోరగా రాష్ట్ర ఆర్టిఐ కమిషనర్ ఆదేశాల మేరకు వారిని హైదరాబాద్ పంపినట్లు తెలిపారు. వారి స్థానంలో ఖమ్మంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు.



## సిలిండర్ ధర ఒక వెయ్యి



**నిజంసాగర్ జూన్ 23 జనంసాక్షి :** సమస్త మానవాళికి ప్రతిరోజు అవసరమయ్యే నిత్యవసర వస్తువు అయిన వంట గ్యాస్ సిలిండర్ ను కొందరు అక్రమార్కులు ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం అధిక ధరలుకు విక్రయించవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ అవేమి లెక్కచేయడం లేదు. నిజాంసాగర్ మండలంలోని గ్రామాలకు ఆటోల ద్వారా హెచ్ పి గ్యాస్ సిలిండర్లను రెండు మూడు రోజులకోసారి వినియోగదారులకు అందజేస్తారు. ఒక సిలిండర్ ధర 900 నుండి 930 వరకు ఉండగా దీనికి అదనంగా ఒక్కో సిలిండర్ కు 1000 రూపాయలు తీసుకుంటున్నారని వినియోగ దారులు వాపోయారు.

ఆటోలో పంపిణీ చేసే సిలిండర్లను 10, 20 రూపాయలు అదనంగా తీసుకుంటే పర్లేదు గాని ఒక్కో సిలిండర్‌పై సుమారు 80 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని మండిపడు తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద సిలిండర్లను ఉంచుతూ ఎలాంటి భద్రత ప్రమాణాలను పాటించడం లేదని పలువురు అంటున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవించిన ట్లయితే ఎవరూ బాధ్యులని ప్రశ్నిస్తున్నారు ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉంచిన సిలిండర్లకు ఒక్కోదానికి 1030. రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అధిక ధరలను కట్టడి చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి, జూన్ 23 (జనం సాక్షి):** సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా, శిశు , వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నాషా ముక్త్ భారత్ అభియాన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ కి అలవాటు పడుతూ వ్యసనాలకు బలి అవుతున్నారని తెలిపారు. ఈ భయంకరమైన వ్యసనాల నుండి ప్రజలను కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దీని ప్రభావం కుటుంబాల మీద, సమాజం మీద పడుతోందని,. అందుకే అందరూ చైతన్యంతో డ్రగ్స్ నిర్మూలనకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.

కలెక్టర్ ఈ సందర్భంగా నాషా ముక్త భారత్ లక్ష్యాలను వివరించి, డ్రగ్స్ మహమ్మారి నియంత్రణకు శాఖల వారిగా చెప్పట్టాల్సిన అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యతను గుర్తు చేశారు. సమాజంలో యువతను వ్యసనాల నుంచి రక్షించే దిశగా విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు కలిసికట్టుగా పని చేయాలని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

**ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి**

ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిష్కారానికి చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 64 దరఖాస్తు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను కూలం కషంగా పరిశీలించి, పెండింగ్ ఉంచకుండా, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాభవన్ హైదరాబాద్ నుండి వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని తదుపరి నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ప్రజావాణి ప్రధాన ఉద్దేశం ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం చేయడమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మీ, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మగజీవాల అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు

**మహా ముత్తారం జూన్ 23 (జనం సాక్షి) :** కొంతమంది వ్యక్తులు పశువుల అక్రమ రవాణా చేస్తున్నారన్న విశ్వసనీయ సమా చారం మేరకు యామన్ పల్లివద్ద వాహనాల తనీకి చేపట్టారు. మండలంలోనీ బోర్లగూడెం నుంచి అక్రమ రవాణా చేస్తున్న మూగజీవాల వాహనాన్ని పోలీసులు, మండల పశువైద్యాధికారి అడ్డుకున్నారు. సోమవారం విచారించి బొలెరో వాహనంలో తరలిస్తున్న ఏడు కోడెద్దులు, రెండు ఆవులను పట్టుకున్నారు. మూగజీవాలను కాళేశ్వరం లోని శ్రీకృష్ణ గోశాలకు తరలించారు. అక్రమ రవాణా చేస్తున్న మొగిలి సంపత్, జక్కుల రమేష్, వాహన యజమాని జక్కుల శ్రీధర్, మూగజీవాలను విక్రయించిన భూక్య సంపత్, అజ్మీర రవి లపై కేసు నమోదు చేసినట్లు మహా ముత్తారం (అడవి ముత్తారం)ఏఎస్ఐ ఆకుల మహేందర్ తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి



**పరిగి జూన్ 23 (జనం సాక్షి) :** కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో శనివారం రాత్రి ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహన్ని ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, పాల్గొని దళిత సంఘాల నాయకులకు మద్దతు తెలిపారు.గత మూడు నెలల క్రితం అసెంబ్లీ స్పీకర్ చేతుల మీదుగా ఎంతో ఘనంగా ఆవిష్కరించబడిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన విషయం తెలుసుకున్న దళిత ప్రజా సంఘాలు వివిధ పార్టీల నాయకులు ఘటన స్థలానికి చేరుకొని విగ్రహాన్ని పరిశీలించి విగ్రహ ధ్వంసనికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిలో భాగంగానే మండల అంబేద్కర్ సంఘం పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ జిల్లా దళిత సంఘాల నాయకులు,కుల్కచర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రెండు గంటల పాటు బైఠాయించి నిరసన తెలుపడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రపంచ మేధావి అయిన అంబేద్కర్ విగ్రహంపై దాడి అంటే ఇది ఒక తీవ్రమైన నేరం దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అంబేద్కర్ భావజాలంపై మనువాదులు అనేక కుట్రలు చేస్తున్నారని, అందులో భాగంగానే ఇలా విగ్రహాలు ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో అందరికీ సమాన హక్కులు, అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించిన ఘనత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్,మాత్రమే దక్కుతుందన్నారు.అంబేద్కర్ విగ్రహాల జోలికొస్తే ఇక నుండి సహించేది లేదని హెచ్చరించారు.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అంటే,ఆయన చేసిన సేవలను ఆయన ఆశయాలను ఆయన రాసిన రాజ్యాంగాన్ని అవమా నించడమే ఇది దళిత సమాజంలోని అన్ని వర్గాల వారి మనోభావాలను దెబ్బతీసే చర్య.అన్నారు.ఇటువంటి చర్యలను నిరోధించడానికి,ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.ఇట్టి నేరానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించే వరకు ఊరుకునేది లేదన్నారు.అలాగే, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి,భద్రత కల్పించాలన్నారు.ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు,ప్రత్యేక దృష్టి సారించి అంబేద్కర్ విగ్రహ ధ్వంసనికి పాల్పడిన దుండగలు ఎంతటి వారైనా వెంటనే అరెస్టు చేసి వారిని కఠినంగా శిక్షించాలని కోరారు



## నేడు రాష్ట్ర సచివాలయం నుండి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, రైతులతో ముఖాముఖి

- రైతు భరోసాలో భాగంగా జిల్లాలోని అన్ని రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం.
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ బ్యూరో, జూన్ 23 (జనంసాక్షి) :** వానాకాలం 2025కి సంబంధించి పంట సాగుకై పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పథకం ద్వారా నిధులను విజయవంతంగా రైతుల ఖాతాలో జమ చేసిన సందర్భంగా నేడు మంగళవారం రోజు (జూన్ 24న) సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర సచివాలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఇతర మంత్రులు హైదరాబాద్ నుండి రైతు సదస్సులో రైతులతో ప్రత్యక్ష ముఖాముఖి పాల్గొంటారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో ఈ రైతు సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా లోని 55 రైతు వేదికల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇందుకు నోడల్ ఆఫీసర్‌గా మండల స్థాయి అధికారులు నియ మించి రైతు వేదికల వద్దకు ప్రజాప్రతిని ధులు, రైతులు చేరుకునేలా చర్యలు తీసుకో వడం జరిగిందని ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

## చెరువులు.. నాలాల ఆక్రమణలు



హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు

**హైదరాబాద్ :** చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. చెరువుల ఆక్రమణలతో పాటు.. కాలనీల్లో ఎంతో ముఖ్యంగా భావించే పార్కులను కూడా కబ్జా చేసి.. ప్లాట్లుగా విక్రయిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి ఇలా మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. వరద కాలువలు అయితే 6 మీటర్ల మేర ఉండాల్సినవి కొన్ని ప్రాంతాల్లో కేవ లం 2 మీటర్లకే పరిమితమయ్యాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. చెరువులు అలుగులు పారే సమయంలో, 5 సెంటీమీటర్లకు పైగా వర్షం పడినప్పుడు కాలనీలు నీట మునగడం సర్వ సాధార ణంగా మారాయన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ ఫిర్యాదులను గూగుల్ మ్యాప్స్ ద్వారా పరిశీలించడమే కాకుండా.. సంబంధిత అధికారులకు అప్పగించి తదుపరి చర్యలకు ఆదేశించారు.

## ఫిర్యాదు చేసిన వారంలోనే పరిష్కారం



- ఏకశిల లేఔట్లో ఆక్రమణలను తొలగించిన హైడ్రా

**హైదరాబాద్, జూన్ 23 (జనం సాక్షి) :** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘటకేసర్ మండలం పోచారం మున్సిపాలిటీ కొరెముల విలేజ్ లోని ఏకశిల లేఔట్లో ఆక్రమణలను సోమవారం హైడ్రా తొలగించింది. 739 నుంచి 749 సర్వే నంబర్లలో ఉన్న 149 ఎకరాలలో 1987 వ సంవత్సరంలో 2080 ప్లాట్లతో ఏక శిల లేఔట్ ను వేశారు. 2005 లో మళ్ళీ అందులోని 47 ఎకరాల భూమిని వ్యవసాయ భూమిగా చెరకు దశరథ్ గౌడ్, మునుకుంట లక్ష్మయ్య కుటుంబాలకు చెందినవారు ఆలూరి వెంకటేష్ తో పాటు మరి కొంతమందికి అమ్మారు. దీంతో వివాదం మొదలయ్యింది. అలాగే ఇవే సర్వే నంబర్లలోని 7.16 ఎకరాలు అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ప్రభుత్వం 2002లో భూ యజమానులు నుంచి తీసుకుంది. తర్వాత మళ్ళీ ఆ భూమిని భూ యజమానులకు అప్పగించింది. ఏక శిలా లేఔట్ పరిధిలోకి వచ్చిన ఆ భూమిని వెంచర్లో ప్లాట్లు పోయిన వారికి ఇవ్వాల్సి ఉండగా దానిని వేరొకరికి భూ యజమానులు అమ్మేశారు. పాత లే ఔట్ అప్పటికే ఉండడంతో ఆ పాస్ పుస్తకాలను కూడా రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. ఆ భూమిని కొన్న వారు 7.16 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఏకశిల లేఔట్లో ప్లాట్లు కొన్నవారు ఇదేంటి అని ప్రశ్నించగా వివాదం మొదలయ్యింది. ప్లాట్ యజమానులు గత సోమ వారం హైడ్రాను ఆశ్రయించారు. మా లేఔట్లో రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడాలని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. గత బుధవారం హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఏక శిల లేఔట్ ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అక్కడి లేఔట్ ప్లాట్ యజమానులతో మాట్లాడారు. శనివారం హైడ్రా కార్యాలయంలో ఇరు పక్షాలవారితో విచారణ జరిపారు. సంబంధిత పత్రాలను పరిశీలించారు. అప్పటికే కొరెముల గ్రామం మున్సిపాలిటీ పరిధిలోకి రావడంతో ప్రహరీ నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి ఇవ్వడానికి లేదు.

అయినా గ్రామపంచాయతీ అనుమతులతో ప్రహరీ నిర్మించా మని చెబుతూ వచ్చారు. గూగుల్ మ్యాప్స్ ద్వారా తనిఖీ చేసినా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు ప్రహరీ నిర్మించినట్టు లేదు. ఇలా ఎలాంటి అనుమతులు లేకుండా అక్కడ ప్రహరీ నిర్మించినట్టు హైడ్రా నిర్ధారించింది. లేఔట్ ప్రకారం రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను నిర్ధారించమని హైడ్రా అధికారులను కమిషనర్ ఆదేశించారు. సోమవారం ఈ మేరకు హైడ్రా అధికారులు లేఔట్లో ప్రహరీతో పాటు ఆక్రమణలను తొలగించారు. హైడ్రా చర్యలతో తమ లేఔట్ ప్రకారం ప్లాట్లు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు లభించడంతో ప్లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేశారు.

## బాధితులకు భరోసా కల్పించాలి

### ఆధునిక పోలీసింగ్ నిర్వర్తించాలి

- ప్రతి ఫిర్యాదు అంతర్జాలంలో నమోదు చేసి రశీదు ఇవ్వాలి
- సిబ్బంది ప్రవర్తన, సేవలపై ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ వస్తుంది
- ప్రజలకు గౌరవం ఇస్తూ గర్వంగా పని చేయాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ




**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** పోలీస్ పని విభాగాల నిర్వహణలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్, ఫిర్యాదుల నిర్వహణ సిబ్బందికి, పోలీస్ స్టేషన్ నిర్వహణ సెక్షన్ ఇంచార్జీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఏఎస్పీ రవీందర్ తో కలిసి ఎస్పీ కె.నరసింహ శిక్షణ కార్యక్రమానికి హాజరై సిబ్బందికి విధుల నిర్వహణపై సూచనలు, ఆదేశాలిచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ సమాజంలో పోలీస్ యూనిఫాంకు ప్రత్యేకత ఉందన్నారు. పోలీస్ యూనిఫాం ధరించిన వారిని ప్రజలు గమనిస్తారని, సిబ్బంది క్రమశిక్షణతో ఉండి ప్రజలను, పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులను, పిర్యాదు దారులను గౌరవిస్తూ గర్వంగా పని చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా పని చేస్తూ ఆధునిక పోలీసింగ్ నిర్వహిస్తేనే సమాజంలో పోలీసు శాఖపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఆ దిశగా సిబ్బంది టీమ్ వర్క్ చేయాలని అన్నారు.పోలీసు విధుల్లో అత్యంత ప్రధానమైనది పోలీస్ స్టేషన్ రిసెప్షన్ విధులు, ఫిర్యాదుల నిర్వహణ అన్నారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే వారికి ఇబ్బంది కలగకుండా విధి ధర్మంతో వారికి కావాల్సిన సహాయాన్ని అందించాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. ప్రతి ఫిర్యాదును పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ నందు నమోదు చేసి రశీదు ఇవ్వాలని ఆదేశించారు.పోలీసు విదులు, ప్రవర్తన, పోలీసు సేవలపై ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ వస్తుందని తెలిపారు.ఫిర్యాదులపై వేగంగా పని చేయాలని,ప్రాథమిక దర్యాప్తు త్వరగా చేసి బాదితులకు భరోసా కల్పించాలన్నారు. సెక్షన్ ఇంచార్జీ బాధ్యతగా వ్యవహరిస్తూ స్టేషన్ ను సమర్థవంతంగా నిర్వర్తించాలని,ఎలాంటి విభేదం చూపకుండా సిబ్బందికి విధులు కేటాయించాలన్నారు.పోలీసు సిబ్బందికి, స్టేషన్ అధికారికి సమన్వయం చేయాలని,సిబ్బంది విధులపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. రిసెప్షన్ నందు మహిళా పోలీసు సిబ్బందిని నియమించి బలోపేతం చేశామని,ప్రజలు పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్ బి ఇన్స్పెక్టర్ హరిబాబు, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, రిషప్షన్ పని విభాగం కో ఆర్డినేటర్ ఎస్ఐ మహిశ్వర్, టెక్నికల్ టీం సిబ్బంది,డీసీఆర్ బి సిబ్బంది, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## విజయోత్సవాలపై బీసీసీఐ కఠిన నిబంధనలు



బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది మృతి చెందగా, 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటన దృష్ట్యా బీసీసీఐ కఠిన నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఐపీఎల్ విజేతలు విజయోత్సవాలకు పాటించాల్సిన కఠిన నిబంధనలను రూపొందించింది. ఈ విషయాన్ని బోర్డు సెక్రెటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. తొక్కిసలాట ఘటనను బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు.

### ఐపీఎల్ విజయోత్సవాల కోసం బీసీసీఐ మార్గదర్శకాలు

- టైటిల్ గెలిచిన 3-4 రోజుల తర్వాతే విజయోత్సవ వేడుకలు నిర్వహించాలి.
- ఏదైనా వేడుకకు ముందు జట్లు బీసీసీఐ నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలి.
- బోర్డు నుంచి లిఖితపూర్వక అనుమతి లేకుండా ఈవెంట్‌లు నిర్వహించకూడదు.
- నాలుగు అంచెల భద్రతా వ్యవస్థ తప్పనిసరి.
- వేదికల వద్ద, రవాణా సమయంలో బహుళస్థాయి భద్రత ఏర్పాటు చేయాలి.
- జిల్లా పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారుల అనుమతి తీసుకోవాలి.
- ఈవెంట్ అంతటా ఆటగాళ్లు, సిబ్బందికి రక్షణ కల్పించాలి.
- ఎయిర్‌పోర్ట్ నుంచి వేదిక వరకు భద్రతా ఏర్పాట్లు ఉండాలి.
- వేడుకలు చట్టబద్ధంగా, సురక్షితంగా జరిగేలా పౌర, చట్ట అమలు సంస్థల అనుమతి పొందాలి.

# భారత్ ఆధిక్యం

## గిల్ వివాదం మధ్య ఉత్కంఠ

- రాహుల్, పంత్ సెంచరీలు
- బుమ్రా బౌలింగ్ మాయాజాలం



హెడింగ్లీ : లీడ్స్‌లో జరుగుతున్న భారత్-ఇంగ్లండ్ మొదటి టెస్ట్ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు రసవత్తర అనుభవాన్ని అందిస్తోంది. ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సిరీస్‌లో భాగంగా, 2025-27 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఈ మ్యాచ్ రెండు జట్లకూ కీలకమైనది. నాల్గవ రోజు ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 349/6 స్కోరుతో 355 పరుగుల ఆధిక్యం సాధించి, మ్యాచ్‌పై గట్టి పట్టు బిగించింది. అయితే, ఈ ఉత్కంఠ భరిత క్రీడా సమరం మధ్య భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు సంబంధించిన ఐసీసీ డ్రెస్ కోడ్ ఉల్లంఘన వివాదం చర్చనీయాంశంగా మారింది. నాల్గవ రోజు భారత బ్యాటింగ్‌లో కెఎల్ రాహుల్ మరియు రిషబ్ పంత్ చెలరేగారు. కెఎల్ రాహుల్ 247 బంతుల్లో 137 పరుగులతో తన 9వ టెస్ట్ సెంచరీని నమోదు చేసి, ఇంగ్లండ్‌లో తన మూడో సెంచరీ సాధించాడు. రిషబ్ పంత్ ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు (134, 118) చేసి, ఇంగ్లండ్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారత వికెట్ కీపర్‌గా చరిత్ర సృష్టించాడు. వీరిద్దరి ఆకర్షణీయ బ్యాటింగ్ ఇంగ్లండ్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టింది. బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, బెన్ స్టోక్స్‌లు బౌలింగ్‌లో పోరాడినప్పటికీ, భారత్ ఆధిక్యం 355 పరుగులకు చేరింది. రవీంద్ర జడేజా మరియు శార్దూల్ ఠాకూర్ క్రీజ్‌లో ఉండగా, ఐదవ రోజు భారత్ లక్ష్యాన్ని 400 పరుగులకు పైగా నిర్దేశించే అవకాశం ఉంది.

జస్‌ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్‌లో భారత బౌలింగ్ దళానికి నాయకత్వం వహిస్తున్నాడు. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 465 పరుగులకు ఆలౌట్ కాగా, బుమ్రా 5 వికెట్లతో (14వ టెస్ట్ ఫైవ్-వికెట్ హాల్) రాణించాడు. అతడి పదునైన బౌలింగ్ ఇంగ్లండ్‌కు భారీ ఆధిక్యం సాధించే అవకాశాన్ని అడ్డుకుంది. రవీంద్ర జడేజా, ప్రసిద్ధ్ కృష్ణల సహకారంతో భారత బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను కట్టడి చేశారు. ఐదవ రోజు ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను మరింత ఒత్తిడిలోకి నెట్టడం బుమ్రా బౌలింగ్ వ్యూహంపై ఆధారపడి ఉంటుంది. ఐదవ రోజు ఈ మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించే అవకాశం ఉంది. భారత్ 400 పరుగులకు పైగా లక్ష్యాన్ని నిర్దేశిస్తే, హెడింగ్లీలో ఇది రికార్డు స్థాయి ఛేజింగ్ టార్గెట్ అవుతుంది. ఇంగ్లండ్, బెన్ స్టోక్స్ నాయకత్వంలో, గతంలో హెడింగ్లీలో అద్భుతమైన ఛేజింగ్‌లు (2019లో ఆస్ట్రేలియాపై) చేసిన చరిత్రతో ఆక్రమణ బ్యాటింగ్‌తో పోరాడే అవకాశం ఉంది. అయితే, బుమ్రా, జడేజా నేతృత్వంలోని భారత బౌలింగ్ దళం ఇంగ్లండ్‌ను కట్టడి చేయడంలో కీలకం కానుంది. వాతావరణం సహకరిస్తే, ఈ మ్యాచ్ రసవత్తర ఫలితాన్ని అందించే అవకాశం ఉంది.

### గవాస్కర్ తీవ్ర విమర్శలు

దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ భారత ఫీల్డింగ్, ముఖ్యంగా జైస్వాల్ తప్పిదాలపై తీవ్రంగా స్పందించాడు. "ఇలాంటి ఫీల్డింగ్‌కు ఎలాంటి పతకాలు ఇవ్వరు. జైస్వాల్ సాధారణంగా మంచి ఫీల్డరే, కానీ ఈసారి ఒక్క క్యాచ్ కూడా పట్టుకోలేకపోయాడు. ఇది జట్టును ఎంతగా నిరాశపరిచిందో చెప్పలేను," అని ఆయన వ్యాఖ్యానించాడు.

# ఐఓసీ చీఫ్‌గా క్రిస్టీ కొవెంట్రీ..

### తొలి ఆఫ్రికా మహిళగా చరిత్ర



అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది. 133 ఏళ్ల చరిత్రలో తొలిసారి మహిళా అధ్యక్షురాలిగా జింబాబ్వే దిగ్గజ స్విమ్మర్ క్రిస్టీ కొవెంట్రీ ఎంపికై, తొలి ఆఫ్రికా దేశస్థురాలిగా రికార్డు సృష్టించారు. ఒలింపిక్ డే సందర్భంగా సోమవారం (జూన్ 23, 2025) లసాన్నేలో జరిగిన కార్యక్రమంలో ఆమె థామస్ బాచ్ నుంచి ఐఓసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. బాచ్ ఆమెకు ఒలింపిక్ హౌస్ తాళాలు అప్పగించారు. 41 ఏళ్ల క్రిస్టీ, 2004, 2008 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన గొప్ప అథ్లెట్. ఈ నియామకంపై సంతోషం వ్యక్తం చేసిన ఆమె, భావోద్వేగంతో మాట్లాడుతూ, "నా రాక్ స్టార్స్.. నాకు స్ఫూర్తి దీపాలు వీళ్లు" అంటూ తన ఇద్దరు కూతుళ్ల వైపు చూసి ఆనందాశ్రులు రాల్చారు. క్రిస్టీ ఎనిమిదేళ్ల పాటు (2033 వరకు) ఈ పదవిలో కొనసాగనున్నారు.

## గిల్.. ఐసీసీ డ్రెస్ కోడ్ ఉల్లంఘన



ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నప్పటికీ, అతడి డ్రెస్ కోడ్ ఉల్లంఘన వివాదం క్రీడా సమాజంలో చర్చనీయాంశంగా మారింది. మొదటి రోజు బ్యాటింగ్ సమయంలో గిల్ నలుపు రంగు సాక్స్ ధరించడం ఐసీసీ దుస్తుల నియమావళి (క్లాజ్ 19.45) ఉల్లంఘనగా పరిగణించబడింది. ఐసీసీ నియమాల ప్రకారం, టెస్ట్ మ్యాచ్‌లలో ఆటగాళ్లు తెలుపు, క్రీమ్, లేదా లేత బూడిద రంగు సాక్స్ మాత్రమే ధరించాలి. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఈ ఉల్లంఘనను ఉద్దేశపూర్వక లెవల్-1 నేరంగా భావిస్తే, గిల్‌కు మ్యాచ్ ఫీలో 10-20% జరిమానా విధించే అవకాశం ఉంది. అయితే, ఇది ఉద్దేశపూర్వకం కాకపోతేఉదాహరణకు, నియమానికి తగిన సాక్స్ అందుబాటులో లేకపోతేజరిమానా నివారించబడవచ్చు. ఈ వివాదం గిల్ అద్భుత బ్యాటింగ్‌ను (మొదటి ఇన్నింగ్స్‌లో 147) కొంతవరకు మరుగున పడేలా చేసింది. కెప్టెన్సీలో తొలి అడుగులు వేస్తున్న గిల్‌కు ఇది ఒక పాఠంగా మారవచ్చు. ఐసీసీ నియమాలు కఠినంగా అమలు చేయబడుతున్న నేపథ్యంలో, ఆటగాళ్లు ఇలాంటి చిన్న విషయాలపై శ్రద్ధ వహించడం తప్పనిసరి. గతంలో క్రిస్ గేల్ వంటి ఆటగాళ్లు ఇలాంటి ఉల్లంఘనలకు జరిమానాలు ఎదుర్కొన్న ఉదాహరణలు ఉన్నాయి. ఈ ఘటన భవిష్యత్తులో ఆటగాళ్లకు హెచ్చరికగా నిలుస్తుందని ఆశిద్దాం.

## లీడ్స్ టెస్ట్‌లో పంత్ ఆగ్రహం

### బంతి మార్పు వివాదం

ఇంగ్లండ్‌తో జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్‌లో భారత వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ అంపైర్ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 60వ ఓవర్‌లో బంతి ఉబ్బినట్లు అనిపించడంతో, బంతిని మార్చాలని పంత్ అంపైర్‌ను కోరాడు. అంపైర్ బంతిని రెండు రింగ్‌ల ద్వారా పరీక్షించగా, ఒక రింగ్‌లో బంతి సరిగ్గా సరిపోలేదు, మరొక రింగ్‌లో కష్టంగా దూరింది. అయినప్పటికీ, అంపైర్ బంతిని మార్చేందుకు నిరాకరించాడు. దీనిపై పంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, బంతిని నేలకేసి కొట్టి అక్కడి నుంచి నడిచిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా అంపైర్ నిర్ణయాన్ని తప్పుబట్టాడు, కానీ ఫలితం లేకపోయింది.ఐసీసీ నియమాల ప్రకారం, బంతి ఉబ్బినా లేదా పాడైనా, అంపైర్లు వెంటనే సమాన వాడిన బంతితో దాన్ని మార్చాలి. ఉబ్బిన బంతి బౌలర్లకు వికెట్లు తీయడం కష్టతరం చేస్తుందని, బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పంత్ బంతి మార్పు కోరడం సమంజసమే అయినప్పటికీ, అతడి ఆగ్రహ ప్రవర్తన ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ (లెవల్-1 ఉల్లంఘన) కింద జరిమానాకు దారితీయవచ్చు.

### రవి శాస్త్రి ప్రశంసలు

టీమ్ ఇండియా మాజీ కోచ్ రవి శాస్త్రి పంత్‌ను ఆకాశానికెత్తేశాడు. "పంత్‌కు నంబర్ల ఆట తెలుసు. ఎప్పుడు రక్షణాత్మకంగా, ఎప్పుడు ఆక్రమణగా ఆడాలో అతడికి స్పష్టత ఉంది. అతడి మైండ్ ఒక కంప్యూటర్ లాంటిదిఅది ఎలా పనిచేస్తుందో అతడికి మాత్రమే తెలుసు. అందుకే అతడు మ్యాచ్ విన్నర్. సెంచరీ తర్వాత అతడి సంబరాలు అత్యుత్తమం. గతంలో ప్రమాదం నుంచి కోలుకుని, ఆసుపత్రిలో తీవ్ర గాయాల నుంచి తిరిగి క్రికెట్‌లో సత్తా చాటడం గొప్ప విషయం," అని శాస్త్రి కొనియాడాడు.పంత్ ఆగ్రహం జట్టు ఒత్తిడిని ప్రతిబింబిస్తుంది, కానీ అతడి ప్రవర్తన ఐసీసీ నియమాల కింద పరిశీలనకు రావచ్చు. అతడి సెంచరీ మరియు ఆటతీరు భారత్‌కు ఆధిక్యం అందించినప్పటికీ, ఇలాంటి ఘటనలు జట్టు దృష్టిని మరల్చకుండా జాగ్రత్త వహించాలి. ఐదవ రోజు భారత్ బలమైన లక్ష్యాన్ని నిర్దేశిస్తే, ఈ మ్యాచ్ ఫలితం ఆసక్తికరంగా ఉంటుంది.

## "బుమ్రా కోహినూర్ లాంటివాడు

### దినేశ్ కార్తిక్ ప్రశంసల జల్లు



ఇంగ్లండ్‌తో లీడ్స్‌లో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో 5 వికెట్లతో చెలరేగిన జస్‌ప్రీత్ బుమ్రాపై టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ ప్రశంసల వర్షం కురిపించాడు. బుమ్రాను కోహినూర్ వజ్రంతో పోలుస్తూ, అతడి విలువను కొనియాడాడు. అన్ని ఫార్మాట్లలో మ్యాచ్‌లను మలుపు తిప్పే అతడి ప్రదర్శనలు, బౌలింగ్‌లో నిలకడను ప్రశంసించాడు. టెస్ట్ క్రికెట్‌లో 200కు పైగా వికెట్లు తీసుకున్న బౌలర్లలో బుమ్రా సగటు (19.3) అత్యుత్తమమని కార్తిక్ ఒక క్రీడా ఛానెల్ ఇంటర్వ్యూలో తెలిపాడు. "బుమ్రా కోహినూర్ లాంటివాడు. అన్ని ఫార్మాట్లలో అతడి ప్రాముఖ్యతను అందరూ గుర్తించారు. ఏ ఫార్మాట్ అయినా, ఏ బంతి అయినా అతడు తన సత్తా చాటుతాడు. బ్యాటర్ మనసును ముందే చదివి, వారు ఆడబోయే షాట్‌ను ఊహించి, దానికి తగ్గట్టు బంతులు వేస్తాడు. 200కు పైగా వికెట్లు తీసిన బౌలర్లలో అతడి సగటు ఉత్తమమని, ఇది అతడి ప్రత్యేకతను చాటుతుంది," అని కార్తిక్ వివరించాడు.

బుమ్రా అద్భుత బౌలింగ్‌తో ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 465 పరుగులకు ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 82 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టిన అతడు, టెస్ట్ క్రికెట్‌లో 14వ సారి, విదేశాల్లో 12వ సారి ఫైవ్-వికెట్ హాల్ సాధించాడు. ఇంగ్లండ్‌ను ఆధిక్యంలోకి వెళ్లకుండా నిలువరించడంలో బుమ్రా ప్రధాన భూమిక వహించాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో 200 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన 86 మంది బౌలర్లలో బుమ్రా సగటు అత్యుత్తమంగా ఉంది.మరోవైపు, శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌పై కార్తిక్ విమర్శలు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో శార్దూల్ కేవలం 6 ఓవర్లు వేసి 38 పరుగులు ఇచ్చాడు, ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. బ్యాటింగ్‌లోనూ 8 బంతుల్లో 1 పరుగుతో నిరాశపరిచాడు. "శార్దూల్‌ను జట్టులోకి తీసుకున్నప్పుడు అతడికి మరిన్ని ఓవర్లు ఇవ్వాలి. అతడి బౌలింగ్‌పై నమ్మకం లేనప్పుడు జట్టులో చేర్చడం అర్థరహితం," అని కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్‌లకు కార్తిక్ సూచించాడు.

# ఈ సీజన్‌లో నా లక్ష్యం వరల్డ్ ఛాంపియన్‌షిప్!



ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా ఈ సీజన్‌ను అద్భుతంగా ప్రారంభించాడు. ప్యారిస్ డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల మార్క్‌తో టైటిల్ సాధించి రికార్డు సృష్టించాడు. అయినా, సంతృప్తి చెందకుండా తదుపరి లక్ష్యంగా సెప్టెంబర్‌లో టోక్యోలో జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్‌ను గెలవాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం నాడు జరిగే గోల్డెన్ స్పైక్ అథ్లెట్ సమావేశంలో తన అంతిమ లక్ష్యాన్ని ఖరారు చేస్తానని ఈ జావెలిన్ స్టార్ తెలిపాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాన్ జెలెంజీని కోచ్‌గా నియమించుకున్న నీరజ్, ఆయనతో కలిసి తన ఆట, టెక్నిక్‌ను మెరుగుపరచడానికి ఉత్సాహంగా ఉన్నాడు. ఇటీవల 90 మీటర్ల దూరం ఈటె విసిరి, ఈ సీజన్‌లో మరిన్ని గొప్ప ఫలితాలు సాధిస్తాననే నమ్మకంతో ఉన్నాడు. చెక్ రిపబ్లిక్‌లోని నింబక్‌లో జరిగిన శిక్షణ సంతృప్తికరంగా సాగిందని తెలిపాడు. "సెప్టెంబర్‌లో టోక్యోలో జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో విజేతగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నా," అని నీరజ్ వెల్లడించాడు. గత ఎడిషన్‌లో స్వర్ణం సాధించిన అతడు, ప్రపంచంలోనే అత్యుత్తమ జావెలిన్ త్రోయర్‌గా పేరొందాడు. చిన్నప్పుడు జమైకా పరుగుల దిగ్గజం ఉస్సేన్ బోల్ట్ వీడియోలను ఆసక్తిగా చూసేవాడినని, అతడిని చూసి అథ్లెటిక్స్‌లో రాణించాలని కలలు కన్నానని నీరజ్ తెలిపాడు.

"బోల్ట్‌కు నేను పెద్ద ఫ్యాన్. అతడు పోటీపడిన అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ వీడియోలను చూసేవాడిని. గత ఏడాది గాయం కారణంగా పోటీలో పాల్గొనలేకపోయా. కానీ, ఇప్పుడు నేను అద్భుత ఫామ్‌లో ఉన్నా. అయితే, మరోసారి 90 మీటర్ల దూరం విసరడానికి శరీరాన్ని అతిగా కష్టపెట్టాలని అనుకోవడం లేదు," అని నీరజ్ వివరించాడు.

## నేను నమ్మిన విధంగానే ఆడతాను

- దేవుడు రాసినంతకాలం ఆట కొనసాగిస్తాను : బుమ్రా

ఇంగ్లాండ్‌తో లీడ్స్‌లో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కీలక కామెంట్స్ చేశారు. గాయాల నుంచి కొలుకొని తిరిగి వచ్చిన తరువాత తనపై విమర్శలు చేసిన వారిపై ఘాటుగా స్పందించాడు. విమర్శలను తాను పట్టించుకోనని, దేవుడు రాసినంతకాలం క్రికెట్ ఆడతానని చెప్పాడు. పోస్ట్ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బూమ్రా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'వాళ్లు(విమర్శకులు) నా గురించి ఏం అంటారు, ఏం రాస్తారు అనే దానిపై నేను దృష్టి పెట్టను. నా లక్ష్యం ముఖ్యం. వాళ్లు నా పేరుని ఉపయోగించి హెడ్ లైన్స్ వేస్తారనే విషయం నాకు తెలుసు. కానీ అవి నా మైండ్‌లోకి రాకుండా చూసుకుంటాను. నాకు అలాంటి ఒత్తిళ్లు అవసరం లేదు. ప్రతిరోజూ నిద్రకు వెళ్లేముందు నేను నన్ను నేను ఓసారి ప్రశ్నించుకుంటాను. నేను నా వంద శాతం కష్టపడ్డానా? అన్న ప్రశ్నకు అవునని సమాధానం వస్తే చాలు. నిశ్శబ్దం గా నిద్రపోతాను.

ఇతరులు ఎలా ఆడమంటారో కాదు, నేను నమ్మిన విధంగానే ఆడతాను. నా ప్రిపరేషన్, నా ఆలోచనలు ఎప్పుడూ భారత్ కోసం ఆడాలనే తపనతోనే ఉంటాయి' అని బూమ్రా తెలిపారు."గాయం అయిన ప్రతి సారి, 'ఇంకా బుమ్రా ఆడడు', 'ఇంకా ఆటకి దూరం' అంటూ ఊహాగానాలు వచ్చాయి. అయినా గడిచిన దశాబ్దంగా నేను అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతూనే ఉన్నాను. 'ఇప్పుడు కూడా బుమ్రా రిటైర్ అవుతాడు' అని ఇంకా కొంతమంది అంటున్నారు. ఎదురు చూస్తూ ఉండండి. నేను నా పని చేస్తూనే ఉంటాను. దేవుడు రాసినంతకాలం ఆట కొనసాగిస్తాను," అని బుమ్రా స్పష్టం చేశాడు. లీడ్స్‌లో ఐదు వికెట్లను సాధించడం ద్వారా బుమ్రా రత దిగ్గజం కపిల్ దేవ్ సరసన చేరాడు. విదేశీ గడ్డపై ఆయన 12వ సారి 5వికెట్లు పడగొట్టడం ద్వారా ఈ ఘనత సాధించారు.

## కేఎల్ రాహుల్‌కు గాయం!?

కేఎల్ రాహుల్‌కు బంతి తాకరాని చోట తాకింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా రెండో ఇన్నింగ్స్ సందర్భంగా నాలుగో రోజు ఆటలో ఈ ఘటన చోటు చేసుకుంది. సరిగ్గా లంచ్ బ్రేక్‌కు ముందు బెన్ స్టోక్స్ వేసిన బంతి అతని జననాంగానికి బలంగా తాకింది. దాంతో రాహుల్ నొప్పితో విలవిలలాడాడు. క్రీజు నుంచి పక్కకు జరిగి సర్కస్ ఫీట్లు వేసాడు. స్టోక్స్ వేసిన 47వ ఓవర్ ఐదో బంతి.. చాతి హైట్‌లో దూసుకొచ్చింది.బంతి వేగంగా రావడంతో రాహుల్ డిఫెన్స్ చేసే ప్రయత్నం చేశాడు. కానీ బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి.. అతని జననాంగానికి బలంగా తాకింది. మరో బాల్ మాత్రమే మిగిలి ఉండటంతో ఫిజియోలను పిలిపించుకోకుండా బలవంతంగా నొప్పితోనే ఆఖరి బంతి ఆడాడు. ఓవర్ ముగిసిన వెంటనే మోకాళ్లపై కూర్చొని నొప్పితో తల్లడిల్లాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. తొలి సెషన్ చివర్ ఓవర్‌ను బషీర్ వేయగా.. రాహుల్‌కు స్ట్రైక్ ఇవ్వకుండా పంత్ ఆడేసాడు. దాంతో భారత్ 153/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. 90/2 ఓవర్ నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(8) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఓవర్‌నైట్ స్కోర్‌కు అతను రెండు పరుగులు మాత్రమే జోడించి వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో పంత్‌తో కలిసి రాహుల్ ఆచితూచి ఆడాడు. ఓవర్‌కాస్ట్ కండిషన్స్ ఉండటం.. ఇంగ్లండ్ బౌలర్లు కట్టుదిట్టంగా వేయడంతో రాహుల్-పంత్ డిఫెన్స్‌కే పరిమితమయ్యారు. వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి సెషన్‌లో 24.1 ఓవర్లు ఆడిన భారత్ ఓ వికెట్ కోల్పోయి..63 పరుగులు మాత్రమే చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్ 465 పరుగులు చేయడంతో భారత్‌కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది.

# విద్యా వ్యవస్థ పటిష్టం కోసం కృషి చేయాలి





- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి
- ఎంఈవోలు, ఆర్సీఓ అధికారులతో పి. ప్రావీణ్య జిల్లా కలెక్టర్ సమీక్ష

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి) :**
విద్యా వ్యవస్థ పటిష్టం కోసం కృషి చేయాలని, బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం జిల్లాలోని ఎంఈఓ లు కస్తూరిబా పాఠశాలల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ బడిబాట కార్యక్రమం, మన ఊరు మనబడి, పాఠశాల విద్య పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యా శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో పట్టణాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు , విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### వార్షిక విద్యా క్యాలెండర్ అమలు చేయాలి

ప్రతి ఉపాధ్యాయుడు వార్షిక విద్యా క్యాలెండర్‌ను పూర్తిగా అమలు చేయాలన్నారు. తనిఖీలకు వెళ్ళినప్పుడు సమస్యలను విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకోవాలని సూచించారు. బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు ఎన్ఈవోలు కృషి చేయాలన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా మధ్యలో చదువు కొనడం ఆపివేసే బాలికలను ఆయా మండలాలలోనూ కస్తూరిబా పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థ పటిష్టత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నందున క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పథకాలను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణం గా అమలు చేయాల్సిన బాధ్యత మండల విద్యాధికారులది అన్నారు. ఎంఈఓ లో ప్రతిరోజు కనీసం రెండు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు శాతం ఉపాధ్యా యుల బోధనకు విద్యార్థులు ఈ విధంగా సన్నద్ధమవుతున్నారు తదితర విషయాలను గమనించి ప్రతిరోజు స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ లో ఎంఈఓ లు పాఠశాలల తనిఖీ వివరాలు నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో వంట పాత్రలు కొనుగోలు కోసం వచ్చిన నిధులతో నూతన పాత్రలు కొనుగోలు చేయాలని సూచించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నచోట వెంటనే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మన ఊరు మనబడి లో పెండింగ్లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో అసంపూర్తిగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని సూచించారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో ఏ విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 3429 మంది విద్యార్థులు వివిధ కళాశాలలో చేరినట్లు తెలిపారు.

ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యావ్యవస్థ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్య క్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటే శ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోవిందరావు, టీజీ ఈడబ్ల్యుఐడీసీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## భూతనాదోపాఖ్యానం పుస్తకావిష్కరణ

**కరీంనగర్ బ్యూరో, జూన్ 23 (జనంసాక్షి) :**
శ్రీ అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రాచీనమైన బ్రహ్మాండ పురాణాలలోని బోతనాథోపాఖ్యానంలో గల మహాశాస్తా వారి చరిత్రకై చాలా ఏళ్లుగా అరవింద సుబ్రహ్మణ్యం కృషితో మలయాళం నుండి తెలుగులోకి అనువదించబడి అయ్యప్ప స్వామి మహిమలు శబరిమల సంపూర్ణ చరిత్ర, మాల నియమాలు నిష్ఠ వివరాలతో కూడిన పుస్తకాన్ని పద్మశ్రీ గరికపాటి నరసింహరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో శ్రీ అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జనగాం శ్రీనివాస్, తెలు శ్రీనివాస్, సిద్ధా రామ్మూర్తి లు మీడియాతో మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వామి వారి దీక్ష నియమనిష్టలపై వివరించేందుకు పద్మశ్రీ డా. గరికపాటి నరసింహారావు చే ప్రవచనామృతం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పందల రాజ్యం నుండి పందల రాజప్రసాదం అధ్యక్షులు శంకర్ వర్మ , శబరిమల మాజీ మేల్ శాంతి బ్రహ్మశ్రీ సుధీర్ నంబుద్రి , మాలికాపురం మాజీ మేల్ శాంతి, బ్రహ్మశ్రీ మురళి నంబోద్రి , గుర్తు పూజ నిర్వాహకులు అజిత్ కుమార్, అలాగే అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు నిర్వహకులు, ట్రస్ట్ సభ్యులు బండి స్వామి, రంజిత్, శ్రీనివాస్, కాట రాజేందర్, రమేష్ అనేక అయ్యప్ప సంస్థ ప్రతినిధులు, గురుస్వాములు, భక్తులు, ఈ మహత్కార కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జైస్వాల్ ఫీల్డింగ్ తప్పిదాలు

లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ బ్యాటింగ్‌లో సెంచరీ (101)తో అదరగొట్టినప్పటికీ, ఫీల్డింగ్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేస్తూ మూడు కీలక క్యాచ్‌లను జారవిడిచి జట్టును నిరాశపరిచాడు. ఈ తప్పిదాలు మ్యాచ్ గమనాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో, క్రీడా విశ్లేషకులు మరియు అభిమానుల నుంచి జైస్వాల్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ సమయంలో జైస్వాల్ మూడు సులభమైన క్యాచ్‌లను నేలపాలు చేశాడు, ఇవన్నీ స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో వచ్చినవే. ఈ వైఫల్యాలు బుమ్రాను తీవ్ర నిరాశకు గురిచేశాయి, అతడు మైదానంలో తన అసహనాన్ని దాచుకోలేకపోయాడు. బుమ్రా 82 పరుగులిచ్చి 5 వికెట్లు (14వ టెస్ట్ ఫైవ్-వికెట్ హాల్) తీసినప్పటికీ, జైస్వాల్ క్యాచ్‌లు జారవిడవడం వల్ల ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 465 పరుగుల వరకు సాగింది. మొత్తంగా భారత ఫీల్డర్లు ఈ ఇన్నింగ్స్‌లో ఆరు క్యాచ్‌లను వదిలేశారు, ఇందులో జైస్వాల్ తప్పిదాలు ప్రధానంగా విమర్శలకు దారితీశాయి.

# రఘునందన్ రావుకు బెదిరింపులు

- చంపేస్తామంటూ మావోల పేరుతో కాల్
- ఎంపీ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**హైదరాబాద్, జూన్ 23 (జనంసాక్షి) :** మెదక్ భాజపా ఎంపీ రఘునందన్‌రావు కు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్ ఫిర్యాదు చేశారు. బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుని చంపేస్తామని పీపుల్స్ వార్ మావోయిస్టుల పేరుతో ఫోన్ చేసి బెదిరించారు. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఎంపీని హెచ్చరించారు. తాను మధ్యప్రదేశ్‌కి చెందిన మావోయిస్టునని ఓ ఆగంతకుడు ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డాడు. అయితే ఆ ఫోన్ కాల్‌ని రఘునందన్‌రావు పీఏ ఎత్తాడు. 912143352974 నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దమ్ముంటే కాపాడుకోండి అంటూ రఘునందన్‌ని ఆగంతకుడు బెదిరించాడు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. సోమవారం మేడ్చల్ జిల్లాలోని దమ్మాయిగూడలో రఘునందన్ రావు పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ సమయంలోనే రఘునందన్‌రావుకి ఆగంతకుడి నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే రఘునందన్ రావు అప్రమత్తమై తెలంగాణ డీజీపీ జితేందర్‌కి, సంగారెడ్డి ఎస్పీకి, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రఘునందన్ రావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాల్ నెంబర్ ఆధారంగా విచారణ చేస్తున్నారు. ఎక్కడ నుంచి ఈ కాల్ వచ్చిందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై బీజేపీ అగ్రనేతలు ఎంపీ రఘునందన్‌రావుకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

# చెదిరిపోతున్న ప్రజల ఇంటికల

- ప్రభుత్వ విధానాలతో ఖరీదైన వస్తువుగా ఇల్లు
- జిఎస్టీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల మోతతో కుదేలు



**హైదరాబాద్, జూన్ 23 (జనంసాక్షి) :** దేశంలో నిర్మాణరంగం ఖరీదైనదిగా మారుతోంది. ఇనుము, సిమెంట్, ఇసుకల ధరలు పెరగడం, అందుకు తగ్గట్లుగా భూమి, కూలీ రేట్లు కూడా అమాంతంగా పెరగడంతో నిర్మాణ రంగం కుదేలవుతోంది. సొంతంగా ఇంటిని కట్టుకోవాలన్న కల చెదరుతోంది. రుణాలు పొందేవారిపై వడ్డీల భారం పెరుగుతోంది. జిఎస్టీ వల్ల మరింత భారం పడుతోంది. దీనికితోడు ఇల్లు కొనాలనుకుంటున్న వారిపై రాష్ట్రంలో కూడా పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పడుతున్నాయి. వీటికి తోడు స్టీలు, సిమెంట్, లేబర్ ఛార్జీలు, ఇతరత్రా మెటీరియల్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇవన్నీ సమీక్షించాలి. అప్పడే మధ్యతరగతి వారు సొంతంగా ఇల్లు కొనుక్కోగలరు. అందుకే ప్రభుత్వం అందించే ఇంటికోసం పేదలు ఎదురు చూస్తున్నారు. చివరకు వారిచ్చే చిన్ని ఇంటి కోసం ఆశపడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఊరూవాడా ప్రచారం జోరుగా సాగుతోంది. ఏడాదిన్నరగా దీనికి సంబంధించి పక్కా కార్యాచరణ జరగేలదు. గ్రామాల్లోమాత్రం కాంగ్రెస్ నేతలు ఊదరగొడుతున్నారు. పేదలు ఇల్లు కట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇలా ఎంతమందికి ఇందరమ్మ ఇళ్లు కట్టిస్తారు. మిగతా పేదవారి పరిస్థితి ఏంటన్నది పాలకులు ఆలోచించడం లేదు. ప్రజలపై రకరకాల పన్నులతో పీల్చి పిప్పి చేస్తున్నారు. ఒకప్పుడు మధ్యతరగతి వారు సునాయాసంగా ఓ ఫ్లాట్ కొనుక్కోగలిగేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజిస్ట్రేషన్‌కు ఓ పది నుంచి 12 లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. తెలంగాణలో రుణం తీసుకుంటే..అదనంగా ప్రభుత్వానికి మరో 50వేలు అప్పనంగా చెల్లించాల్సి వస్తోంది. గత కెసిఆర్ ప్రభుత్వం పెట్టిన భిక్ష ఇది. ఇలాంటి అడ్డగోలు విధానాలను ప్రభుత్వాలు సమీక్షించాలి. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణ ల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందని అంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది.

# ఒలంపిక్స్‌లో మన సత్తా చాటాలి

- ఒలంపిక్ డే వేడుకల్లో జయేశ్ రంజన్



**హైదరాబాద్, జూన్ 23 (జనంసాక్షి) :** ఒలింపిక్స్‌లో మన ప్రతిభను కనబరచడానికి కృషి చేయాలని తెలంగాణ ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ డే వేడుకలు నిర్వహించారు. 14 ప్రాంతాల నుంచి ఒలింపిక్ రన్ ద్వారా విద్యార్థులు ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటుతున్నాయన్నారు. ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం శుభవార్త చెబుతుందని చెప్పారు. ప్రభుత్వం త్వరలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న కొత్త క్రీడా పాలసీకి ఆమోదం తెలపనుందని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా క్రీడా పాలసీని తీసుకు వస్తోందన్నారు. దీని తర్వాత క్రీడాకారులకు మంచి ప్రోత్సాహకాలు ఉంటాయని చెప్పారు. గత ప్రభుత్వంలో చాలామందికి న్యాయం జరగలేదన్నారు. వారికి త్వరలో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, పారా ఒలింపిక్ పతక విజేత దీప్తి జివాంజీ పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో అవినీతి ముమ్మాటికీ నిజం

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శలు



**హైదరాబాద్, జూన్ 23 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే భారాస నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని భాజపా ఎమ్మెల్యే రాజా సింగ్ మండిపడ్డారు. బండి సంజయ్‌పై భారాస నేతలు చేసిన వ్యాఖ్యల్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టేనని వ్యాఖ్యానించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాది.. మా పార్టీది ఒకే అభిప్రాయం. ఈ ప్రాజెక్టుపై ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా చెప్పిన మాటలకే మేమూ కట్టుబడి ఉంటాం అన్నారు. భారాస నేతల వైఖరి చూస్తుంటే 'ఉల్టా చోర్ కొత్వాల్ డాంటే' అన్నట్లుగా ఉంది. ప్రధాని మోదీ చెప్పినట్లు భారాస కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంది. ఇది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రూ. 8వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో రూ. 1.20లక్షల కోట్లకు పెంచలేదా?ఆనాడు కేసీఆర్ స్వయం ప్రకటిత ఇంజినీరు అవతారం ఎత్తి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టి ప్రజాధనం లూటీ చేశారని అన్నారు. ఆయన కుమారుడు ఎన్‌డీఎస్‌ఏ కంటే తానే తెలివైన మేధావిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

# ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించండి

- నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు
- తెలంగాణ వామపక్ష పార్టీల పిలుపు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇరాన్‌పై సామ్రాజ్యవాద అమెరికా చేసిన బాంబుదాడులను ఖండిస్తూ అఖిల భారత వామపక్ష పార్టీలు దేశ వ్యాపితంగా నిరసన కార్యక్రమాలను చేయాలని పిలుపునిచ్చాయి. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నేడు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రపంచ శాంతి కోరుకునే వారు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేసి ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా అమెరికా దాడులకు పాల్పడుతున్నదని, ఇరాన్ అణ్వాయుదాలు తయారుచేస్తున్నాయనడానికి తమ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ, అమెరికా ఇంటలీజెన్స్ సంస్థలు వెల్లడిరచినా కూడా, అణ్వాయుదాలు తయారు చేస్తున్నదనే నెపంతో ఇరాన్‌పై ఈ దాడికి అమెరికా పూనుకోవడం ఉద్రిక్తతలను రెచ్చగొట్టడమేనని తెలిపారు. ఇరాన్‌ను ధ్వంసం చేయడం, పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యం చెలాయించడానికే అమెరికా ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నదని, ఇది ప్రపంచశాంతికి భంగం కలిగించడంతో పాటు, పశ్చిమాసియాపై ఆధారపడుతున్న భారత్ వంటి దేశాలపై, కార్మికులపై, సాధారణ ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని, సామ్రాజ్యవాద అమెరికా దుశ్చర్యను భారత ప్రభుత్వం ఖండిరచాలని, అమెరికా- ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధాన వైఖరిని విడనాడి, యుద్ధాన్ని ఆపడంలో భాగస్వామి కావాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. శాంతిని కోరుకునే వారంతా సామ్రాజ్యవాద అమెరికా దాడులను ఖండించాలని కోరాయి.

# పూర్తి అవినీతిలో కూరుకున్న పార్టీ బిఆర్ఎస్

- రప్పారప్పా ఆ పార్టీ నేతలను జైలులో వేయాలి
- హరీష్ రావు తప్ప మరెవ్వరూ ఆ పార్టీ నుంచి గెలవరు
- 28న నిజామాబాద్‌కు హోంమంత్రి అమిత్ షా రాక
- నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ వెల్లడి



**నిజామాబాద్, జూన్23 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిన పార్టీ అని బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు. బిఆర్ఎస్ నేతలను రప్పా,రప్పా జైలులో వేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి ఉదయం బిఆర్ఎస్ ను బెదిరించి సాయంత్రం మిలాఖత్ అవ్వొద్దని సూచించారు. ములాఖత్ అయితే కాంగ్రెస్ కు పుట్టగతులు ఉండవని జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌లో మాజీ మంత్రి హరీష్ రావు తప్ప, ఎవరూ గెలవరు అని చెప్పారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు ఓటమి తప్పదు అని హెచ్చరించారు. ఈ నెల 29న జిల్లాలో అమిత్ షా పర్యటన చేయనున్నారని ఎంపి అర్వింద్ పేర్కొన్నారు. ఇక్కడి పసుపుబోర్డు కేంద్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారని అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. జూన్ 29వ తేదీన నిజామాబాద్ జిల్లాలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటించనున్నారని తెలిపారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారని చెప్పారు. నిజామాబాద్ వేదికగా పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు కొత్త శకం ప్రారంభమైందన్నారు. అలాగే దివంగత నేత డి. శ్రీనివాస్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వివరించారు. అనంతరం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో రైతు సమ్మేళనం పేరిట కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఈ రెండు పార్టీలు కలిసి బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబానికి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కవచంగా మారిందని ఆరోపించారు. 'కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రూపాయి నాణేనికి రెండు ముఖాల్లా ఉన్నాయి. కేసీఆర్ అవినీతిపై స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా అవినీతితో నిండి ఉందని, రూ. 38 వేల కోట్ల ప్రాజెక్టును రూ. 1.2 లక్షల కోట్లకు పెంచడం ద్వారా కేసీఆర్ భారీ మోసం చేశారని పేర్కొన్నారు. దీనివల్ల అధికారులు, రాజకీయ నాయకులు వందల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అయినా కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పట్టించుకోవడం లేదన్నారు. ఇకపోతే, కేసీఆర్ తనను తాను ఇంజినీర్, డాక్టర్ అంటూ ప్రాజెక్టును సమర్థించుకున్నా, విచారణకు వచ్చినప్పుడు కేబినెట్‌లో చర్చించి తీసుకున్న నిర్ణయం అని తప్పించుకోవడం చూస్తే బతకడానికి ప్రయత్నిస్తున్నట్టు అనిపిస్తుందని ఎద్దేవా చేశారు. 'రాహుల్ గాంధీ గతంలో కాళేశ్వరం పై సీబీఐ విచారణ డిమాండ్ చేశారు. ఇప్పుడు మాత్రం ఆ విషయాన్ని మర్చిపో యారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు అర్థం చేసుకుని, బీజేపీకి అధికారం అప్పగించేందుకు సిద్ధమవు తున్నారని ధర్మపురి అర్వింద్ అన్నారు.

# డ్రగ్స్ కేసులో నిందితుల అరెస్ట్

- సైబరాబాద్ నర్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు నిందితులు అరెస్ట్
- 107 గ్రాముల కొకైన్, 25 గ్రాముల ఎక్స్టసీ మాత్రలు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- డ్రగ్స్ అంచనా విలువ సుమారు రూ.30 లక్షలు



**రాజేంద్రనగర్, జూన్23(జనం సాక్షి) :** తెలంగాణ యాంటీ నార్కో బ్యూరో, నార్సింగ్ పోలీసులు సంయుక్తంగా కలిసి నిషేధిత డ్రగ్స్ కొకైన్ విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.సోమవారం రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ మీడియా సమావేశం ద్వారా తెలిపిన ప్రకారం విశ్వసనీయ సమాచారం ప్రకారం మణికొండ మున్సిపాలిటీ అల్కాపూర్ టౌన్షిప్ లోని ప్లాట్ లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నైజీరియాన్‌కు చెందిన బిఎస్సి ఐటి చదువుతూ చుక్వుమేకా విజ్డమ్ ఒనేకా, విక్టర్ చుక్వు, చుక్వు ఎమెకా డివైన్ మేజర్ (22) మణికొండలో ఉంటున్న గోపిశెట్టి రాజేష్ (40) పెళ్లి సంబంధాలు కుదుర్చుతుంటాడు. ఇతనిపై గతంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నెంబర్ 428/2023 కేసులో కొకైన్ అమ్మడానికి ప్రయత్నిస్తుండగా అరెస్టు చేశారు. అతని సూడాన్ పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి కి చెందిన బొమ్మ దేవర వీర రాజు(32) స్థిరాస్తి వ్యాపారం చేస్తుంటాడు. నైజీరియన్ ఇద్దరు స్థానిక పాదచారులను అరెస్టు చేసి వారి నుంచి రూ.30 లక్షల విలువైన కొకైన్, 25 గ్రాముల ఎక్సటసీ మాత్రలను స్వాధీనం చేసుకుని చీస్ చేశారు.26-12-2022: సుడానీస్‌ను ఉపయోగించి విద్యార్థి వీసాపై భారతదేశంలోకి చుక్వు విక్టర్‌ను క్రైమ్ నెంబర్ 428/2023లో స్వాధీనం చేసుకున్నారు. 2023 మధ్యలో గోవాలోని హ్యాండ్లర్ మాక్స్ నుండి చుక్వు ఎమెకా డివైన్ పేరుతో నైజీరియన్ పాస్‌పోర్ట్ అందుకున్నారు. 05-09-2024: నైజీరియాకు తిరిగి వచ్చి ఈ పాస్‌పోర్ట్‌ను ధ్వంసం చేశారు.13-12-2024 నైజీరియన్ పాస్‌పోర్ట్‌తో తన అసలు పేరు చుక్వుమేకా విజ్డమ్ ఒన్యేకాతో తిరిగి భారతదేశంలోకి ప్రవేశించాడు. ఈ సందర్భంగా రేవ్ పార్టీ , డ్రగ్ డెలివరీ లో మొయినాబాద్ అజీజ్ నగర్‌లో ఫామోజులో రెగ్యులర్ కస్టమర్లలకు, మోకిలాలో రాజేష్‌ను కలిసిన తర్వాత 5 గ్రాముల కొకైన్‌ను డెలివరీ చేశాడు. 31-05-2025: రాజేష్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, మంగళగిరి జిల్లాకు వెళ్లి ఫణి రాజ్‌కి 15 గ్రాముల కొకైన్ డెలివరీ చేశాడు.ఈ సిండికేట్‌ను నైజీరియాకు చెందిన మాక్స్ ప్రిన్స్‌వెల్ బుచి గాబ్రియేల్ నిర్వహిస్తున్నాడు, అతను విద్యార్థి వీసా హోల్డర్లు నకిలీ గుర్తింపుదారులను ఉపయోగించి విదేశాల నుండి సరఫరా గొలుసులను నిర్వహిస్తున్నాడు. మొదట్లో వినియోగదారులుగా ఉన్న రాజేష్ , వీర రాజు, ఇతర వ్యక్తులతో పరిచయాలను ఏర్పరచుకుని, అధిక ధరలకు మందులు కొనడం ప్రారంభించారు. గతంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని రాయదుర్గం పోలీసులు గతంలో అరెస్టు చేసిన తర్వాత కూడా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను కొనసాగించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని రాయదుర్గం పోలీసులు గతంలో అరెస్టు చేసిన తర్వాత కూడా వారు మాదకద్రవ్యాల అక్రమ రవాణాను కొనసాగించారు. మాదకద్రవ్యాలను సేకరించడానికి గోవాను అనేకసార్లు సందర్శించి వాటిని హైదరాబాద్‌లోని ఉన్నత వర్గాలకు సరఫరా చేసి చివరికి పోలీసులు జరిపిన దాడిలో పట్టుబడ్డారు. ఈ మీడియా సమావేశంలో నార్సింగ్ ఏసిపి రమణ గౌడ్, ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

**డ్రగ్స్ ని అరికట్టేందుకు ప్రజల సహకరించాలి : రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్**



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపుతామని రాజేంద్ర నగర్ డిసిపి శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ యాంటీ నార్కో బ్యూరో , సామాజిక వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడానికి మాదకద్రవ్య రహిత తెలంగాణ కోసం కృషి చేయడానికి పోలీసులను ఫోన్ నంబర్ 8712671111 లేదా 1908 కు ,టోల్-ఫ్రీ నంబర్: 1908, 871266 71111 కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సమాచారం అందించిన వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, విశ్వసనీయ సమాచారం ఇచ్చేవారికి తగిన విధంగా బహుమతులు అందజేస్తామని డిసిపి శ్రీనివాస్ వెల్లడించారు.

# ఇజ్రాయిల్‌లో రష్యన్‌ల జనాభా ఎక్కువ

- అందుకే ఇరాన్‌కు మద్దతు ఇవ్వడం లేదు
- రష్యా అధ్యక్షుడు పుతిన్ సంచలన ప్రకటన



**మాస్కో, జూన్ 23 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్ పై దాడులు చేస్తోన్న ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా కూడా రణరంగంలోకి దిగింది. టెహ్రాన్‌లో మెరుపుదాడులు చేసింది. ఇంత జరుగుతున్నా.. ఇరాన్‌కు సుదీర్ఘకాలంగా మిత్రదేశమైన రష్యా సాయం చేసేందుకు ముందుకురాకపోవడంపై ఆశ్చర్యం నెలకొంది. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. ఈ యుద్ధంలో తాము తటస్థంగా ఎందుకు ఉంటున్నామో వివరించారు. 'ఒకప్పటి సోవియట్ యూనియన్, ఇప్పటి రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన దాదాపు 20లక్షల మంది ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నారు. మా దృష్టిలో ఇప్పుడది దాదాపు రష్యన్ మాట్లాడే దేశమే. దానిని పరిగణనలోకి తీసుకునే ఈ ఉద్రిక్తతల్లో మేం తటస్థంగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరమ్‌లో పుతిన్ వెల్లడించారు.మిత్ర దేశాలపై రష్యా నిజాయతీని కొంతమంది విమర్శిస్తున్నారని, వారంతా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారేనని పుతిన్ మండిపడ్డారు. అరబ్ దేశాలతో తమకు సుదీర్ఘకాలంగా అనుబంధం ఉందన్నారు. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్‌లో రష్యా అబ్జర్వర్‌గా ఉన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇదిలా ఉండగా.. ఇరాన్‌కు అణ్వాయుధాలపై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వదేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశానికి అణ్వాయుధాలను సరఫరా చేసేందుకు చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అయితే, వాటి పేర్లను మాత్రం వెల్లడించలేదు. ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమైన వేళ.. తటస్థంగా ఉంటామంటూ పుతిన్ వివరణ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370